
ఆంధ్రజ్యోతి
ANDHRAJYOTHY



నేడు సోమశిల నీటి విడుదల

అనంతసాగరం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి ఆదివారం సోమశిల జలాశయాన్ని సందర్శించనున్నారు. ఈ సందర్భంగా ఆయన జలహారతి ఇచ్చి క్రస్ట్‌గేట్లను ఎత్తి దిగువకు నీరు విడుదల చేయనున్నారని జలాశయం ఇంజనీర్లు తెలిపారు. కాగా సోమశిల జలాశయానికి శనివారం ఎగువ నుంచి 23,227 క్యూసెక్కుల నీటి ప్రవాహం వస్తుండగా, 73.130 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. కండలేరుకు వరద కాలువ ద్వారా 10,000, ఉత్తర కాలువకు 400, డెల్టాకు 2,350 క్యూసెక్కుల చొప్పున నీటిని సరఫరా చేస్తున్నారు.

వైద్య వ్యర్థాలపై శ్రద్ధేది?

- బయోమెడికల్ వేస్ట్ మేనేజ్‌మెంట్‌పై నిర్లక్ష్యం
- పారిశుధ్యంలో కలిసి కొత్త రోగాలకు అవకాశం
- నిబంధనలు పాటించని ఎన్నో ఆసుపత్రులు
- వైద్యులను హెచ్చరిస్తున్నామన్న ఐఎంఏ



నెల్లూరులో రైల్వేట్రాక్ పక్కనే ఉన్న ఆసుపత్రి వ్యర్థాలు

నెల్లూరు (వైద్యం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మానవ వ్యర్థాల(బయోమెడికల్ వేస్ట్) నిర్వహణపై అడగడుగునా నిర్లక్ష్యం తాండవిస్తోంది. నగరంలోని సూపర్‌స్పెషాలిటీ, స్పెషాలిటీ ఆసుపత్రుల్లో బయోమెడికల్ మేనేజ్‌మెంట్‌ను సక్రమంగా జరుగుతున్నా, చిన్నచిన్న ఆసుపత్రులలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. కొన్ని ఆసుపత్రుల నిర్లక్ష్యం కారణంగా వైద్య వ్యర్థాలు ప్రమాదకరంగా మారుతున్నాయి. నిత్యం ప్రజలు తిరిగే ప్రాంతాల్లో ఈ వ్యర్థాలు ఉండడంతో పలు అనారోగ్యాలకు కారణమవుతున్నాయి. జిల్లాలోని 1700లకుపైగా ఆసుపత్రులు ఉండగా, ఇందులో ఎక్కువ శాతం ఆసుపత్రుల్లో వాడిపడేసిన సిరంజీలు, మానవవ్యర్థాలపై నిర్లక్ష్యం కనిపిస్తున్నది. ఇక 1000కి పైగా ఉన్న ల్యాబ్‌ల్లో రక్త పరీక్షలకు వినియోగించే దూది, సిరంజీ వంటి వాటిని నిర్వీర్యం చేయకపోవడంతో పరిస్థితి ప్రమాదకరంగా మారుతోంది. నెల్లూరు నగరంలోని పొగతోటలో ఉన్న పలుఆసుపత్రులు, ల్యాబ్‌లు ఆసుపత్రుల వ్యర్థాలను రోడ్ల పక్కనే వేయడం వల్ల రోగాలు సంక్రమిస్తున్నాయి. పారిశుధ్య సిబ్బంది ఆయా వ్యర్థాల తరలింపు కారణంగా అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.



ప్రతి ఆసుపత్రిలో ఉండాల్సిన డబ్బాలు

వ్యర్థాల సేకరణ ఇలా..

- నర్సింగ్ సిబ్బంది వ్యర్థ పదార్థాల డబ్బా, కవర్లు 3/4వ వంతు నిండిన తరువాత గట్టిగా కట్టేటట్లు చర్యలు తీసుకోవాలి.
- వ్యర్థాలు ఉత్పత్తి అయ్యే ప్రదేశాల్లో ఎక్కువ వ్యర్థాలు నిల్వ కాకుండా చర్యలు తీసుకోవాలి.
- డబ్బాలలోని వ్యర్థాలను పారవేసిన తరువాత తిరిగి అదే రంగు గల కవర్లను డబ్బాలకు అమర్చుకోవాలి.

నిర్వీర్యం ఇలా...

- శరీర సంబంధ వ్యర్థాలను జాగ్రత్తగా బూడిద చేసి నాశనం చేయాలి. లేదంటే రెండు మీటర్ల గోయి తవ్వి పూడ్చివేయాలి.
- ప్లాస్టిక్ వ్యర్థాలకు సంబంధించి వాటిని ముక్కలు చేసి సోడియం హైపోక్లోరైట్ ద్రావణంలో గంట సేపు ఉంచి ఆటోక్లేవ్‌లో నిర్వీర్యం చేయాలి.
- పదునైన వ్యర్థాలు, బ్లేడ్‌లు, సూదులు, సిరంజీలు, గాజులను సోడియం హైపోక్లోరైట్ ద్రావణంలో ఉంచి శుద్ధి చేసే యంత్రాలకు పంపాలి.
- పాదరస వ్యర్థాలను కొంత నీరు కలిగిన సీసాలో ఉంచాలి. చేతులతో తాకరాదు. అట్టముక్కల సాయంతో పాదరస బిందువులను సేకరించాలి.

ఎప్పటికప్పుడు హెచ్చరిస్తున్నాం..

ఇండియన్ మెడికల్ అసోసియేషన్ (ఐఎంఏ) సమావేశ మందిరంలో నిర్వహించే వైద్యుల సదస్సులో ప్రత్యేకంగా బయోమెడికల్ మేనేజ్‌మెంట్‌ను సక్రమంగా నిర్వహించాలని పదే పదే హెచ్చరిస్తున్నాం. ఎస్ఎస్ బయోమెడికల్ సంస్థ ద్వారా ఆయా ఆసుపత్రుల వ్యర్థాలను నిర్వీర్యం చేస్తున్నారు. వీటి పట్ల జాగ్రత్తగా ఉండాలని వైద్యులకు చెబుతున్నాం. ఆసుపత్రి వ్యర్థాలను 48 గంటలలోపు నిర్వీర్యం చేయాలి. అలా నిర్వీర్యం చేయకపోతే పలు వ్యాధులు వచ్చే అవకాశం ఉంది.



- డాక్టర్ అమరేంద్రనాథ్‌రెడ్డి, ఐఎంఏ జిల్లా అధ్యక్షుడు, ప్రభుత్వ వైద్యులు

• వ్యర్థాల నిర్వహణ ఎలా..?

మానవ వ్యర్థాల నిర్వహణలో ఎరుపు, పసుపు, బులుగు రంగుల డబ్బాలు, పీపీసీ బిన్ వంటి కవర్లను వాడాలి. ఎరుపు డబ్బాలో వేసే మందపాటి ఎర్రకవర్‌లో డిస్పోజబుల్ సిరంజీలు, వీవీట్యూబ్స్, కెథెటర్స్, ఇతర ట్యూబ్‌లు, బ్లడ్‌బ్యాగ్స్, యూరిన్‌బ్యాగ్ వంటివి వేయాలి. పసుపురంగు డబ్బాకవర్‌లో కణజాలాలు, శరీర భాగాలు, ప్లసెంటా, ఎంబ్రాస్టర్ పిండాలు, అంగాలు, నెత్తురు, చీము, డ్రస్సింగ్ వేస్ట్ వంటివి వేయాలి. బులుగు డబ్బా కవర్‌లో గాజు సీసాలు, పీపీపీ బిన్‌లోని కవర్‌లో బ్లేడ్‌లు, ఇంజక్షన్ మందు ఉండే పగిలిన వయల్స్, వెయిల్స్, రోగికి ఉపయోగించే పదునైన వస్తువులు వేయాలి. వీటి నిర్వహణ బాధ్యతను నర్సులు చేపట్టాలి. వీటిపై పర్యవేక్షణను అధికారులు చేపట్టాలి. పైగా ఎస్ఎస్ బయోకేర్ ద్వారా ఈ వ్యర్థాలను తరలిస్తుండటం వల్ల ఇక్కడకు వచ్చే రోగులు, సహాయకులు తీవ్ర అనారోగ్యం బారిన పడే అవకాశం ఉంది.





కుటుంబ సభ్యులతో కలిసి బాధ్యతలు చేపట్టిన హిమాన్షు శుక్లా

కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా

- కుటుంబ సభ్యులతో కలిసి బాధ్యతల స్వీకరణ

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కలెక్టర్‌గా హిమాన్షు శుక్లా శనివారం కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్‌లో బాధ్యతలు స్వీకరించారు. ఈ కార్యక్రమంలో ఆయన శ్రీమతి పల్నాడు జిల్లా కలెక్టర్ కృతికా శుక్లా, ఇతర కుటుంబ సభ్యులు పాల్గొన్నారు. కలెక్టరేట్‌కు వచ్చిన ఆయనకు తొలుత జేసీ కే. కార్తీక్, కందుకూరు సబ్ కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో విజయకుమార్ పుష్పగుచ్చం అందచేసి ఘన స్వాగతం పలికారు. అనంతరం వేద పండితులు పూర్ణకుంభం స్వాగతం పలకగా వేద మంత్రోచ్చరణ మధ్య బాధ్యతలు స్వీకరించారు. సమాచార పౌరసంబంధాలశాఖలో డైరెక్టర్‌గా పనిచేస్తూ ఆయన జిల్లాకు బదిలీపై వచ్చారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యం



అందరికీ అందుబాటులో ఉంటూ ప్రజా సమస్యల పరిష్కారానికి తొలి ప్రాధాన్యతనిచ్చి పనిచేస్తానని కలెక్టర్ హిమాన్షు శుక్లా చెప్పారు. బాధ్యతలు స్వీకరించాక తిక్కన భవన్‌లో ఆయన మీడియాతో మాట్లాడారు. రాష్ట్రం కోసం ప్రాణత్యాగం చేసిన అమరజీవి శ్రీపొట్టి శ్రీరాములు పేరుమీద ఏర్పాటైన జిల్లాకు కలెక్టర్‌గా రావటం సంతోషంగా ఉందన్నారు. గతంలో ఎంతో మంది కలెక్టర్లు గొప్పగా పనిచేసి జిల్లా అభివృద్ధికి పాటుపడ్డారన్నారు. వారి స్ఫూర్తితో పనిచేసి అభివృద్ధిని కొనసాగిస్తామన్నారు. ప్రజాప్రతినిధులు, అధికారులు, ఇతరుల సమన్వయంతో జిల్లా సమగ్ర అభివృద్ధికి కృషి చేస్తానని ఆయన చెప్పారు. ప్రజాస్వామ్యంలో నాలుగో స్తంభమైన మీడియా గణనీయమైన పాత్ర పోషించాలని, ప్రభుత్వం చేసే మంచి పనులను అందరికీ తెలియ చేయాలన్నారు.

ఎస్పీగా అజిత


- జిల్లా పోలీసులకు తొలి మహిళా బాస్
- ఇంటర్ విద్య నెల్లూరులో...



నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా అజిత వేజండ్ల నియమితులయ్యారు. రాష్ట్ర వ్యాప్తంగా శనివారం ఐపీఎస్ అధికారులను బదిలీ చేస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఈ క్రమంలో నెల్లూరు జిల్లాకు తొలి మహిళ ఎస్పీగా ఆమెను నియమించారు. గుంటూరు జిల్లాకు చెందిన అజిత తల్లిదండ్రులు బ్యాంకు ఉద్యోగులు. ఆమె హైదరాబాద్‌లోని సెయింటాన్స్‌లో ప్రాథమిక స్థాయి నుంచి పదోతరగతి వరకు చదువుకున్నారు. నెల్లూరు నారాయణ కళాశాలలో ఇంటర్ పూర్తి చేసి, మద్రాస్ ఐఐటీలో మెకానికల్ ఇంజనీరంగ్ పూర్తి చేశారు. అనంతరం స్కాలర్‌షిప్‌తో యూఎస్‌లో ఎంఎస్ ఫైనాన్స్ కోర్సు పూర్తి చేసి అక్కడే ఫైనాన్స్ విభాగాల్లో బాధ్యతలు నిర్వహించారు. సివిల్స్ సాధించాలన్న లక్ష్యంతో తిరిగి స్వదేశానికి వచ్చారు. హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీలో ఎకనమిక్స్‌లో పీహెచ్‌డీ చేస్తూనే సివిల్స్‌లో విజయం సాధించారు. 2015 బ్యాచ్‌కి చెందిన అజిత తొలుత అనంతపురం ఏపీఎస్పీ బెటాలియన్ కమాండెంట్‌గా పనిచేశారు. తదుపరి విశాఖపట్నంలో సెబ్ ఏఎస్పీగా, ప్రస్తుతం విశాఖపట్నం డీసీపీగా పనిచేస్తూ బదిలీపై జిల్లా ఎస్పీగా రానున్నారు.

ఏపీఎంఐపీ పీడీ శ్రీనివాసులు బదిలీ

- ఆయన స్థానంలో నంద్యాల పీడీ సత్యనారాయణ



శ్రీనివాసులు

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ సూక్ష్మనీటిపారుదల ప్రాజెక్టు(ఏపీఎంఐపీ) జిల్లా ప్రాజెక్టు డైరెక్టరు బీ.శ్రీనివాసులు బదిలీ అయ్యారు. ఆయన స్థానంలో నంద్యాల ఏపీఎంఐపీ పీడీ సత్యనారాయణ రానున్నారు. జిల్లాలో దాదాపు రెండేళ్లుగా ఏపీఎం శ్రీనివాసులు విధులు నిర్వహిస్తూనే, పలు శాఖలకు ఇన్‌చార్జిగా బాధ్యతలు నిర్వహించారు. డ్వామా పీడీగా, సోషల్ వెల్ఫేర్ డీడీగా, ఎస్సీ కార్పొరేషన్ ఈడీగా అదనపు బాధ్యతలు నిర్వర్తించారు. ప్రస్తుతం ఏపీఎంఐపీ పీడీతోపాటుగా జిల్లా ట్రైబల్ వెల్ఫేర్ అధికారిగా కూడా ఆయన అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్నారు. సాధారణ బదిలీల్లో భాగంగా ఆయన అమరావతి డెవలప్‌మెంట్ కార్పొరేషన్‌కు బదిలీ అయ్యారు.

రాజీయే రాజమార్గం

- జాతీయ లోక్ అదాలత్‌లో జిల్లా ప్రధాన న్యాయాధికారి
- జిల్లా వ్యాప్తంగా 8920 కేసుల పరిష్కారం

నెల్లూరు (లీగల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఏ కేసులోనైనా ఇరువర్గాలు సుహృద్భావ వాతావరణంలో రాజీ చేసుకుంటే, అది రాజమార్గం వంటిదని జిల్లా ప్రధాన న్యాయాధికారి జీ.శ్రీనివాస్ అన్నారు. శనివారం నెల్లూరు నగరంలోని జిల్లా కోర్టు ప్రాంగణంలో జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహించారు. జిల్లా ప్రధాన న్యాయాధికారి ఈ లోక్ అదాలత్‌ను లాంఛనంగా ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాజీకి యోగ్యమైన సివిల్, క్రిమినల్, కుటుంబ తగాదాలు, లేబర్‌కోర్టు కేసులు, బ్యాంకు కేసులు, నెల్లూరు మున్సిపాలిటీకి సంబంధించిన కేసులు లోక్ అదాలత్‌లో పరిష్కారమవుతాయని తెలిపారు. ఆయన జిల్లా కోర్టు ప్రాంగణమంతా తిరుగుతూ కేసుల పరిష్కారానికి కృషి చేశారు. నెల్లూరు మున్సిపాలిటీకి సంబంధించి వివిధ కేసుల్లో పరిహారం కింద రూ.1,11,96,783 చెల్లించేలా రాజీ కుదిర్చారు. అలాగే విద్యుత్‌శాఖకు సంబంధించి రూ.33,69,500, జిల్లా పంచాయతీరాజ్‌కు సంబంధించి రూ.1,65,76,000లు పరిహారం కింద వచ్చేలా కేసులు పరిష్కరించారు. కాగా జిల్లా వ్యాప్తంగా అన్నీ కేసులకు సంబంధించి రూ.7,86,44,647లు పరిహారం కింద చెల్లించేలా పలు కేసులను పరిష్కరించారు. జిల్లా వ్యాప్తంగా మొత్తం 8920 కేసులు పరిష్కరింబడ్డాయి. ఈ కార్యక్రమంలో ఒకటవ, మూడవ, నాలుగవ, ఆరవ, 8వ అదనపు జిల్లా జడ్జీలు, రాష్ట్ర బార్ కౌన్సిల్ మెంబర్ వేనాటి చంద్రశేఖర్‌రెడ్డి, నెల్లూరు బార్ అసోసియేషన్ అధ్యక్షుడు పులిమి అయ్యప్పరెడ్డి, జిల్లా లీగల్ సర్వీసెస్ అథారిటీ సెక్రటరీ కే.వాణి, నెల్లూరు మున్సిపల్ డిప్యూటీ కమిషనర్ చెన్నుడు, మున్సిపల్ స్టాండింగ్ కౌన్సిల్ వేలూరు రంగారావు, విద్యుత్ సీఐ. ఇల్లూరి అంజనేయరెడ్డి, డీపీవో శ్రీధర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.



లోక్ అదాలత్‌లో మాట్లాడుతున్న జిల్లా ప్రధాన న్యాయాధికారి శ్రీనివాస్



నవోదయ స్కూల్ ప్రిన్సిపాల్ దాష్టీకం

- విద్యార్థిని చితకబాదడంతో తలకు తీవ్రగాయాలు

మర్రిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని కృష్ణాపురంలోని జవహర్ నవోదయ విద్యాలయంలోని విద్యార్థులు కొంతకాలంగా నరక యాతన అనుభవిస్తున్నారు. తల్లిదండ్రులకు కూడా చెప్పుకోలేక, మనసులో దాచుకోలేక, వేదనను భరించలేక నలిగిపోతున్నారు. ఈ పరిస్థితికి ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ పెత్తనస్వామి కర్కశత్వమే కారణం. బాధిత విద్యార్థి పలకాయల మహేష్‌బాబు కథన మేరకు వివారాలు... శనివారం రాత్రి భోజన సమయంలో గమనించుకోకుండా ఇన్‌చార్జి ప్రిన్సిపాల్‌కి ఎదురుగా తోటి విద్యార్థులతో కలిసి మహేష్‌బాబు వేగంగా వెళ్లాడు. నేనంటే కొంచం కూడా భయం లేదా..? అంటూ వారందరినీ ఇంగ్లిష్‌లో దుర్భాషలాడాడు. భోజనం అనంతరం వారు స్టడీకి కూర్చున సమయంలో టాయిలెట్‌కు అంటూ మహేష్‌బాబు వెళ్లాడు. ఆ విద్యార్థి వెనకాలే ఇన్‌చార్జి ప్రిన్సిపాల్ వెళ్లి బాత్‌రూమ్ డోరు వేసి విద్యార్థి తలను గోడకు వేసి కొట్టాడు. ఇంకా చిత్రహింసలు పెట్టడంతో ఆ విద్యార్థి తలకు బలమైన గాయం అయింది. రక్తం కారుకుంటూ ఏడుస్తున్న విద్యార్థిని ఆ బాత్‌రూమ్‌లోనే ఉంచి సుమారు 20నుంచి 30నిమిషాలపాటు గడిపెట్టాడు. ఆ విద్యార్థి అరుపులు విని ఓ ఉపాధ్యాయుడు వచ్చి గడియ తీయబోయాడు. అంతలో పెత్తనస్వామి ఆ ఉపాధ్యాయుడిపై కూడా కేకలు వేస్తూ 'నాట్ ఓపెన్ ద డోర్.. ఐయామ్ ఓపెన్ టుమారో మార్నింగ్... అంటూ అరిచాడు. చివరకు స్కూలులోని ఉపాధ్యాయులంతా అక్కడికి చేరుకొని తలుపు తీసి కారులో ఆ విద్యార్థిని మర్రిపాడు ప్రభుత్వ వైద్యశాలకు తీసుకొనివచ్చారు. డాక్టర్ గోపీనాథ్ ఆ విద్యార్థి తలకు కుట్లు వేసి చికిత్స చేశారు.



క్రీడా పోటీలను ప్రారంభిస్తున్న పీఆర్ ఎస్ఈ కోటేశ్వరరావు

ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదం

- పంచాయతీరాజ్ పర్యవేక్షక ఇంజనీర్ కోటేశ్వరరావు

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆరోగ్య పరిరక్షణకు క్రీడలు దోహదం చేస్తాయని పంచాయతీరాజ్ సూపరింటెండెంట్ ఇంజనీర్ వై.కోటేశ్వరరావు తెలిపారు. ఏపీ పంచాయతీరాజ్ ఇంజనీర్ల సంఘం, డిప్లమో ఇంజనీ ర్ల సంఘం సంయుక్త కార్యాచరణ కమిటీ ఆధ్వర్యంలో నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో శనివారం క్రీడాపోటీలను ఆయన ప్రారంభించారు. అనంతరం మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడాస్ఫూర్తిని ప్రదర్శిస్తూ ఆటల్లో ప్రతిభ చూపాలన్నారు. క్రీడలతో మానసిక, శారీరక ఒత్తిడిని అధిగమించి, ఉద్యోగులు మరింత ఉత్సాహంగా పనిచేయాలని తెలిపారు. అనంతరం క్రికెట్‌ను ఆడి, పోటీలను లాంఛనం గా ప్రారంభించారు. క్రికెట్‌తోపాటు షటిల్, వాలీబాల్, క్యారమ్, చెస్, రింగ్‌బాల్, పరుగుపందెం పోటీలు నిర్వహించారు. విజేతలకు ఈనెల 15న జడ్పీలో ఇంజనీర్స్‌డేలో బహుమతులు అందచేయనున్నారు. ఈ కార్యక్రమంలో ఈఈలు బీ.సత్యనారాయణరెడ్డి, కేజేఎస్.చంద్రారెడ్డి, బీ.సుబ్బరాజు, బీ.రమణయ్య, నీ.సుమన, పీఆర్ డిప్లమో ఇంజనీర్ల సంఘం రాష్ట్ర గౌరవాధ్యక్షుడు ఎస్‌కే.రియాజ్ అహ్మద్, పీఆర్ ఇంజనీర్ల సంఘాల జేఏసీ చైర్మన్ ఎం.బాబూరావు, ప్రధాన కార్యదర్శి ఎస్‌కె.ఖాదర్‌మస్తాన్ తదితరులు పాల్గొన్నారు.

వృద్ధులకు అండగా..

- నేనున్నానంటూ విశ్రాంత ఉద్యోగి భరోసా
- భారత్ సేవా ఫౌండేషన్ స్థాపన
- అన్న క్యాంటీన్‌కు నెలనెలా విరాళం
- జాఘవా గ్రంథాలయ నిర్మాణానికి పోరాటం

కొంతమంది సంపాదనే ధ్యేయంగా పనిచేస్తుంటారు... అలాంటివారు ఎంత సంపాదించినా తృప్తి లేకుండా బతుకుతుంటారు... అయితే మరికొంత మంది తమకు ఉన్నంతలో ఇతరులకు దానం చేస్తూ చరిత్రలో నిలిచిపోతుంటారు... ఈ కోవకు చెందిన వారే నెల్లూరు నగరంలోని సావిత్రీ నగర్‌కి చెందిన విశ్రాంత సోషల్ వెల్ఫేర్ ఆఫీసర్ షేక్ ఖాసీం. ఉద్యోగం చేస్తూనే సేవా కార్యక్రమాలకు శ్రీకారం చుట్టారాయన. ఉద్యోగ విరమణ తరువాత కూడా వాటిని కొనసాగిస్తున్నారు.

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) షేక్ ఖాసీం 1974లో సాంఘిక సంక్షేమశాఖలో అధికారిగా ఉద్యోగంలో చేరారు. 2005లో ఏఎస్‌డబ్ల్యూవోగా ప్రకాశం జిల్లా అద్దంకిలో పదవీ విరమణ చేశారు. నెల్లూరులో పనిచేసేటప్పుడు పదోతరగతి ఉత్తమ ఫలితాల సాధనకు విద్యార్థులకు సొంత నిధులతో ట్యూటర్‌ను ఏర్పాటు చేశారు. వారిలో సామాజిక చైతన్యం తెచ్చేందుకు అంబేడ్కర్ జయంతి రోజున వ్యాసరచన, వక్తృత్వ, డ్రాయింగ్, నృత్య, పాటలు పోటీలు నిర్వహిస్తూ బహుమతులు అందచేసేవారు. హాస్టళ్ల శుభ్రతకు సొంత నిధులు ఖర్చు చేశారు. ఆయన సేవలను మెచ్చుకున్న అప్పటి కలెక్టర్లు సుజాతరావు, టీ. గోపాల్‌రావు, కే రాజు, ప్రకాశం కలెక్టర్ ఉదయలక్ష్మి తదితరులు ఆయనకు ఉత్తమ అధికారిగా అవార్డులు అందచేశారు.

• నెలనెలా విరాళం



అన్నక్యాంటీన్ స్థాపన నుంచి ప్రతినెలా తన పెన్షన్ నుంచి రూ.5వేల విరాళం అంచేస్తున్నారు. ఇప్పటివరకు రూ.70వేలు అందచేశారు. దీంతో సీఎం చంద్రబాబు, ఐటీశాఖామంత్రి నారాలోకేష్ ఆయనను ప్రశంసిస్తూ లేఖలు పంపారు. అంతేకాక ఆయన ప్రభుత్వ పెన్షనర్ల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడిగా ఉంటూ విశ్రాంత ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తున్నారు. పెన్షనర్ల భవన నిర్మాణానికి రూ. 80వేల ఆర్థిక సహాయం అందించారు. ప్రజాసేవ కోసం భారత సేవా ఫౌండేషన్‌ను స్థాపించారు. ఆర్డీవో కార్యాలయానికి సోమవారం వచ్చే అర్జీదారులకు అన్న సంతర్పణ చేస్తున్నారు. ప్లాస్టిక్ రహిత సమాజం కోసం విశ్రాంత లెక్చరర్ కాటూరు కుసుమకుమారితో కలిసి పోరాటాలు చేస్తున్నారు. గుడ్డ సంచులనే వాడాలని సూచిస్తూ వందలాది మందికి ఉచితంగా వాటిని పంచి పెడుతున్నారు. భారత సేవా ఫౌండేషన్ ద్వారా స్వచ్ఛాంధ్ర, స్వచ్ఛభారత్ నినాదంతో పర్యావరణ పరిరక్షణ, మొక్కల పెంపకంపై, పరిసరాల పరిశుభ్రత గురించి ప్రజలను చైతన్యవంతులను చేస్తున్నారు. రూ. 60 వేల సొంత నిధులు వెచ్చించి పాఠశాలలు, నగరంలోని పలు ప్రాంతాల్లో మొక్కలు నాటించి, వాటి సంరక్షణ చూస్తున్నారు. ప్రగతి చారిటీస్‌లోని అనాథలకు నిత్యావసర సరకులు అందించారు. ప్రజలకు ఓటు విలువలను తెలయచేస్తూ వారు హక్కును వినియోగించుకునేలా చేస్తున్నారు. ప్రజల్లో అక్షరాస్యతశాతం పెంచేందుకు అనేక కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు.

• గ్రంథాలయ నిర్మాణానికి..

నగరంలోని మద్రాసు బస్టాండ్ సమీపంలో గుర్రం జాషువా గ్రంథాలయ నిర్మాణం అర్థంతరంగా ఆగింది. దాని నిర్మాణానికి రూ.2.50 లక్షల సొంత నిధులను అందచేశారు. నిర్మాణం తరువాత, కంప్యూటర్లు ఇతర పరికరాలు సమకూర్చి నిరుద్యోగుకు ఉపయోగపడేలా శిక్షణ ఇప్పిస్తున్నారు. పీ-4 విధానంలో గ్రంథాలయ నిర్మాణానికి సహకరించాలని పిలుపునిచ్చారు. జాషువా గ్రంథాలయం ఉండే వీధికి గుర్రం జాషువా వీధిగా నామకరణం చేయాలని పోరాడారు. కౌన్సిల్‌లో అందుకు ఆమోదం లభించింది. దీంతో నామకరణ జరిగింది. ఆయన సేవలను గుర్తించిన డయాడాట్ ఫౌండేషన్ విశిష్ట సామాజిక సేవా అవార్డు-2025ను ప్రకటించింది. వయసు పైబడుతున్నా ఏ మాత్రం వెనుకడుగు వేయక సేవా కార్యక్రమాల్లో పాల్గొన్నారు. తిరిగినన్ని రోజులు ప్రజా సేవకే అంకితమవుతానని

Sunday SPECIAL



మహిళకు గుడ్డ సంచులు అందచేస్తున్న ఖాసీం తదితరులు

అక్టోబరు 2 వరకు సేవా పక్షోత్సవాలు

ఇందుకూరుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : 'నరేంద్ర మోదీ సేవా పక్వాడ్‌'లో భాగంగా స్థానిక కొత్తూరు బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు కైలాసం శ్రీనివాసులు రెడ్డి ఆధ్వర్యంలో శనివారం మండల సమావేశం జరిగింది. ముందుగా నూతన ఉప రాష్ట్రపతి రాధాకృష్ణన్‌కు అభినందనలు తెలిపారు. జిల్లా పక్వాడ్ రావూరు అశోక్, మాట్లాడుతూ ఈనెల 17 నుంచి అక్టోబరు 2 వరకు సేవా కార్యక్రమాలు జరుపుతామన్నారు. జిల్లా ఉపాధ్యక్షుడు కాసా శ్రీనివాసులు, శివప్రసాద్, శ్రీనివాసులు, వెంకట్రావు, రామలింగయ్యస్వామి పాల్గొన్నారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10496
వెండి కిలో ధర	రూ. 132600
వెండి ఒక గ్రాము	రూ. 135.30



రీసర్వే తప్పిదాలను సరిదిద్దుతున్నాం

వేంకటేశ్వర్లు, తహసీల్దారు, బుచ్చి

గత ప్రభుత్వ హయాంలో జరిగిన రీసర్వే తప్పిదాలను సరిదిద్ది రాష్ట్ర ప్రభుత్వం రైతులకు కొత్త పాసుపుస్తకాలు అందిస్తు న్నట్లు బుచ్చి తహసీల్దారు అంబటి వేంకటేశ్వర్లు తెలిపారు. రైతుల నుంచి పిర్యాదులు అందితే చిన్న చిన్న తప్పిదాలను అప్పటికప్పుడే సరిదిద్దుతున్నామన్నారు.

?. కొత్త పాసుపుస్తకాలతో రీసర్వే సమస్యలు పరిష్కారమౌతాయా

!. గత ప్రభుత్వంలో రీ సర్వేలో చోటు చేసుకున్న తప్పిదాలను రికార్డులను పరిశీలించి సరిదిద్దుతున్నాం. ఆ నివేదికలను జాయింట్ కలెక్టర్‌కు పంపిస్తున్నాం. కొత్త పాసు పుస్తకాల పంపిణీ చేస్తున్నాం.

?. విస్తీర్ణంలో హెచ్చు తగ్గుల తప్పి దాలను ఎలా పరిష్కరిస్తారు

!. భూముల విస్తీర్ణంలో హెచ్చు, తగ్గులపై చిన్న చిన్న తప్పిదాలను సరిదిద్దుతున్నాం. ఎల్పీఎం నెంబరు, పాత సర్వే నెంబరును పరిశీలించి తాజాగా ముద్రించి రైతులకు పాసు పుస్తకాలు అందజేస్తారు.

?.ఎన్ని గ్రామాలలో రీసర్వే పూర్తయింది

!. బుచ్చి మండలంలో మొత్తం 14 రెవెన్యూ గ్రామాలకు గాను ఇప్పటి వరకు 11 రెవెన్యూ గ్రామాలలో రీ సర్వే పూర్తయింది. వెబ్ ల్యాండ్ 2.0 నడుస్తోంది. మిగిలిన 3 గ్రామాలలో రీసర్వే చేపట్టాల్సి వుంది. ఇస్కపాళెం కూడా పూర్తయింది. వవ్వేరు కావేటిపాళెం 3వ దశలో చేస్తాం.

?. ప్రభుత్వ భూముల్లో హద్దు రాళ్ళు వేయకుండా సర్వేతో సర్దుకున్నారనే విమర్శలున్నాయి.

!. ఇరిగేషన్ అధికారులు ఫిర్యాదు చేస్తే రికార్డులు పరిశీలించి హద్దు రాళ్ళు వేసి, ప్రభుత్వ కాలువలు, పోరంబోకులు, బఫర్ జోన్లను తప్పకుండా కాపాడుతాం.

?. కొత్త పాసుపుస్తకాలు పంపిణీ చేయడానికి ఎన్ని నెలలు పడుతుంది

!. గతంలో జరిగిన తప్పులు సరిదిద్ది రైతులకు పాసు పుస్తకాలు అందజేయాలంటే సుమారు 2 నెలలు పడుతుంది.

- బుచ్చిరెడ్డిపాళెం (ఆంధ్రజ్యోతి)

గొలగమూడిలో భక్తుల రద్దీ

వెంకటాచలం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ప్రసిద్ధ పుణ్యక్షేత్రమైన గొలగ మూడి భగవాన్ శ్రీ వెంకయ్యస్వామి ఆశ్రమంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. తమిళనాడు, కర్ణాటక, తెలంగాణతోపాటు రాష్ట్ర నలమూలల నుంచి అధిక సంఖ్యలో భక్తులు తరలి వచ్చి స్వామిని దర్శించుకున్నారు. కొందరు భక్తులు స్వామివారికి తలనీలాలు సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు.

బాలికలారా.. అప్రమత్తతే మీ ఆయుధం!

ఇందుకూరుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : బాలికల భద్రతే లక్ష్యంగా శక్తి బృందం పాఠశాలలు, కళాశాలల్లో అవగాహన సదస్సులు నిర్వహిస్తోంది. ఇటీవల బాలికల పట్ల అసభ్యంగా ప్రవర్తించడంతో పోక్సో కేసులు సైతం నమోదైన ఉదంతాలు ఉన్నాయి. వీటికి అడ్డుకట్ట వేసేందుకు రాష్ట్ర ప్రభుత్వం చర్యలు చేపట్టింది. విద్యార్థులతో పాటు గ్రామీణ ప్రాంతాలలో స్వయం సహాయక సంఘాల మహిళలకు అవగాహన కల్పిస్తున్నారు.

● **గుడ్ టచ్.. బ్యాడ్ టచ్...**

ఎవరైనా బాలికలను తాకరాని చోట తాకినా.. దురుద్దేశంతో వ్యవహరించినా నేరమేనని విద్యార్థులలో అవగాహన కల్పిస్తున్నారు. ఎవరైనా అసభ్యంగా ప్రవర్తిస్తే వెంటనే తల్లిదండ్రులు, పోలీసులు, ఉపాధ్యాయులకు సమాచారం ఇవ్వాలని సూచిస్తున్నారు. అలాగే ఉన్నత పాఠశాలలు, ఇంటర్ కళాశాలల్లో బాల్యవివాహాల వల్ల కలిగే అనర్థాలను వివరిస్తున్నారు.



బాలికలకు అవగాహన కల్పిస్తున్న ఉపాధ్యాయులు

● **అన్నీ యాప్‌లోనే...**

పోలీసు స్టేషన్ వెళ్లకుండానే సచివాలయం, మహిళా పోలీసులకు సమాచారం అందించాలంటే శక్తి యాప్‌ను ఫోన్‌లో డౌన్‌లోడ్ చేసుకుని అందులోని హెల్ప్‌లైన్ నెంబరుకు ఫిర్యాదు చేయవచ్చు. దూర ప్రాంతాలకు వెళ్లినప్పుడు అనుకోకుండా అక్కడే రాత్రి బస చేయాల్సిన అవసరం వస్తే శక్తి యాప్‌లో సమాచారం అందిస్తే మహిళా పోలీసు లు రక్షణ కల్పిస్తారు. విద్యార్థులు ఆటోలు, ఇతర వాహ నాలు ఎక్కినప్పుడు 'సేఫ్ ట్రాక్- సేఫ్ హోమ్' యాప్‌లను వినియోగించి జాగ్రత్తలు తీసుకోవాల్సిన తీరుపై అవగా హన కల్పిస్తున్నారు.

చైతన్యపరచడమే లక్ష్యం



మండలంలోని పాఠశాలల్లో విద్యార్థులకు, స్వయం సహాయక సంఘాల సభ్యులకు అవగాహన కల్పించాం. అన్నీ పాఠశాలల్లో సదస్సులు పూర్తి చేశాం. పాఠశాల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులను అప్రమత్తం చేస్తున్నాం.

- నాగార్జునరెడ్డి, ఎస్ఐ, ఇందుకూరుపేట

పొదలకూరులో రాతి కట్టడంతో రామాలయం

● రూ.1.25 కోట్లతో పనులు
● వివిధ ప్రాంతాల నుంచి దాతల సహకారం



రాతితో నిర్మిస్తున్న రామాలయం

పొదలకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ నవమి వేడుకల్లో బహత్తర కార్యక్రమానికి భక్తులు శ్రీకారం చుట్టారు. దశాబ్దాలుగా ఉన్న రామమందిరం శిథిలమై పోతుండడంతో దానిస్థానంలో సీతారాముల ఆలయం నిర్మించేందుకు సంకల్పించారు. ఇందుకోసం గ్రామ పెద్దలు తీర్మానం చేసి భక్తుల మనోభావాలను తెలుసుకుని అందరూ ముక్త కంఠంతో రామయ్యకు దేవాలయాన్ని నిర్మిద్దామని పనులు ప్రారంభించారు. ప్రస్తుతం అవి శరవేగంగా జరుగుతున్నాయి. తిరుపతికి చెందిన స్థపతికి ఆలయ నిర్మాణ పనులను అప్పగించారు. దేశ విదేశాలు, వివిధ ప్రాంతాల నుంచి సైతం దాతలు స్పందించి విరాళాలు ప్రకటిస్తున్నారు.

● **ఎన్నో సంవత్సరాల క్రితం....**

పొదలకూరు పట్టణం నడిబొడ్డులో 1936వ సంవత్సరంలో రామమందిరాన్ని నిర్మించారు. అప్పటి నుంచి రంగులు వేయిస్తూ నవమి వేడు కలను నిర్వహిస్తున్నారు. ఎంతో చరిత్ర కలిగి మందిరంలో ప్రతినిత్యం ధూపదీప నైవేద్యాలతోపాటు భక్తులు పాల్గొనేవారు.

● **బేస్ లెవల్ వరకు జరిగిన పనులు...**

రామ సంకీర్తలను ఆలపిస్తుంటారు. ఉన్న చిన్నపాటి స్థలంలోనే సుమారు రూ.1.25కోట్లు వెచ్చించి రామాలయాన్ని నిర్మించుకోవాలని తీర్మానంలో పొందుపరిచారు.

● **పూర్తిగా రాతి కట్టడం..**

రామాలయం పూర్తిగా రాతి కట్టడమేనని ఆలయ నిర్మాణ కమిటీ వెల్లడించింది. రాళ్లను బయటిల ప్రాంతాల నుంచి తెప్పించి, స్థపతి ఆదేశాల మేరకు కూలీలు చెక్కి ప్రస్తుతం బేస్ లెవల్ పనులను తీసుకొచ్చారు. వీలైనంత త్వరగా పూర్తి చేసి ఆలయంలో విగ్రహాలను పునః ప్రతిష్ఠ చేసేందుకు నిర్మాణ కమిటీ వడివడిగా అడుగులు వేస్తున్నారు.

పతంజలి సహ యోగ ఉపాధ్యాయ శిక్షణకు రాత పరీక్షలు



పరీక్షలు రాస్తున్న యోగ సాధకులు

బుచ్చిరెడ్డిపాళెం, సెప్టెంబరు13 (ఆంధ్రజ్యోతి): స్థానిక కన్యకాపరమేశ్వరి కళ్యాణమండపంలో శనివారం పతంజలి యోగ సమితి జిల్లా అధ్యక్షుడు పెంచలయ్య అధ్వర్యంలో పతంజలి సహ యోగ ఉపాధ్యాయ శిక్షణా తరగతు లకు రాత పరీక్షలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న పలువురు యోగ సాధకులు పరీక్షలు రాశారు. ఇన్విజిలేటర్‌గా ఈ రమణయ్య, ముఖ్య అతిథిగా డాక్టర్ ఎన్వీ రాజు, కో ఆర్డినేటర్‌గా జె రాజేంద్రకుమార్ వ్యవహరించారు. పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించిన అభ్యర్థులు హరిద్వార్‌లో జరిగే ప్రత్యేక యోగ ఉపాధ్యాయ శిక్షణ కార్యక్రమంలో పాల్గొంటారని పతంజలి యోగ సమితి నిర్వాహకులు తెలిపారు.

సభలు, సమావేశాలకు అనుమతుల్లేవు: సీఐ

ఉదయగిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో పోలీసు సెక్షన్ 30 అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, పరామర్శలకు ఎలాంటి అనుమతుల్లేవని సీఐ ఎన్ వెంకటరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల వరికుంటపాడు మండలంలోని కనియంపాడు, భాస్కరాపురం, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కావడం, అలాగే ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవంలో ప్రమాదవశాత్తు బాణసంచా పేలి తొమ్మిది మంది చిన్నారులు గాయపడిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టప రమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

గిరిజనులకు ఆరోగ్య కార్డుల పంపిణీ

ఇందుకూరుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని నరసాపురం గిరిజన కాలనీలో జైభారత్ హాస్పిటల్ సహాయ సహకారాలతో సింహపురి వైద్య సే సమితి ఆధ్వర్యంలో గిరిజనులకు ఆరోగ్య కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ కార్యక్రమానికి అతిధిగా పాల్గొన్న స్రవంతి జయవర్ధన్‌ను స్థానిక గిరిజనులు శాలువాతో సత్కరించి సాదర స్వాగతం పలికారు. స్రవంతి జయవర్ధన్ మాట్లాడుతూ గిరిజనుల పట్ల ప్రత్యేక శ్రద్ధ చూపుతూ గిరిజనుల కోసం జైభారత్ హాస్పిటల్‌లో ప్రత్యేక వార్డులు కేటాయించి చికిత్స అందిస్తున్నారు. గిరిజనులకు సాయం బడులు నిర్వహిస్తూ వారి అభ్యున్నతికి కృషి చేస్తున్నటువంటి సింహపురి వైద్య సేవ సమితిని ఆయన అభినందనలు తెలియజేశారు. అనంతరం వారికి హెల్త్‌కార్డులు పంపిణీ చేసి ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకుని ఆయురారోగ్యాలతో ఉండాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో గిఱిజన సంఘం నాఆయకులు వెండేటి సురేంద్ర, పత్ర సుబ్బారావు, వెంకటేశ్వర్లు, తుపాకుల శ్రీనివాసులు, జైభారత్ హాస్పిటల్ సిబ్బంది, స్థానికులు, తదితరులు పాల్గొన్నారు.

వైభవంగా వరసిద్ధి వినాయక కల్యాణం

సీతారామపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అమ్మవారిశాల వద్ద వాసవి గణేష్ యూత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గణపతికి లక్ష గరికార్చన, సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం గణపతి పూజ, లక్ష్మీ గణపతి పూజ, వేదమంత్రాలతో అభిషేకం, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వినాయక కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం గ్రామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

ఆర్టీసీ బస్సు, ఆటో ఢీ...

● ఆటో డ్రైవర్ మృతి..ఇద్దరికి తీవ్ర గాయాలు



మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు

బుచ్చిరెడ్డిపాళె, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బుచ్చిరెడ్డిపాళెం మండలంలోని ఆర్ఆర్ నగర్ (మఠం కాలనీ) వద్ద జాతీయ రహదారిపై శనివారం రోడ్డు ప్రమాదం జరిగింది. నెల్లూరు నుంచి బద్వేలు వైపు వెళ్తున్న ఆర్టీసీ బస్సు ముందున్న లారీని క్రాస్ చేస్తూ ఆర్ఆర్ నగర్ నుంచి నెల్లూరు వైపు వెళ్లే ఆటోను ఢీకొంది. ఈ ప్రమాదంలో ఆటో డ్రైవర్ మృతి చెందగా, ఆటోలో ప్రయాణిస్తున్న ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. గాయపడిన వారిని చికిత్స నిమిత్తం బుచ్చి ప్రభుత్వాసుపత్రికి తరలించి, ఆ తర్వాత మెరుగైన వైద్యం కోసం నెల్లూరు ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఎస్ఐ సంతోష్‌రెడ్డి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. ఆటో డ్రైవర్ మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మార్చురీకి తరలించారు. బస్సు ప్రయాణీకులకు ఎలాంటి ప్రమాదం జరగలేదు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరికి గాయాలు

వెంకటాచలం : మండలంలోని కసుమూరు పంచాయతీ వడ్డిపాళెం వద్ద శనివారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు గాయపడ్డారు. నెల్లూరు నగరంలోని పద్మావతి సెంటర్ ప్రాంతానికి చెందిన ఇలియాజ్ మోటర్ బైకుపై కసుమూరు దర్గాకు వెళ్లి నెల్లూరుకు వస్తుండగా వడ్డిపాళెం వద్ద కుక్కలు ఒక్కసారిగా రోడ్డుపైకి వచ్చాయి. దీంతో బైకు బోల్తా పడింది. ఈ ప్రమాదంలో స్వల్పంగా గాయపడిన ఇలియాజ్‌ను చికిత్స నిమిత్తం వెంకటాచలం సీహెచ్‌సీకి తరలించారు. పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నారు.

కోనకాలువ శుభ్రం

ఉదయగిరి, (ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల దాహార్తి తీర్చే కోనకాలువను డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లాల ఆదేశాల మేరకు శనివారం పంచాయతీ పారిశుద్య కార్మికులు శుభ్రంచేశారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రమీల

ఆత్మకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధు లపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రమీల మాద మాల తెలిపారు. మండలంలోని చెర్లోయడవల్లిలో శనివారం టీడీ పీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కేతా విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 158 మంది రోగులను పరీక్షించి వైద్యసేవలు అందించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మూడు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమీల మాద మాల మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరి శుభ్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని తెలిపారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు తీసు కోవాలని సూచించారు. ఈ కార్యక్ర మంలో ఏఎ న్ఎంలు శషాద్‌బేగం, రాజేశ్వరి, ఆశావర్కర్లు పాల్గొన్నారు.

పెన్నా పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

సంగం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదలను పెంచనున్న దృష్ట్యా పెన్నా పరీవాహక ప్రజలను రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తం చేస్తు న్నారు. సోమశిల జలాశయం 74 టీఎంసీలకు చేరడంతో ఆదివారం పెన్నా నదికి నీటి విడుదలను పెంచనున్నారు. దీంతో మండలంలో పెన్నా పరీవాహక ప్రాంతాలైన వీర్లగుడిపాడు, కోలగట్ల, పల్లిపాళెం, పడమటిపాళెం, అనసూయ నగర్, మక్తాపురం, అన్నారెడ్డిపాళెం మజరా పల్లిపాళెం గ్రామస్తులు, గేదెల కాపరులు పెన్నా నదిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో సమన్వయ కన్వీనర్‌గా మట్టె హరినారాయణ, కోకన్వీనర్‌గా వై రమణారెడ్డి ఎన్నికయ్యారు. సభ్యులుగా జీ ఏసు, జీ వజ్రమ్మ, షేక్‌రజియా, షేక్ బీబీ, నిర్మలమ్మ, జీ ఆరోగ్యం, వై చెన్నకేశవులు, రమణమ్మ, ఎన్ నీరజకుమార్, జీ కళావతి, నాగసుధ, కృష్ణయ్యలను ఎన్నుకున్నారు.

C.R.I.M.E N.E.W.S

ప్రియురాలిని హత్య చేసి..

● చెల్లెలకు సమాచారం ఇచ్చిన ప్రియుడు



మైథిలీప్రియ(ఫైల్)

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ప్రేమలో పడ్డారు.. అయితే ప్రియుడు మరో యువతితో సన్నిహితంగా ఉన్నాడని నిలదీయడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. అదే విషయాన్ని తరచూ ప్రస్తావిస్తుండడంతో చిన్నపాటి వివాదాలు జరిగి చివరకు హత్యకు దారి తీశాయి. ఇద్దరి మధ్య జరిగిన గొడవలో కత్తి పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున పోస్టల్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాలెం మండలం పెనుబల్లికి చెందిన గిరిబాబు, లక్ష్మి దంపతులు. వారికి మైథిలీ ప్రియ (23), సాహితిలు సంతానం. గిరిబాబు 2020లో గుండెపోటుతో మృతి చెందాడు. మైథిలీప్రియ వెంకటాచలంలోని ఓ కళాశాలలో ఈ ఏడాది మార్చిలో బీ ఫార్మసీ పూర్తి చేసింది. ఆమె బీ ఫార్మసీ చదివే సమయంలో అదే కళాశాలలో సహచర విద్యార్థి రాపూరు మండలానికి చెందిన నిఖిల్‌తో ప్రేమలో పడింది. ఆమె నగరంలోని రాజరాజేశ్వరి ఆలయం సమీపంలో పీజీలో ఉంటూ కళాశాలకు వెళ్లేది. ఆమె చెల్లెలు సాహితి గూడూరు సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతూ అక్కతో కలిసి కొంతకాలం పీజీలో ఉంది. అనంతరం వారిరువురు పోస్టల్ కాలనీ మొదటి వీధిలో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. ఆ గదికి ఎదురు భవనంలో నిఖిల్ ఉంటున్నాడు. ఈ క్రమంలో నిఖిల్ మరో యువతితో సన్నిహితంగా ఉంటూ ప్రియు రాలితో గొడవపడేవాడు. నాలుగు నెలల కిందట మైథిలీప్రియకు బెంగ ళూరులోని అమెజాన్ కంపెనీలో ఉద్యోగం రావడంతో అక్కడకు వెళ్లింది. ఈనెల 6వ తేదీన ఆమె పుట్టినరోజు కావడంతో 3వ తేదీ నెల్లూరుకు వచ్చింది. చెల్లెలు గదిలో కుటుంబసభ్యులతో కలిసి పుట్టిన రోజు జరుపుకుంది. ఈ క్రమంలో నిఖిల్ పలుమార్లు ఆమెకు ఫోన్‌చేసి గొడవపడు తుండేవాడు. అక్క బాధను గమనించిన సాహితి అతనితో ఇక వద్దని సూచించింది. అయినా ఆమె పట్టించుకోలేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మైథిలీప్రియ ఫోన్ చూసుకుంటూ ఉండడంతో చెల్లెలు నిద్రపోయింది. అర్ధరాత్రి 1.45 గంటల ప్రాంతంలో సాహితి నిద్రలేచి చూడగా పక్కన అక్క కన్పించకపోవడంతో ఫోన్ చేసింది. ఫ్రెండ్స్‌తో బయట ఉన్నానని, పది నిమిషాల్లో వస్తానని, నిఖిల్‌కు ఫోన్ చేయవద్దని చెప్పింది. దీంతో ఆమె నిద్రపోయింది. శనివారం తెల్లవారుజామున 3.35 గంటల సమయంలో నిఖిల్ సాహితికి ఫోన్ చేసి మీ అక్క నావద్ద ఉందని, వచ్చి తీసుకెళ్లాలని చెప్పాడు. దీంతో ఆమె తన స్నేహితురాలితో పాటు, రూమ్ కింద పోర్షన్‌లో ఉంటున్న ఓ మహిళను తీసుకొని నిఖిల్ గది వద్దకు వెళ్లింది. అక్కడ మెట్లపై మైథిలీప్రియ కూర్చొని ఉండటం గమనించి అక్కా అంటూ పలకరించగా ఉలుకు, పలుకు లేకుండా ఉండటంతో దగ్గరకు వెళ్లి చూసింది. ఆమె ఎడమ చాతికింద కత్తిపోటుకు గురై రక్తస్రావమై ఉంది. అక్కడే ఉన్న నిఖిల్‌ను తన అక్కను ఏమి చేశావంటూ సాహితి గట్టిగా ప్రశ్నించడంతో నాతో మీ అక్క గొడవ పడిందని, కత్తితో పొడవడంతో మృతి చెందిందని చెప్పాడు. దీంతో అక్కను పట్టుకొని కన్నీరు మున్నీరైన సాహితి జరిగిన విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వారు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ఈ క్రమంలోనే నిఖిల్ అక్కడ నుంచి నేరుగా దర్గామిట్ట పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. హత్య విషయంపై సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరికుంటపాడులో 144 సెక్షన్

● గ్రామాల్లో పోలీసుల పహారా



దుకాణాల వద్ద పోలీసుల పహారా

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు పంచాయతీ పరిధిలోని వరికుంట పాడు, భాస్కరాపురం గ్రామాల పరిధిలోని సర్వే నంబర్లు 233,1లో మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని ఇటీవల కాలంలో పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు రోజుల తరబడి పోరాటాలు సాగిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ, ప్రజా సంఘాలకు వినతిపత్రాలు సైతం అందజేశారు. అందులో భాగంగా ఆదివారం బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నారు. ఈనేపథ్యంలో విషయం తెలుసుకున్న తహసీల్దారు హేమంత్‌కుమార్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శనివారం నుంచి శాంతి భద్రతల దృష్ట్యా 144 సెక్షన్ విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. మూడు రోజుల పాటు అలాంటి పరిస్థితే కొనసాగుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఐదుగురి కంటే ఎక్కువగా గూమికూడదన్నారు. అలాగే ఎలాంటి సమావేశాలు నిర్వహించినా, ఆయుధాలతో సంచరించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు సైతం పోరాటాల్లో కీలకంగా వ్యవహరించిన కొంతమందికి హెచ్చరికలు జారీ చేయడంతో పాటు బస్టాండ్ సెంటర్‌తో సహా ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో పహారా నిర్వహించడం ఉత్కంఠ నెలకొంది. కాగా, రామచంద్రయాదవ్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుంటారో, పర్యటన కొనసాగితే ఎలాంటి పరిస్థితులు చోటుచేసుకుంటాయోనని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

లారీ ఢీకొని యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన నెల్లూరు జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం మేరకు.. టీపీ గూడూరు మండలం ఈదూరుకు చెందిన మహేష్(26), సుష్మలు దంపతులు. నెల్లూరు ఆటో నగర్‌లోని వెంకటేశ్వర వైర్‌ప్రొడక్ట్ షాపులో మహేష్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆయన షాపులో పని ముగించుకొని జాతీయ రహదారి మీదుగా బైక్‌పై ఇంటికి వెలుతుండగా మెడికవర్ వైద్యశాల సమీపంలోని పెట్రోల్‌బంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కావలి వైపు వెళ్లే గుర్తుతెలియని లారీ వేగంగా బైక్‌ను ఢీకొంది. కిందపడ్డ అతనిని లారీ తొక్కుకుంటూ వెళ్లిపోయింది. ఈ ఘటనలో మహేష్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హైవేమొబైల్ సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి బాధిత కటుంబసభ్యులకు సమాచారం అందించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మహేష్ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకుని రోదించారు. మృతుని భార్య సుష్మ నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరిట మహిళను మోసం చేసిన ఘటనలో నిందితులపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీవో కార్యాలయం సమీపంలో శైలజ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె బీటెక్ చదివి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. తెలిసిన వారి ద్వారా బీవీ నగర్‌లోని జాబ్ కన్సల్టెన్సీ ప్రతినిధులు రామకృష్ణ, అజిత్‌లను సంప్రదించారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని నెలకు రూ.35 వేలు జీతం, ల్యాప్‌టాప్ ఇస్తారని నమ్మించి ఆమె వద్ద నుంచి వారు పలు దఫాలుగా రూ.2.69 లక్షల తీసుకున్నారు. వారి సూచనల మేరకు రెండు నెలల ట్రైనింగ్ చెన్నైలో తీసుకున్నారు. నగదు తీసుకుని నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో నిలదీయగా వారు చంపు తామని బెదిరించారు. ఈ మేరకు బాధితురాలు శనివారం వేదాయ పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	148
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	286

కోడిగుడ్ల ధర (100): 550

నవరాత్రి ఉత్సవాల గోడపత్రిక ఆవిష్కరణ

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 22 నుంచి జరిగే దేవీనవరాత్రి ఉత్సవాల గోడపత్రికలను శనివారం రాత్రి దేవస్థానం కమిటీ ఆవిష్కరించింది. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ కోటగురుబ్రహ్మం, కోశాధికారి ఒమ్మిన సుబ్ర హ్మణ్యం, ప్రధాన అర్చకులు శివకుమార్‌స్వామి భక్తులు, తదితరులు పాల్గొన్నారు.



బీపీఎస్ కోసం
ఎదురుచూపు!

● నెలాఖరుకు వస్తుందని పురపాలక వర్గాల అంచనా

● నగరంలో రూ.50 నుంచి రూ.70 కోట్ల ఆదాయం వచ్చే అవకాశం



నెల్లూరు(సిటీ), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : పట్టణ, నగర ప్రాంతాలలో భవన నిర్మాణదారులు ఎప్పుడెప్పుడా అని ఎదురుచూస్తున్న బీపీఎస్ (బిల్డింగ్ పీనలైజ్డ్ స్కీం) త్వరలో వచ్చే అవకాశాలు కనిపిస్తోన్నాయి. ఇటీవల జరిగిన రాష్ట్ర క్యాబినెట్ సమావేశంలో దానికి సంబంధించిన అప్రువల్ కూడా ఇచ్చేయడంతో ఈ నెలాఖరుకు దస్త్రం బయటకు వచ్చే అకాశాలున్నట్లు పురపాలక వర్గాలు అంచనా వేస్తున్నాయి. దీనిపై భవన నిర్మాణదారుల్లో రోజురోజుకు ఆశలు పెరుగుతుండటంతో ఒక్క నెల్లూరు నగరంలోనే సుమారు రూ.50 నుంచి రూ.70 కోట్ల వరకు ఆదాయం ఎన్ఎంసీ ఖజానాకు సమకూరే అవకాశం ఉన్నట్లు సిటీప్లానింగ్ యంత్రాంగం లెక్కకడుతోంది. 1500లకు పైగా దరఖాస్తుదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు ఆ విభాగం ఇప్పటికే భావిస్తోంది. భవన నిర్మాణ రంగంలో ఎల్ఆర్ఎస్ (ల్యాండ్ రెగ్యూలరైజ్డ్ స్కీం) కీలక భూమిక పోషిస్తుండగా ఆ తరువాత పాత్ర బీపీఎస్‌దే. భవన నిర్మాణంలో నిబంధనలు 10 శాతం కంటే ఎక్కువగా అతిక్రమిస్తే బీపీఎస్ ద్వారా జరిమానా వేసి క్రమబద్ధీకరణ చేయాల్సి ఉంటుంది. ఎలాంటి అనుమతులు లేకుండానే నిర్మించిన భవనాలకు ఈ పథకం ద్వారానే జరిమానాతో కూడిన అనుమతులు మంజూరు చేస్తారు. అనుమతులకు మించి జరిగిన నిర్మాణాల్లోనూ దీని ద్వారానే అనుమతులు జరిమానాతో పొందే అవకాశం ఉంది. ఇలాంటి బీపీఎస్ వెసులుబాటు కోసం అనేక మంది భవన నిర్మాణదారులు ఆశగా ఎదురు చూస్తున్నారు. 2019 తరువాత ఇప్పటి వరకు బీపీఎస్ విడుదల కాకపోడంతో అనేక మం ది భవన యజమానులు దీని కోసం వేచిచూ స్తున్నారు. శరవేగంగా విస్తరిస్తున్న నగరంలో భవన నిర్మాణా లు పరుగులు తీస్తున్నాయి. ఇందులో 10 శాతంలోపు నిబం ధనలు అతిక్రమించిన వాటికి సిటీప్లానింగ్ అధికారులు గు ర్తించి జరిమానాతో కూడిన అనుమతులు ఇచ్చేస్తు వస్తు న్నారు. అంతకు మించి అతిక్రమణ ఉన్నవాటిని బీపీఎస్‌కు సిఫార్సు చేస్తుండటంతో అలాంటి భవనాలన్నీ బీపీఎస్ కోసం ఎదురుచూస్తు నిలిచిపోయాయి. ఆరేళ్లుగా భవన నిర్మాణంలో జరుగుతున్న అతిక్రమణలకు అధికారిక విరుగుడు లేకపోవడంతో భారీగా వాటి యజమానులు బీపీఎస్ కోసం ఎదురు చూస్తున్నట్లు ప్లానింగ్ విభాగంలోని అధికారులు చెప్తున్నారు.

● క్యాబినెట్ ఆమోదించడంతో పెరిగిన ఆశలు

రాష్ట్ర వ్యాప్తంగా భవన నిర్మాణరంగంలో పురపాలక శాఖ అనేక సంస్కరణలను తీసుకువచ్చింది. అనధికారికంగా నిర్మించిన లేఅవుట్లు, ప్లాట్లును క్రమబద్ధీకరణ చేసే ప్రక్రియలో భాగంగా ఎల్ఆర్ఎస్‌ను విడుదల చేయడంతో అనేక మంది ప్రత్యక్ష లబ్ధి పొందుతున్నారు. దీంతో క్రమబద్ధీకరణ జరిగిన స్థలాలు భవన నిర్మాణ అనుమతులకు సిద్ధమయ్యాయి. వీటి ద్వారా ప్రభుత్వ ఖజానాకు భారీగా ఆదాయం సమకూరుతోంది. ఇందులో భాగంగా ఉన్న బీపీఎస్‌ను విడుదల చేయాలని ఇటీవల అమరావతిలో జరిగిన క్యాబినెట్ సమావేశంలోనూ తీర్మానం చేయడంతో భవన నిర్మాణదారుల్లో ఆశలు చిగురించాయి. ఈ నెలాఖరులోపు బీపీఎస్ వస్తుందని పురపాలక వర్గాలు అంచనాలు వేయడంతో అనేక మంది భవన నిర్మాణదారులు ఆదిశగా ఎదురుచూస్తున్నారు.

● రూ.70 కోట్ల వరకు ఆదాయం

భవన నిర్మాణ రంగంలో రెండవ దశ కీలకభూమిక పోషించే బీపీఎస్ ద్వారా నెల్లూరు కార్పొరేషన్ ఖజానాకు రూ.50, రూ.70 కోట్ల వరకు ఆదాయం సమకూరుతుందని ప్లానింగ్ అధికారులు లెక్కకడుతున్నారు. ఇప్పటికే సుమారుగా 1500కు పైగా దరఖాస్తుదారులు ఈ పథకాన్ని సద్వినియోగం చేసుకునేందుకు సిద్ధంగా ఉన్నట్లు భావిస్తున్న యంత్రాంగం ఈ స్కీం విడుదలైతే అనేక భవనాలు క్రమబద్ధీకరణ కిందకు వస్తాయని చెప్తున్నారు. అటు ప్రభుత్వానికి ఆదాయం సమకూరడంతో పాటు, ఇటు అనేక మంది భవన యజమానులు ప్రత్యక్ష లబ్ధిని పొందుతారనే వాదన వ్యక్తమవుతోంది.

మున్సిపల్ పాఠశాలలో వైద్య సదస్సు



మాట్లాడుతున్న డాక్టర్ రీనా

నెల్లూరు(విద్య), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నగరంలోని వెంగళరావునగర్ మునిసిపల్ ఉన్నత పాఠశాలలో శనివారం 10 ఆంధ్ర నేవల్ యూనిట్ ఎన్‌సీసీ ఆధ్వర్యంలో ప్రపంచ ఫస్ట్ ఎయిడ్ డే అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా పట్టణ ఆరోగ్య కేంద్రం డాక్టర్ రీనాభారతి అతిథిగా హాజరై ఫస్ట్ ఎయిడ్ ఆవశ్యకతను ఎన్‌సీసీ కేడెట్స్‌కు తెలియచేశారు. ప్రాణాపాయ స్థితిలో ఉన్న వ్యక్తులను ఫస్ట్ ఎయిడ్ చేసి సమీపంలోని వైద్యశాలకు చేర్చే వరకు ఎలాంటి జాగ్రత్తలు తీసుకోవాలన్న అంశాలపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ఎన్‌సీసీ సెకండ్ ఆఫీసర్ గుండాల నరేంద్రబాబు, ప్రధానోపాధ్యాయిని సి.మంజులవాణి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మంద అక్షితకు డాక్టరేట్

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : నెల్లూరుకు చెందిన మంద అక్షితకు బెంగళూరులోని శ్రీరాజరాజేశ్వరి మెడికల్ అండ్ డెంటల్ కాలేజీ డాక్టరేట్ పట్టాను అందచేసింది. డెంటల్ విభాగంలో ఆ కాలేజీలో టాపర్‌గా నిలిచిన అక్షితకు ఆ కాలేజీ చైర్మన్ డాక్టరేట్ డిగ్రీ పట్టాను అందచేశారు. ఈ సందర్భంగా అక్షిత మాట్లాడుతూ పేద, బడుగు, బలహీన వర్గాల వారికి ఉచిత వైద్య సేవలు అందిస్తానని చెప్పారు.



డాక్టరేట్ పట్టా అందుకున్న మంద అక్షిత

ఆకట్టుకున్న పుస్తకం పిలుస్తోంది..!

నెల్లూరు(సాంస్కృతికం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : నగరంలోని ఎన్టీఆర్ పార్కు సర్కిల్‌లో శనివారం జరిగిన పుస్తకం పిలుస్తోంది కార్యక్రమం పుస్తక ప్రియులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా జరిగిన పుస్తక ప్రదర్శనలో ప్రజలు ఉత్సాహంగా పాల్గొని పుస్తకాలు తీసుకున్నారు. ఈ కార్యక్రమంలో కవులు జి.శ్రీనివాస్, నూనె నారాయణ, జి.సుభద్రాదేవి, బాబానాయుడు, అవ్వారు శ్రీధర్‌బాబు పాల్గొన్నారు.

న్యాయం చేయండి

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): తనకు న్యాయం చేయాలని నగరంలోని జెండావీధికి చెందిన హర్షియా కోరారు.జర్నలిస్టు భవన్‌లో శనివారం ఆమె మాట్లాడారు. తనకు చెన్నైకి చెందిన రసూల్ బాషాతో 2015లో వివాహం జరిగిందని, ఆ సమయంలో మా తల్లిదండ్రులు రూ.7లక్షల నగదు, 20 సవర్ల బంగారం ఇచ్చారని, అయినా అదనపు కట్నం కోసం అత్తమామలు, భర్త వేధించడంతో తాను పురిటిబిడ్డతో పుట్టింటికి వచ్చానని తెలిపారు. కట్నం వేధింపులపై ఒకటవ నెంబరు పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయగా, వారు రాజీకి వచ్చి తనను తీసుకెళ్లారని పేర్కొన్నారు. తాను కేసు పెట్టానని బంధించి, చిత్రహింసలు పెట్టగా చెన్నై నుంచి నెల్లూరుకి వచ్చి కోర్టులో కేసు వేశామని ఆమె తెలిపారు. ఈ క్రమంలో నా బిడ్డను తీసుకెళ్లే ప్రయత్నం చేశారని తెలిపారు. కోర్టులో కేసు ఉండగా తన భర్త మరో పెళ్లి చేసుకున్నారని ఆరోపించారు. పోలీసులు విచారణ జరిపి న్యాయం చేయాలని బాధితురాలు కోరారు.

యూట్యూబ్ చానల్ పేరుతో మోసం

నెల్లూరు (సాంస్కృతికం) సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : ఓ మాజీ ఎంపీ దగ్గర పనిచేస్తున్న రేవూరు వెంకటస్వామి యూట్యూబ్ చానల్ పెడదామని, నమ్మించి తన దగ్గర నుంచి రూ.39లక్షలు ఖర్చు పెట్టించారని నగరానికి చెందిన కల్లూరి లక్ష్మీ అనే మహిళ తెలిపారు. శనివారం జర్నలిస్టు భవన్‌లో ఆమె మాట్లాడారు. అయితే చానల్ పెట్టాక 4, 5 నెలలు మాత్రమే నడిచిందని చెప్పారు. ఆగిపోయిన తర్వాత వెంకటస్వామిని నిలదీయగా డబ్బు ఖర్చు అయిందని, త్వరలో ఇస్తానని కాలయాపన చేయగా, 6వనగర పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశామన్నారు. కొంత మొత్తం డబ్బులు ఇచ్చి మిగతావి ఇవ్వకుండా ఇవ్వకుండా కాలయాపన చేస్తున్నారని తెలిపారు. అధికారులు న్యాయం చేయాలని కోరారు.

బీసీవై సమావేశానికి 100 మందికే అనుమతి

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరేడు రైతులకు సంఘీభావంగా ఆదివారం బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ కరేడులో నిర్వహించే సమావేశాన్ని కోర్టు ఉత్తర్వులకు లోబడి మాత్రమే జరుపుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీహెచ్ వీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరులతో మాట్లాడుతూ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు ఆయనకు కరేడులో ఉండేందుకు అనుమతి ఉందని, కరేడుకు చెందిన రైతులు 100 మందికి మించకుండా సమావేశం జరుపుకోవాలన్నారు. బయటి గ్రామాలవారెవ్వరూ ఈ సమావేశంలో పాల్గొనేందుకు కోర్టు అనుమతించలేదన్నారు. సమావేశంలో కందుకూరు సీఐ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

విద్యార్థి దశ నుంచే 'ఏచూరి' ప్రజా పోరాటం

● సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్



మాట్లాడుతున్న సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : సీపీఎం జాతీయ కార్యదర్శిగా పనిచేసిన సీతారాం ఏచూరి విద్యార్థి దశ నుంచే ఎన్నో ప్రజా పోరాటాలు నడిపారని సీపీఎం జిల్లా కార్యదర్శి మూలం రమేష్ వెల్లడించారు. సీతారాం ఏచూరి ప్రథమ వర్ధంతి సభ శనివారం సీపీఎం జిల్లా కార్యాలయంలో జరిగింది. ఈ సందర్భంగా మూలం మాట్లాడుతూ రెండుసార్లు పార్లమెంట్ సభ్యుడిగా ఎన్నికైన ఏచూరి అనేక ప్రజా సమస్యలపై స్పష్టమైన వైఖరి తెలియచేయటంతో తనదైన పాత్ర పోషించారన్నారు. మతోన్మాదానికి వ్యతిరేకంగా లౌకిక శక్తులను కూడగట్టటంలో ఆయన ప్రత్యేక చొరవ చూపారని తెలిపారు. అంతర్జాతీయంగా కార్మిక వర్గ రాజకీయాలను వివిధ దేశాలలో విస్తృత ప్రచారంలో ఎంతో కృషి చేశారని చెప్పారు. నెల్లూరు జిల్లాలో అనేక ప్రజా ఉద్యమాలను ఏచూరి స్ఫూర్తితో నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు, షేక్ మస్తాన్‌బీ, సూర్యనారాయణ, నగర కమిటీ సభ్యులు, పలు ప్రజా సంఘాలు తదితరులు పాల్గొన్నారు.

ఇళ్లు, స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలి

● సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు



ధర్నాలో మాట్లాడుతున్న సీపీఎం నేత కత్తి శ్రీనివాసులు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): నెల్లూరు నగరంలోని 11వ డివిజన్‌లో పేదల ఇళ్లకు, స్థలాలకు రిజిస్ట్రేషన్ సౌకర్యం కల్పించాలని సీపీఎం నగర కార్యదర్శి కత్తి శ్రీనివాసులు డిమాండ్ చేశారు. శనివారం ఎన్టీఆర్ నగర్‌లో ప్రజలతో కలిసి ధర్నా చేశారు. ఈ సందర్భంగా కత్తి మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు ఇళ్ల స్థలాలు లేని వారికి 12 అంకణాల స్థలం తక్షణమే కేటాయించాలని కోరారు. ఎన్టీఆర్ నగర్‌లో ప్రభుత్వం ఉన్నత పాఠశాలతో పాటు రేషన్‌షాపు, సచివాలయం ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలన్నారు. పాలకుల నిర్లక్ష్యం కారణంగా 11వ డివిజన్‌లో అనేక సమస్యలు పేరుకు పోయాయని చెప్పారు. జాతీయ రహదారిపై ఎన్టీఆర్ నగర్ వద్ద అండర్‌పాస్ బ్రిడ్జి నిర్మించాలని డిమాండ్ చేశారు. ప్రజా సమస్యలు పరిష్కరించే వరకు దశల వారీగా వివిధ రూపాల్లో ప్రజా పోరాటాలు నిర్వహిస్తామని వెల్లడించారు. ఈ కార్యక్రమంలో సీపీఎం నేతలు గోతం మురళి, ఆదిలక్ష్మి, మాదాల శ్రీమన్నారాయణ, శివకుమారి, నారాయన, సుబ్బారావు, బాబు, వెంకటేశ్వర్లు, శ్రీనివాసులు, చిన్న తదితరులు పాల్గొన్నారు.

కలెక్టర్‌కు పలువురి అభినందనలు



కలెక్టర్‌ను సన్మానిస్తున్న భారత్ సేవా ఫౌండేషన్ నాయకులు

నెల్లూరు(హరనాథపురం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : కలెక్టర్‌గా బాధ్యతలు స్వీకరించిన హిమాన్షు శుక్లాను భారత్ సేవా ఫౌండేషన్ ప్రతినిధులు మార్యాద పూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆ ఫౌండేషన్‌కు చెందిన సుబ్బారావు, కొమ్మల కృష్ణయ్య, జనార్దన్ తదితరులు పాల్గొన్నారు. అలాగే ఏపీఎన్జీవో అసోసియేషన్ జిల్లా నాయకత్వం బాధ్యతలు స్వీకరించిన హిమాన్షు శుక్లాను మర్యాదపూర్వకంగా కలిసి అభినందనలు తెలిపింది. ఈ కార్యక్రమంలో ఆ అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు మన్నేపల్లి పెంచలరావు, కార్యదర్శి గాదిరాజు రామకృష్ణ, ఆర్గనైజింగ్ కార్యదర్శి లక్కాకుల పెంచలయ్య తదితరులు పాల్గొన్నారు.

మోదీ చిత్రపటానికి పాలభిషేకం



ఆనందం వ్యక్తం చేస్తున్న వ్యాపారులు, బీజేపీ నాయకులు

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కేంద్ర ప్రభుత్వం జీఎస్టీ శ్లాబులను భారీగా తగ్గించడంతో శనివారం నగరంలోని ట్రంకురోడ్డులో శివాజీ విగ్రహం వద్ద శనివారం వ్యాపారులు ప్రధాని నరేంద్రమోదీ చిత్రపటానికి పాలభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న బీజేపీ నాయకులు పీ.సురేంద్రరెడ్డి మాట్లాడుతూ కేంద్రప్రభుత్వం జీఎస్టీ స్లాబ్‌లను భారీగా తగ్గించడంతో వ్యాపారులకు ఎంతగానో లబ్ధి చేకూరుతుందన్నారు. సులభతరమైన వాణిజ్య జీఎస్టీ తగ్గింపు ఫలాలను ప్రజలందరికీ భారత ప్రధాన మంత్రి నరేంద్రమోదీ, ఆర్థిక మంత్రి నిర్మల సీతారామన్ దేశ ప్రజలకు అందిస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో శివాజీ సెంటర్ మిత్రమండలి కేవీ సుబ్రహ్మణ్యం, బీఎస్ రంగరాజన్, హర్షవర్ధన్, భాస్కరరావు, మధుసూదన్, పలువురు వ్యాపారులు పాల్గొన్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



పాడి రైతులకు నగదు అందచేస్తున్న సంగం మేనేజర్ వినోద్

బిట్రగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సం గం డెయిరీ పనిచేస్తుందని జిల్లా జోనల్ మేనేజర్ డాక్టర్ వినోద్ అ న్నారు. బోగోలు మండలం ఎస్వీపాలెం పంచాయతీ సిద్దనపాలెం లో మద్దూరుపాడు కావలి పాల సేకరణ కేంద్రం 2024-25 సంవత్సరానికిగాను శనివారం పాడి రైతులకు బోనస్ నగదు పంపిణీ చేశారు. దాదాపు 68 మంది పాడి రైతులకు 2 లక్షల 75 వేల 721 రూపాయల నగదును బోనస్‌గా అందచేశారు. ఈ సందర్భంగా సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు నియోజకవర్గ శాసన సభ్యుడు ధూళిపాల నరేంద్రకుమార్ పాడి రైతుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. మద్దూరుపాడు కావలి బీఎంసీ ఇన్‌చార్జి శ్రీనివాసులు మాట్లాడుతు సంగం డెయిరీ పాడి రైతులకు రాయితీపై దాణా, వరి, గడ్డి విత్తనాలు అందచేయడంతో పాటు పశు బీమా సదుపాయం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ సూపర్‌వైజర్ వెంకయ్య, పాల సేకరణ కార్యదర్శి పీ శీనయ్య, పాడి రైతులు ఉన్నారు.

వానకు నేలకొరిగిన వరి.. రైతు కంట కన్నీరు



సీఎల్ పురంలో నేలకొరిగిన వరి పైరు

బిట్రగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో అల్పపీడన ప్రభావంతో పలు చోట్ల కోతకు వచ్చిన వరి పైరు నేలకొరిగింది. మొదటి కారు కన్నా దిగుబడి బాగా వచ్చిందని ఆనందంలో ఉన్న రైతన్నలకు శనివారం కురిసిన వర్షం శాపంగా మారింది. చెంచులక్ష్మీపురం, తదితర ప్రాంతాల్లో వరి భారీ వర్షానికి నేలకొరిగింది. చేతికి వచ్చిన పంట నేలపాలవుతుండటంతో రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో మండలంలో దాదాపు 4 వేల ఎకరాలకు పైగా రెండో క్రాప్ వరి సాగు చేశారు. అందులో నాలుగు వందల ఎకరాల లోపు మాత్రమే వరి కోత జరిగింది. మగిలిన 3600 ఎకరాల్లో మరో 15 రోజుల్లో కోతలు పూర్తి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోతలు ప్రారంభమై వారం రోజులవుతున్నా మండలంలో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

గ్రామస్థాయిలో జనసేనను బలోపేతం చేయాలి

● టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్



జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తదితరులు

కొండాపురం, సెప్టెంబరు 13 (ఆం ధ్ర జ్యోతి): జనసేన పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేమలపాటి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండల కేంద్రంలో శ నివారం పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. మారుమూల ప్రాంతంలో పా ర్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకోవ డం శుభ పరిణామమన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సూచనలతో అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా పార్టీలోని వర్గ విభేధాలతో ఇటీవల జనసేన మండలాధ్యక్షుడు ఒక పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించగా, మరొక కార్యాలయాన్ని ఉపాధ్యక్షుడు ప్రారంభించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకుడు భోగినేని కాశీరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు కాకుటూరు రాఘవేంద్రరావు, మండలనాయకుడు తిప్పినేని రమేష్, పాల్గొన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● తహసీల్దారు కార్యాలయం వద్ద ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో ఉపాధ్యాయుల నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కావలి(టౌన్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57ను అమలు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈహెచ్ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని, యాప్‌లను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిలకపాటి

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యో తి): ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరక్టర్‌గా కందుకూరు పట్టణానికి చెందిన టీడీపీ నేత చిలకపాటి మధుబాబు నియమితులయ్యారు. మధుబాబుకు డైరెక్టర్ పదవి రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

జిల్లాస్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కావలి (టౌన్)సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ విట్స్ ఇంజనీరింగ్ కళాశాల టెన్నిస్ క్రీడా ప్రాంగణంలో శనివారం ఉమ్మడి నెల్లూరు జిల్లాస్థాయి పులివర్తి రాఘవ నాయుడు మెమోరియల్ టెన్నిస్ (డబుల్) టోర్నమెంట్ ప్రారంభమైంది. జేబీ విశ్రాంత అధ్యాపకుడు భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు ప్రారంభించి మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 70 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొన్నారు. ఆదివారంతో టోర్నమెంట్ ముగుస్తుందని జేబీ పీడీ ప్రసాద్‌రెడ్డి తెలిపారు.

జమునకు 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అవార్డు

కావలి(టౌన్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) ఆర్ట్ ఆఫ్ లర్నింగ్ సంస్థ హైదరాబాద్‌లో శనివారం 'తెలుగు కీర్తి కిరీటాలు' అంతర్జాతీయ పురస్కారాల ప్రదానోత్సవం జరిగింది. కావలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని మొగిలిశెట్టి జమునకు కళా రంగంలో 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అవార్డును ప్రదానం చేశారు. యువత సాహిత్య, కళా రంగాల్లో రాణించి పూర్వ వైభవం తేవడానికి కృషి చేయాలని జమున పేర్కొన్నారు.

కమనీయం పెంచలస్వామి కల్యాణం



రాపూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెంచలకోన క్షేత్రంలో శనివారం శ్రీవారి కల్యాణం కమనీయంగా జరిగింది. పెంచల నరసింహ స్వామిని సుప్రభాత సేవతో మేల్కొలిపి, అమృతాభిషేకాల అనంతరం చందనాలంకారం చేశారు. నిజరూప దర్శనంతో భక్తులకు దర్శనమిచ్చారు. అలాగే ఊంజల్ సేవ, తిరుచ్చి ఉత్సవం, క్షేత్రోత్సవం వైభవంగా నిర్వహించారు. శనివారం సెలవు కావడంతో పెద్ద సంఖ్యలో భక్తులు శ్రీవార్లను దర్శించుకున్నారు. భక్తులకు ఉచిత ప్రసాదాల తోపాటు, అన్నప్రసాదం అందించినట్లు ఆలయ ఉప కమిషనర్ పోరెడ్డి శ్రీనివాసులు రెడ్డి తెలిపారు.

చెట్ల కిందే సమావేశాలు

● మీటింగు హాలు లేక వైద్యుల ఇక్కట్లు

లింగసముద్రం, సెప్టెంబరు 13: (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రమైన లింగసముద్రంలోని మండల ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మీటింగు హాలు లేక వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది, ఆశా కార్యకర్తలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ప్రతి వారంలో మూడు నాలుగు సార్లు పీహెచ్‌సీ ఆవరణలో వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బందికి, ఆశాలకు పలు అంశాలపై సమావేశాలు నిర్వహిస్తుంటారు. అంతేగాక ప్రభుత్వం చెప్పే సర్వేల గురించి, ఇతర విషయాలపై ఆరోగ్య సిబ్బందికి, ఆశా కార్యకర్తలకు వివరించాలంటే వైద్యశాల ఆవరణలోని చెట్ల కింద మాత్రమే సమావేశాలు నిర్వహించి వైద్యులు వివరిస్తుంటారు. కానీ వైద్యశాల లోపల ఎలాంటి సమావేశాలు నిర్వహించాలన్నా సిబ్బందికి స్థలం చాలదు. దీంతో వైద్యశాల ఆవరణలోని చెట్ల కింద మాత్రమే సమావేశాలు నిర్వహించాల్సి ఉంటుంది. దీంతో వైద్యులు, సిబ్బంది, ఆశాలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు.

త్వరలో ఎమ్మెల్యే ఇంటూరికి వినతి : డా.రమేష్

కందుకూరు నియోజకవర్గంలోని అన్ని మండలాల పీహెచ్‌సీల వద్ద సమావేశపు హాళ్లు ఉండగా లింగసముద్రం పీహెచ్‌సీ ఆవరణలో మాత్రం లేదు. దీంతో తీవ్ర ఇక్కట్లు పడుతున్నట్లు వైద్యాధికారి డా.పి రమేష్ చెప్పారు. ఇక్కడ సమావేశపు హాలు నిర్మించేందుకు తగిన చర్యలు చేపట్టాలని తాను, తమ వైద్యులు, సీహెచ్‌ఓ, సిబ్బంది త్వరలో ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావును కలిసి వినతిపత్రం ఇవ్వనున్నట్టు డా.రమేష్ చెప్పారు.



లింగసముద్రం పీహెచ్‌సీ ఆవరణలో శనివారం చినుకుల మధ్య చెట్ల కింద సమావేశం నిర్వహిస్తున్న వైద్యాధికారులు, ఆరోగ్య సిబ్బంది

మాలకొండ ఆదాయం రూ. 9,35,692

వలేటివారిపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : మండలంలోని మాలకొండ మాల్యాద్రి లక్ష్మీనరసింహస్వామికి శనివారం భక్తుల నుంచి రూ. 9,35,692 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ ఎస్ చంద్రశేఖర్ ఒక ప్రకటనలో తెలిపారు. వివరాలిలా ఉన్నాయి. అష్టోత్తరం టిక్కెట్‌ల ద్వారా రూ. 5,950, కుంకుమార్చన ద్వారా రూ. 19,400, వివాహముల ద్వారా రూ. 1,000, తలనీలాలు ద్వారా రూ. 40,500, వాహనపూజలు ద్వారా రూ. 2,820, ప్రత్యేక దర్శనం ద్వారా రూ. 3,55,400, స్థలపురాణం పుస్తకాలు విక్రయం ద్వారా రూ. 820, రూముఅద్దెలు ద్వారా రూ. 32,780, కవర్లు ద్వారా రూ. 9 వేలు, లడ్డుప్రసాదం ద్వారా రూ. 2,13,460, అన్నదానం ద్వారా రూ. 2,29,446, విరాళముల ద్వారా రూ. 25,116 ఆదాయం లభించినట్లు ఆలయ డిప్యూటీ కమిషనర్ చంద్రశేఖర్ తెలియజేశారు.

ప్రకృతి సాగు

● సొంతంగా ఎరువుల తయారీకి శ్రీకారం
● పంటల్లో మెరుగైన దిగుబడులు
● ఆసక్తి చూపుతున్న రైతులు

పంటల సాగులో అధిక పెట్టుబడులు పెట్టి రసాయన ఎరువులు వినియోగించినా, ఆశించిన మేర ఫలితాలు రావడంలేదు. దీంతో విసుగెత్తిన రైతులు వినూత్న ఆలోచనలకు శ్రీకారం చుట్టారు. నేల స్వభావాన్ని బట్టి తక్కువ ఖర్చుతో నివాసాల వద్దే సొంతంగా ఎరువులు తయారు చేసి పంటలకు వినియోగిస్తున్నారు. దీంతో పెట్టుబడుల భారం తగ్గడంతో పాటు మెరుగైన దిగుబడులు సాధిస్తున్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం అందిస్తున్న ప్రోత్సాహంతో ప్రస్తుతం పల్లె ప్రాంతాల్లో ప్రకృతి వ్యవసాయ ఉత్పత్తుల కేంద్రాల ద్వారా రైతులు జీవన ఎరువుల తయారీపై ఆసక్తి చూపుతున్నారు.



అమ్మకానికి సిద్ధంగా ఉంచిన ఎరువుల సంచులు



రైతులకు అవగాహన కల్పిస్తున్న సిబ్బంది



రసాయనాలను ప్రదర్శిస్తున్న అధికారులు

● వినియోగం ఇలా...

జీవామృతం: పండ్ల తోటల్లో పిచికారీ చేయడంతో పాటు నీటిలో కలిపి చెట్లకు అందించాలి. దీంతో చీడ, పీడలను నివారించి అధిక దిగుబడులు సాధించవచ్చు.

ఘనజీవామృతం: ఎలాంటి రసాయన ఎరువులను వినియోగించకుండా ఎకరాకు 400 కేజీల ఘనజీవామృతం వేసి ఏడాది పాటు పచ్చని పంటలతో కప్పి ఉంచాలి. దీంతో భూమిలో కార్బన్ శాతం పెరిగి కలుపు నిర్మూలన జరుగుతుంది.

వేప గింజల ద్రావణం: ఈ ద్రావణాన్ని పిచికారీ చేయడంతో తెగుళ్లను వ్యాపింపచేసే పురుగులు గుడ్లు పెట్టకుండా నివారించవచ్చు. ప్రతి పంటలో వినియోగించడం వలన రైతులపై ఆర్థిక భారం తగ్గుతుంది.

బ్రహ్మాస్త్రం: దీన్ని వేప, కానుగ, ఆముదం, నేరేడు, సీతాఫలం వంటి ఐదు రకాల ఆకులతో తయారు చేస్తారు. దీన్ని వినియోగించడంతో పంటను నాశనం చేసే పెద్ద పెద్ద పురుగులను సైతం పూర్తి స్థాయిలో నియంత్రించే అవకాశం ఉంది.

అందుబాటులో విత్తనాలు: వీటితోపాటు పంటకు బలాన్ని చేకూర్చే జనుము, జీలగలు వంటి 25 నుంచి 30 రకాల వరకు సారవంతమైన విత్తనాల కిట్లను తయారు చేసి రైతులకు అందజేస్తున్నారు. దీంతో భూమిలో బయోమాస్ నిల్వ ఉండి పంటల సాగులో సమృద్ధిగా పోషకాలను అందించి నాణ్యమైన దిగుబడులు పొందే అవకాశం ఉంటుంది. అంతేగాక ఆసక్తి ఉన్న రైతులకు ప్రోత్సాహం అందించి, వారికి తయారీలో మెలకువలు నేర్పిస్తున్నారు.

ఉదయగిరి రూరల్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉదయగిరి నియోజకవర్గ పరిధిలో ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు, సీతారామపు రం, మర్రిపాడు మండలాల్లో కేంద్రాలను ఏర్పాటు చేసి ఘన, ద్రవ జీవామృతం, కషాయాలు, ఇతర ద్రావణాలు తయారు చేస్తున్నారు. అనంత రం వాటిని బయటి మార్కెట్లో లభించే రసాయన ఎరువుల కంటే తక్కు వ ధరకే రైతులకు విక్రయిస్తున్నారు. తొలిసారిగా ఉదయగిరి మండలంలోని గండిపాళెంలో ప్రయోగాత్మక ఓ కేంద్రాన్ని ఏర్పాటు చేసి మంచి ఫలితాలు సాధించారు. దీంతో ఇతర గ్రామాల రైతులు కూడా అలా తయారు చేసిన ఎరువుల వినియోగంపై మొగ్గు చూపుతున్నారు. ఈ కేంద్రంలో కోడిగుడ్డు, నిమ్మ రసం కలిపిన మిశ్రమ ద్రావణంతో సహా బెల్లం ద్రావణం, అగ్ని అస్త్రం, బ్రహ్మాస్త్రం, నీమాస్త్రం, జీవామృతం, ఘన జీవామృతం, నేచరల్ పొటాష్, మూత్రం కలిపిన ఇంగువ ద్రావణం తయారు చేసి రైతులకు అందుబాటులో ఉంచుతున్నారు.

ఆసక్తి పెరుగుతుంది..



ప్రకృతి వ్యవసాయంపై రోజు రోజుకు రైతుల్లో ఆసక్తి పెరుగుతుంది.ఈ పరిస్థితిని దృష్టిలో ఉంచుకొని భవిష్యత్తులో అన్ని మండలాల్లోనూ కేంద్రాలు ఏర్పాటు చేసేందుకు చర్యలు చేపడుతున్నాం. వీటి వినియోగంతో అధిక దిగుబడులు సాధించడంతో పాటు ఆరోగ్యానికి మేలు చేకూరుతుంది.

- కే రామమోహన్‌రావు, డివిజన్ సలహదారుడు

ఏపీఐఐసీ డైరెక్టరుగా కంచర్ల మాధవి



ఆత్మకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కూటమి ప్రభుత్వం మరో మూడు కార్పొరేషన్లకు 33 మందిని డైరెక్టర్లుగా నియామకం చేపడుతూ శనివారం ఉత్తర్వులు జారీచేసింది. అందులో ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రీయల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్ (ఏపీఐఐసీ) డైరెక్టర్‌గా ఆత్మకూరు మండలం నారంపేటకు చెందిన కంచర్ల మాధవి నియమితులయ్యారు. ఆమె ఆత్మకూరు మాజీ ఎమ్మెల్యే కంచర్ల శ్రీహరినాయుడి కోడలు. ప్రస్తుతం ఆమె నారంపేట సర్పంచ్‌గా ఉన్నారు. తన మామ కంచర్ల శ్రీహరినాయుడి రాజకీయ వారసత్వాన్ని పుణికిపుచ్చుకుని తెలుగుదేశం పార్టీ పటిష్టతకు తన వంతు కృషి చేస్తున్నారు. అందుకు తగిన గుర్తింపుగా రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి ఆశీస్సులతో పార్టీ అధిష్టానం ఆమెను ఏపీఐఐసీ డైరెక్టరుగా నియమిస్తూ ఉత్తర్వులు జారీ చేయడంతో టీడీపీ శ్రేణులు హర్షం వ్యక్తం చేస్తున్నారు.

మాలకొండను దర్శించుకున్న దేవదాయ శాఖ ఆర్‌జేసీ



వలేటివారిపాలెం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండలంలోని మాలకొండ లక్ష్మీనరసింహస్వామిని శనివారం దేవదాయ శాఖ ఆర్‌జేసీ ఆజాద్ దర్శించుకున్నారు. ఆయనకు ఆలయ అధికారులు ఘనంగా స్వాగతం పలికి ప్రత్యేక పూజలు నిర్వహించి స్వామివారి ప్రసాదం అందచేశారు. అనంతరం అన్నదానం, లడ్డుప్రసాదం కౌంటర్, కేశఖండనశాల, క్యూలైన్లు, దుకాణాలు, మరుగుదొడ్లు తదితర పరిసర ప్రాంతాలను పరిశీలించారు. ఆలయ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, భక్తులకు రుచి, శుచికరమైన భోజనం పెట్టాలని, నాణ్యమైన ప్రసాదం అందించాలని, మెరుగైన వసతులు కల్పించాలని సూచించారు. మండపాలపై ఉన్న పిచ్చిమొక్కలను తొలగించాలన్నారు. ఈ కార్యక్రమంలో డీసీ చంద్రశేఖర్, సిబ్బంది పాల్గొన్నారు.

బాలికల గురుకులంలో విషజ్వరాలు..!

పలువురు విద్యార్థినులకు అస్వస్థత ● తక్షణ చర్యలకు మంత్రి ఆనం ఆదేశం



ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలలో చికిత్స పొందుతున్న విద్యార్థినులు

ఆత్మకూరు, సెప్టెంబరు 12 (ఆంధ్రజ్యోతి): మున్సిపాల్టీ పరిధిలోని బాలికల గురుకుల పాఠశాలలో పలువురు విద్యార్థినులు విషజ్వరాల బారినపడి అస్వస్థతకు గురయ్యారు. సమాచారం తెలుసుకున్న రాష్ట్ర మంత్రి ఆనం రామనారాయణరెడ్డి తక్షణమే స్పందించి జిల్లా కలెక్టర్, అధికారులతో గ్రూప్ టెలికాన్ఫరెన్స్ నిర్వహించి తక్షణ చర్యలు చేపట్టి విద్యార్థినులకు మెరుగైన వైద్యసేవలు అందించాలని ఆదేశించారు. జిల్లావ్యాప్తంగా విద్యాలయాల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సూచించారు. దాంతో అధికార యంత్రాంగం అప్రమత్తం అయింది. వైద్య ఆరోగ్య, రెవెన్యూ, పోలీసు అధికారులు ఆత్మకూరులోని గురుకుల పాఠశాలకు తరలివచ్చి పరిస్థితిని సమీక్షించారు. జ్వరాల బారిన పడిన విద్యార్థినులను ఆత్మకూరు ప్రభుత్వ జిల్లా వైద్యశాలకు తరలించి తక్షణ వైద్య సేవలు అందించారు. జిల్లా జాయింట్ కలెక్టర్ కార్తీక్, ఆర్డీవో బి పావని, జిల్లా వైద్యశాఖాధికారులు సుజాత, షేక్ ఖాదర్‌వలీ, జిల్లా వైద్యశాల సూపరింటెండెంట్ డాక్టర్ శేషారత్నం తదితరులు విషజ్వరాల తీవ్రతపై విద్యార్థినులు, ఉపాధ్యాయులతో మాట్లాడి విషయాలు తెలుసుకున్నారు. ప్రస్తుతం జ్వరాల బారినపడిన విద్యార్థినుల ఆరోగ్యం నిలకడగా ఉందని, ఎలాంటి భయాందోళనలు అవసరం లేదని అధికారులు తెలిపారు. కాగా, టీడీపీ పట్టణ అధ్యక్షుడు తుమ్మల చంద్రారెడ్డి, సీనియర్ నాయకుడు పిడికిటి వెంకటేశ్వర్లునాయుడు, మున్సిపల్ ఛైర్‌పర్సన్ జి వెంకటరమణమ్మ, టీడీపీ రాష్ట్ర మహిళా కార్యదర్శి పులిమి శైలజారెడ్డి తదితరులు మంత్రి ఆనం ఆదేశాల మేరకు అస్వస్థతకు గురైన విద్యార్థినులను పరామర్శించి పండ్లు అందజేశారు.

ఉపాధ్యాయ సమస్యలు పరిష్కరించండి

నెల్లూరు (విద్య), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని టీఎన్‌యూఎస్ నేతలు కోరారు. నగరంలోని టీడీపీ జిల్లా కార్యాలయంలో శనివారం నిర్వహించిన సమావేశంలో ఆ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ఆర్.వెంకటేశ్వర్లు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు సంబంధించిన అనేక సమస్యలు పెండింగ్‌లో ఉన్నాయని, ప్రధానంగా డీఏలు, ఐఆర్‌ను ప్రకటించడతో పాటు పీఆర్‌సీ కమిటీని నియమించాలన్నారు. దీనికోసంగా ప్రభుత్వ పెద్దలతో చర్చించి సమస్యలను పరిష్కరించేందుకు కృషి చేస్తామన్నారు. జిల్లాలో సభ్యత్వ నమోదును విస్తృతం చేసి సంఘం బలోపేతం చేసేందుకు నేతలు పాటుపడాలని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి వెంకటేశ్వర్లు, జిల్లా అధ్యక్షుడు రామచంద్రయ్య యాదవ్, ప్రధానకార్యదర్శి రవీంద్ర, నేతలు వెంకటేశ్వర్లు, పద్మయ్యనాయుడు, బాలబ్రహ్మచారి, ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

కారుణ్య నియామకాలు చేపట్టాలి

● హంస జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): వైద్య ఆరోగ్యశాఖలో ఎంతో కాలంగా పెండింగ్‌లో ఉన్న కారుణ్య నియామకాలు తక్షణం చేపటట్టాలని ఆంధ్రప్రదేశ్ హెల్త్ అడ్మినిస్ట్రేటివ్ మెడికల్ సర్వీసెస్ అసోసియేషన్ (హంస) జిల్లా అధ్యక్షుడు చేజర్ల సుధాకర్‌రావు డిమాండ్ చేశారు. ఇటీవల హంస నెల్లూరు సిటీ, జిల్లా అధ్యక్ష, కార్యదర్శులతో పాటు కార్యవర్గ ఎన్నిక జరిగింది. ఆయా కార్యవర్గ నేతలను నగరంలోని హంస కార్యాలయంలో శనివారం ప్రత్యేకంగా అభినందించారు. ఈ సందర్భంగా చేజర్ల మాట్లాడుతూ ఉమ్మడి జిల్లాల్లో కారుణ్య నియామకాలలో జాప్యం జరుగుతుండడంతో ఆయా కుటుంబాలు ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. ఏఎన్ఎంలు 1998 నుంచి ఉద్యోగ ఉన్నతులకు నోచుకోలేదని, కొంత మంది ఉద్యోగ విరమణ కూడా చేశారని పేర్కొన్నారు. అర్హత ఉన్న వారికి ఉద్యోగ ఉన్నతులు కల్పించాలని కోరారు. కోర్టు తీర్పుతో తొలగించిన హెల్త్ అసిస్టెంట్‌లను మానవతా దృక్పథంతో విధుల్లోకి తీసుకోవాలని కోరారు. ఫార్మసీలు, ల్యాబ్ టెక్నీషియన్‌లకు ఉద్యోగ ఉన్నతులు కల్పించాలని కోరారు. ఈ కార్యక్రమంలో హంస జిల్లా ప్రధాన కార్యదర్శి కమల్ కిరణ్, జిల్లా గౌరవ అధ్యక్షురాలు ఇందిర, గౌరవ సలహాదారు అరవ పరిమళ, అసోసియేట్ అధ్యక్షుడు కప్పా నారాయణరావు, జిల్లా కార్యనిర్వాహక కార్యదర్శి జలీల్ అహ్మద్, కోశాధికారి శేషగిరిరావు, మజార్, రాజయ్య, నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



కార్యవర్గ అభినందన కార్యక్రమంలో మాట్లాడుతున్న హంస జిల్లా అధ్యక్షుడు చేజెర్ల సుధాకర్‌రావు

అమ్మ ఒడి.. అంగన్‌వాడీ!

● గర్భిణులను కంటికి రెప్పలా కాపాడుతూ... ● అంగన్‌వాడీ టీచర్ల సేవలు అమూల్యం

కోవూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గర్భిణీలు, బాలింతల సంక్షేమానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చర్యలు తీసుకుంటున్నాయి. అంగన్‌వాడీ కేంద్రాల్లో వారి సంక్షేమానికి తోడ్పడుతున్నాయి. జిల్లాలోని 2,934 అంగన్‌వాడీ కేంద్రాల్లో 14,195 మంది గర్భిణీలకు అంగన్‌వాడీ కార్యకర్త లు సేవలందిస్తున్నారు. గర్భిణీలకు పోషకాహారం అందిస్తూనే 'జననీ సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృవందన యోజన' పథకాల ద్వారా ఆర్థిక సహాయం అందే విధంగా కృషి చేస్తున్నారు. గర్భిణీ ప్రసవించిన తరువాత రాష్ట్ర ప్రభుత్వ పథకమైన 'జననీ సురక్ష యోజన' ద్వారా రూ. 1000, కేంద్ర ప్రభుత్వ ప్రధానమంత్రి 'మాతృవందన యోజన' నుంచి రూ. 5000 అందేలా చర్యలు తీసుకుంటున్నారు. గర్భిణీల ఆరోగ్యాన్ని కాపాడటమే కాకుండా వారికి ఆర్థిక సహాయం అందించేందుకు కూడా అంగన్‌వాడీలు కృషి చేస్తున్నారు.

● దరఖాస్తు చేయడం ఎలా?

'జననీ సురక్ష యోజన, ప్రధానమంత్రి మాతృవందన యోజన' పథకాల ద్వారా ఆర్థిక సాయం పొందాలనుకునే గర్భిణీలు ముందుగా అంగన్‌వాడీ కేంద్రాల్లో తమ పేర్లను నమోదు చేయించుకోవాలి. అంగన్‌వాడీ కార్యకర్తలు దరఖాస్తుల్ని సేకరించి జిల్లా, రాష్ట్ర అధికారులకు పంపుతారు. గర్భిణీ వయస్సు 18 సంవత్సరాల ఏడు నెలలు పూర్తయి ఉండాలి. 55 సంవత్సరాల లోపు గర్భిణిలు మాత్రమే అర్హులు. ఆధార్ కార్డు, జనన ధృవీకరణ పత్రం, పాస్‌పోర్టు సైజు ఫోటో, బ్యాంకు ఖాతా వివరాలు, ఆరోగ్యకార్డుల్ని అంగన్‌వాడీ కార్యకర్తలకు అందించాలి.

● ఆర్థిక సాయం అందుతుందిలా...

గర్భం దాల్చిన ఆరు నెలల తరువాత వైద్యుడి పరీక్ష నిర్ధారణ తర్వాత ప్రతీ గర్భిణికీ రూ. 3000 చెల్లిస్తారు. ప్రసవం అనంతరం బిడ్డకు టీకాలు వేయించాక రూ. 2000 చెల్లిస్తారు. గర్భిణి బ్యాంకు ఖాతాలోనే నగదు జమ చేస్తున్నందువల్ల ఎలాంటి ఇబ్బందులు లేకుండా ఆర్థిక సహాయాన్ని పొందుతున్నారు. ప్రసవించిన వెంటనే రాష్ట్ర ప్రభుత్వం రూ 1000 చెల్లిస్తుంది.



గర్భిణీకి సీమంతం చేస్తున్న అంగన్‌వాడీ కార్యకర్త

బాలలకూ, గర్భిణులకు సేవలందిస్తున్నాం



'అంగన్‌వాడీ కేంద్రాల్లో బాలలకూ, గర్భిణీలకు సేవ చేస్తున్నాం. పోషకాహారం అందించడంతో సరిపెట్టుకోకుండా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాల పథకాల్ని గర్భిణీలకు వర్తించే విధంగా కృషి చేస్తున్నాం. జిల్లాలోని అంగన్‌వాడీ కార్యకర్తలందరూ బాధ్యతగా గర్భిణీలకు సేవలందిస్తున్నారు. ఎన్ని ఒడిదొడుకులు ఉన్నప్పటికీ గర్భిణీలు, బాలింతల సంక్షేమం కోసం పని చేస్తున్నాం.'

- సుజాత, జిల్లా అధ్యక్షురాలు, స్త్రీ, శిశు సంక్షేమ సంఘం

రేపు ఆశా వర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ

● జిల్లా ప్రధాన కార్యదర్శి అన్నపూర్ణమ్మ

నెల్లూరు(వైద్యం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఏపీ ఆశావర్కర్స్ యూనియన్ జిల్లా మహాసభ ఈనెల 15వ తేదీన డాక్టర్ జెట్టి శేషారెడ్డి విజ్ఞాన కేంద్రంలో జరుగుతుందని యూనియన్ జిల్లా ప్రధాన కార్యదర్శి దుగ్గిరాల అన్నపూర్ణమ్మ వెల్లడించారు. శనివారం సీఐటీయూ జిల్లా కార్యాలయంలో జరిగిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. ఈ మహాసభకు యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి ధనలక్ష్మి, సీఐటీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి అజయ్‌కుమార్ ముఖ్య అతిథులుగా పాల్గొంటారని చెప్పారు. జిల్లా వ్యాప్తంగా 300 మంది ప్రతినిధులు హాజరవుతారన్నారు. గడచిన మూడేళ్లలో ఆశాల సమస్యలపై జరిగిన పోరాటాలు, సాధించిన విజయాలపై చర్చిస్తామని తెలిపారు. ఆశాలకు వేతనాలు పెంపు, ఎవరైనా చనిపోతే మట్టి ఖర్చులు సాధించుకున్నామన్నారు. అలాగే పెన్షన్, ఇన్సూరెన్సూ సాధించుకోవాల్సి ఉందన్నారు. రాష్ట్ర ప్రజలకు వైద్య సేవలు అందిస్తున్న ఆశాలను ప్రభుత్వం రెగ్యులర్ చేయాలని, అందుకోసం సమరశీల పోరాటాలకు ఈ మహాసభలో పిలుపు నిస్తామన్నారు. ఈ కార్యక్రమంలో యూనియన్ జిల్లా అధ్యక్షుడు విజయలక్ష్మి, స్వర్ణ, కృష్ణమ్మ, శిరీష, రేణుక తదితరులు పాల్గొన్నారు.



విలేకరుల సమావేశంలో మాట్లాడుతున్న అన్నపూర్ణమ్మ

రేపటి నుంచి గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల పంపిణీ

పోస్టర్ ఆవిష్కరించిన కలెక్టర్ హిమాన్షు శుక్లా

నెల్లూరు(వ్యవసాయం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పశువులకు గాలి కుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమం సోమవారం నుంచి చేపడుతున్నట్లు పశుసంవర్ధకశాఖ జాయింట్ డైరెక్టర్ డాక్టర్ కే.రమేష్‌నాయక్ తెలిపారు. కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో శనివారం గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమానికి సంబంధించిన పోస్టరును జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్లా, జాయింట్ కలెక్టర్ కార్తీక్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జేడీ మాట్లాడుతూ జిల్లాలోని మూడు డివిజన్లలో 5,18,000 పశువులకు అవసరమైన టీకాలు అందుబాటులో ఉన్నాయని చెప్పారు. 4 నెలల వయస్సు దాటిన గేదెలు, ఆవులు ఉన్న ప్రతీ పాడి రైతు ఈ టీకాలను తప్పనిసరిగా వేయిం చాలని కోరారు. ఈ కార్యక్రమంలో కందు కూరు సబ్‌కలెక్టర్ హిమవంశీ, డీఆర్వో విజ యకుమార్, ఆర్డీవోలు అనూష, పావని తది తరులు పాల్గొన్నారు.



గాలికుంటు వ్యాధి నివారణ టీకాల కార్యక్రమ పోస్టరును ఆవిష్కరిస్తున్న కలెక్టర్ హిమాన్షు శుక్లా, జేసీ కార్తీక్ తదితరులు

టెన్నికాయిట్ ఎంపిక పోటీలకు సంగం విద్యార్థులు

సంగం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కాకినాడలో శని, ఆదివారాలలో జరిగే టెన్నికాయిట్ రాష్ట్రస్థాయి టీమ్ ఎంపికలో జరిగే పోటీల్లో పాల్గొనేందుకు సంగం ఉన్నత పాఠశాల విద్యార్థులు శనివారం ఉదయం బయలుదేరి వెళ్లారు. 9వ తేదీన సంగం పాఠశాలకు చెందిన పలువురు సీనియర్ విద్యార్థులు జిల్లాస్థాయి టీమ్‌కు ఎంపికయ్యారు. దీంతో వారు రాష్ట్రస్థాయి టీమ్ ఎంపిక పోటీల్లో పాల్గొనేందుకు పీఈటీ అంజయ్య ఆధ్వర్యంలో బయలుదేరి వెళ్లారు.

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)	
ఒక గ్రాము ధర	రూ. 10496
వెండి కిలో ధర	రూ. 132300
వెండి ఒక గ్రాము	రూ. 135.30



పశువులకు ఎద ఇంజక్షన్లు వేయించాలి

● జయచంద్ర, పశుసంవర్ధక శాఖ ఏడీ

మర్రిపాడు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పెయ్యి దూడలు పుట్టేందుకు లింగ నిర్ధారిత వీర్యం అందుబాటులో ఉన్నట్లు, పాడి రైతులు తమ పశువులకు ఎద ఇంజక్షన్లు వేయించాలని పశుసంవర్ధక శాఖ ఏడి జయచంద్ర తెలిపారు.

? ఒక్క డోస్ ఇంజక్షన్ ఎంత ధర ఉంటుంది.

! గతంలో రూ. 1350 ఉండేది. సబ్సిడీ పోను రూ. 500కు వచ్చేది. ప్రస్తుతం ప్రభుత్వం కేవలం రూ. 150కి మాత్రమే అందిస్తోంది.

? రైతులకు దీనిపై అవగాహన కార్యక్రమాలు నిర్వ హిస్తున్నారా.

! మర్రిపాడు మండలంలో 300 టీకాలు టార్గెట్ పెట్టుకొని రైతులకు అవగాహన కల్పిస్తూ ఇంజక్షన్లు వేస్తున్నాము.

? ఇంజక్షన్లపై రైతులు ఆసక్తి చూపుతున్నారా.

! గతంలో కంటే ఇప్పుడు అధికంగా తమ పశువులకు వాడుతున్నారు.

పల్లెల్లో పడకేసిన పారిశుధ్యం

● రహదారి వెంటే పేడ దిబ్బలు ● ప్రజలు, వాహనదారుల అవస్థలు



రహదారికి ఆనుకొని ఉన్న పేడదిబ్బలు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పారిశుధ్యం మెరుగుకు ప్రభుత్వం అనేక పథకాలు అమలు చేస్తున్నప్పటికీ క్షేత్ర స్థాయిలో వాటి అమలు తీరు ఎక్కడ వేసిన గొంగళి అక్కడే అన్న చందంగా ఉంది. అధికారుల అలసత్వమో, ప్రజల అవగాహన లోపమో గానీ పల్లెల్లో పారిశుధ్యం పడకేసి అపరిశుభ్రత విలయతాండవం చేస్తోంది. మారుమూల ప్రాంతాల సంగతి అటుంచితే నిత్యం రద్దీగా ఉండే గువ్వాడి గ్రామంలోని రహదారి వెంట ఇలాంటి పరిస్థితి నెలకొనడంతో ప్రజలు, వాహనదారులు అవస్థలు పడుతున్నారు. ప్రధాన రహదారి కావడంతో ఆ మార్గంలో అధికారులు, ఉద్యోగులు ప్రయాణాలు సాగిస్తున్నప్పటికీ అటువైపు కన్నెత్తి చూసే నాథులే కరువయ్యారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చెంతనే గత తెలుగుదేశం పార్టీ హయాంలో సుమారు రూ. 5లక్షలు వెచ్చించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రం, తొట్టెలు నిర్మించినప్పటికీ ఫలితం లేకుండా పోతోంది. ఎవరికి వారే యమునా తీరే అన్న చందంగా రహదారి వెంట పేడదిబ్బలు వేసి చేతులు దులుపుకుంటున్నారు. దీంతో ఆ కేంద్రం ఏళ్ల తరబడి వినియోగానికి నోచుకోక అలంకారప్రాయంగానే దర్శనమిస్తోంది. సమీపంలోనే పాఠశాల ఉండడంతో అటుగా వెళ్లే విద్యార్థులతో సహా ప్రజలు సైతం గాలి వీచిన సమయంలో దుమ్మూ, ధూళితో నిండిపోవాల్సి వస్తోందని వాపోతున్నారు. వర్షాలు కురిసిన సమయంలో దారి పొడవునా దుర్వాసన భరించలేక పోతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చెత్త నుంచి సంపద తయారీ కేంద్రాన్ని వినియోగంలోకి తీసుకొచ్చి రహదారి వెంట పేడదిబ్బలు లేకుండా చర్యలు చేపట్టాలని ప్రజలు, వాహనదారులు కోరుతున్నారు.

వైభవంగా వరసిద్ధి వినాయక కల్యాణం



వరసిద్ధి వినాయక కల్యాణం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతారామపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మండల కేంద్రంలోని అమ్మవారిశాల వద్ద వాసవి గణేష్ యూత్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం గణపతికి లక్ష గరికార్చన, సిద్ధి బుద్ధి సమేత వరసిద్ధి వినాయక కల్యాణ మహోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం గణపతి పూజ, లక్ష్మి గణపతి పూజ, వేదమంత్రాలతో అభిషేకం, హోమాలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని వినాయక కల్యాణ మహోత్సవాన్ని భక్తిశ్రద్ధలతో తిలకించారు. అనంతరం గామోత్సవం నిర్వహించారు. ఈసందర్భంగా భక్తులకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు.

కార్మికులను వీధుల పాలు చేసే

లేబర్ కోడ్‌లు రద్దుచేయాలి : సీఐటీయూ



మండల మహాసభలో మాట్లాడుతున్న సీఐటీయూ జిల్లా కార్యదర్శి వెంకటేశ్వర్లు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కార్మికులను వీధులపాలు చేసే నాలుగు లేబర్ కోడ్లను వెంటనే రద్దు చేయాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. శనివారం వరికుంటపాడులో నిర్వహించిన మండల మహాసభలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు కార్పోరేట్ శక్తులకు ప్రయోజనం కలిగించేలా చట్టాలను మార్పు చేస్తుండడం దారుణమన్నారు. అలాంటి విధానాలకు వ్యతిరేకంగా భవిష్యత్తులో పెద్ద ఎత్తున ఐక్య పోరాటాలు సాగించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. డిసెంబరు 31వ తేదీ నుంచి వచ్చే ఏడాది జనవరి 4 వరకు విశాఖపట్నంలో జరిగే అఖిల భారత మహాసభల్లో ఉద్యమ కార్యాచరణ ప్రకటించడం జరుగుతుందన్నారు. అలాగే స్కీం వర్కర్లను ప్రభుత్వ ఉద్యోగులుగా గుర్తించడంతో పాటు కనీస వేతనం రూ. 26వేలు అందజేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా నాయకుడు కాకు వెంకటయ్య, అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు వై రమణారెడ్డి, ఎం హరినారాయణ, పలు శాఖల నాయకులు షేక్ రజియా, చంచల ఓబయ్య, వజ్రమ్మ, విజయభాస్కర్, ఏసు తదితరులు పాల్గొన్నారు.

సభలు, సమావేశాలకు అనుమతుల్లేవు:సీఐ

ఉదయగిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉదయగిరి సర్కిల్ పరిధిలోని సీతారామపురం, ఉదయగిరి, వరికుంటపాడు, దుత్తలూరు మండలాల్లో పోలీసు సెక్షన్ 30 అమల్లో ఉన్నందున సభలు, సమావేశాలు, పరామర్శలకు ఎలాంటి అనుమతుల్లేవని సీఐ ఎన్ వెంకటరావు శనివారం ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఇటీవల వరికుంటపాడు మండలంలోని కనియంపాడు, భాస్కరాపురం, జంగంరెడ్డిపల్లి గ్రామాల్లో శాంతిభద్రతల సమస్యలు ఉత్పన్నం కావడం, అలాగే ఉదయగిరి మండలం అప్పసముద్రం గ్రామంలో వినాయక విగ్రహ నిమజ్జనోత్సవంలో ప్రమాదవశాత్తు బాణసంచా పేలి తొమ్మిది మంది చిన్నారులు గాయపడిన సంఘటనలను దృష్టిలో ఉంచుకుని ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఈ చర్యలు చేపట్టామన్నారు. అలాగే ఆయా గ్రామాల్లో 144 సెక్షన్ అమల్లో ఉంటుందన్నారు. ఎవరైనా నిబంధనలు అతిక్రమిస్తే చట్టపరమైన చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

న్యూస్ బాక్స్

పెన్నా పరీవాహక ప్రజలు అప్రమత్తంగా ఉండాలి



ముందస్తు జాగ్రత్తలపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్న పోలీసులు

సంగం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సోమశిల జలాశయం నుంచి పెన్నానదికి నీటి విడుదలను పెంచనున్న దృష్ట్యా పెన్నా పరీవాహక ప్రజలను రెవెన్యూ, పోలీసు అధికారులు అప్రమత్తం చేస్తున్నారు. సోమశిల జలాశయం 74 టీఎంసీలకు చేరడంతో ఆదివారం పెన్నా నదికి నీటి విడుదలను పెంచనున్నారు. దీంతో మండలంలో పెన్నా పరీవాహక ప్రాంతాలైన వీర్లగుడిపాడు, కోలగట్ల, పల్లిపాళెం, పడమటిపాళెం, అనసూయ నగర్, మక్తాపురం, అన్నారెడ్డిపాళెం మజరా పల్లిపాళెం గ్రామస్థులు, గేదెల కాపరులు పెన్నా నదిలోకి వెళ్లవద్దని అధికారులు హెచ్చరికలు జారీ చేశారు. అందులో భాగంగా గ్రామాల్లో దండోరాతో పాటు పోలీసులు గ్రామాలకు వెళ్లి ప్రజలను అప్రమత్తం చేశారు.

రణభేరి ప్రచారయాత్రను విజయవంతం చేయాలి



గోడపత్రికలను ఆవిష్కరిస్తున్న యూటీఎఫ్ నాయకులు, ఉపాధ్యాయులు

ఉదయగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సూపర్ సిక్స్.. సూపర్ హిట్.. కార్యక్రమాలు జరుపుకుంటున్న రాష్ట్ర ప్రభు త్వం ఆ పథకాలు ప్రజలకు అందడానికి వారధులైన ఉద్యోగ, ఉపాధ్యాయులను విస్మరిం చిందని యూటీఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి చలపతిశర్మ పేర్కొన్నారు. శనివారం స్థానిక యూటీఎఫ్ ప్రాంతీయ కార్యాలయంలో రణభేరి ప్రచార యాత్ర కార్యక్రమంపై ఉపాధ్యాయులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈసందర్భ ంగా ఆయన విలే ఖరులతో మాట్లాడుతూ గత ప్రభుత్వ పాలన లో ఉద్యోగ, ఉపాధ్యాయులు ఎంతగానో నష్ట పోయారన్నారు. ఈ ప్రభుత్వం సైతం ఏర్పడి 14నెలలు పూర్తయినా పీఆర్సీ, ఐఆర్, డీఏలు, ఆర్థిక బకాయిల చెల్లింపు, ఉపాధ్యాయుల బోధనేతర కార్యక్రమాల రద్దు తదితర సమస్యలు పరిష్కరించడంలో నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. అందులో భాగంగా యూటీఎఫ్ రాష్ట్ర కమిటీ ఈనెల 15 నుంచి 19వ తేదీ వరకు రణభేరి ప్రచారయాత్రకు పిలుపు నిచ్చిందన్నారు. 17న ఉదయగిరిలో చేపట్టే రణభేరి ప్రచారయాత్రను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. అప్పటికీ కూడా ప్రభుత్వం స్పందించకపోతే ఈనెల 25న చలో విజయవాడ కార్యక్రమం చేపడతామని ఆయన హెచ్చరించారు. అనంతరం యాత్రకు సంబంధించిన గోడపత్రికలను ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో యూటీఎఫ్ నాయకులు ఈ తిరుపతయ్య, కె చంద్రశేఖర్‌రెడ్డి, షేక్ నాయబ్, జీ సుబ్బారెడ్డి, షేక్ హనీఫ్, భోగ్యం శ్రీనివాసులు, వెంకటేశ్వర్లు, మున్నా, రామకృష్ణ, నస్రుల్లా, సుబ్రహ్మణ్యం పాల్గొన్నారు.

సీఐటీయూ మండల కమిటీ ఎన్నిక



నినాదాలు చేస్తున్న సీఐటీయూ మండల కమిటీ సభ్యులు

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీఐటీయూ మండల కమిటీని శనివారం ఏకగ్రీవంగా ఎన్నుకోవడం జరిగింది. జిల్లా కార్యదర్శి జీ వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నిర్వహించిన ఎన్నికల్లో సమన్వయ కన్వీనర్‌గా మట్టి హరినారాయణ, కోకన్వీనర్‌గా వై రమణారెడ్డి ఎన్నికయ్యారు. సభ్యులుగా జీ ఏసు, జీ వజ్రమ్మ, షేక్‌రజియా, షేక్ బీబీ, నిర్మలమ్మ, జీ ఆరోగ్యం, వై చెన్నకేశవులు, రమణమ్మ, ఎన్ నీరజకుమార్, జీ కళావతి, నాగుసుధ, కృష్ణయ్యలను ఎన్నుకున్నారు. ఈ సందర్భంగా నూతనంగా బాధ్యతలు చేపట్టిన కమిటీ సభ్యులకు పలువురు అభినందనలు తెలిపారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కారానికి కృషి



సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేస్తున్న ఉపాధ్యాయులు

ఉదయగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యల పరిష్కారానికి బహుజన టీచర్స్ అసోసియేషన్ (బీటీఏ) కృషి చేస్తుందని వ్యవస్థాపకుడు నూక లపాటి రవణయ్య పేర్కొన్నారు. శనివారం స్థానిక ఏబీఎం ఆవరణలో బీటీఏ నాయకుడు జ్యోతి శ్రీనివాసుల అధ్యక్షతన ప్రాంతీయ సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం వెంటనే పీఆర్సీ ప్రకటించాలని, 30శాతం ఐఆర్ ఇవ్వాలని, జీవో 77ను రద్దుచేసి ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీ మహిళలకు న్యాయం చేయాలన్నారు. సమస్యలు పరిష్కరించాలని నినాదాలు చేశారు. ఈ కార్యక్రమంలో బీటీఏ నాయకులు మోహన్‌రావు, వేణుగోపాల్, ఆదినారాయణ, మాల్యాద్రి, మణి, ప్రసాద్, ఓబులేసు తదితరులు పాల్గొన్నారు.

కోనకాలువ శుభ్రం



దుర్గంపై తొట్టెలో చెత్తాచెదారాన్ని తొలగిస్తున్న కార్మికులు

ఉదయగిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణ ప్రజల దాహార్తి తీర్చే కోనకాలువను సర్పంచ్ సామ్రాజ్యం, ఉపసర్పంచ్ ముర్తుజా, డిప్యూటీ ఎంపీడీవో షేక్ కరీముల్లాల ఆదేశాల మేరకు శనివారం పంచాయతీ పారిశుధ్య కార్మికులు శుభ్రంచేశారు. దుర్గంపై గల తొట్టెలో పేరుకుపోయిన చెత్తాచెదారాన్ని తొలగించారు. అనంతరం దుర్గంపై నుంచి పట్టణంలోని దర్గా వరకు ఉన్న కాలువ వెంబడి పేరుకుపోయిన వ్యర్థాలను తొలగించి శుభ్రపరిచారు.

స్వచ్ఛతా నీవెక్కడా...?



పిచ్చిమొక్కలతో నిండిన సబ్ ట్రెజరీ కార్యాలయానికి వెళ్లే రహదారి

ఉదయగిరి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక తహసీల్దారు కార్యా లయ ఆవరణలో ఉన్న సబ్‌ట్రెజరీ కార్యాలయానికి వెళ్లే రహదారి పిచ్చిమొక్కలతో నిండి విషపురుగులకు నిలయంగా మారింది. దీంతో ఆ కార్యాలయానికి వెళ్లే ఉద్యోగులు, పింఛన్‌దారులు ఆ మార్గం గుండా వెళ్లేందుకు భయపడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి పిచ్చి మొక్కలు తొలగించి రహదారిని బాగు చేయాలని పలువురు కోరుతున్నారు.

సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి



రోగులను పరీక్షిస్తున్న డాక్టర్ ప్రమీల మాదమాల

ఆత్మకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): సీజనల్ వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలని డాక్టర్ ప్రమీల మాదమాల తెలిపారు. మండలంలోని చెర్లోయడవల్లిలో శనివారం టీడీపీ సీనియర్ నాయకుడు, మాజీ సర్పంచ్ కేతా విజయ భాస్కర్ రెడ్డి ఆధ్వర్యంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ఈ సందర్భంగా 158 మంది రోగులను పరీక్షించి వైద్యసేవలు అందించారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులకు మూడు నెలలకు సరిపడా మందులను ఉచితంగా అందజేశారు. ఈ సందర్భంగా డాక్టర్ ప్రమీల మాదమాల మాట్లాడుతూ పరిసరాలు, వ్యక్తిగత పరిశుభ్రతపై ప్రజలు అవగాహన కలిగి ఉంటే సీజనల్ వ్యాధులు దరిచేరవని తెలిపారు. బీపీ, షుగర్ వ్యాధిగ్రస్తులు తగిన జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ఏఎన్ఎంలు శషాద్‌బేగం, రాజేశ్వరి, ఆశావర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

C.R.I.M.E N.E.W.S

ప్రియురాలిని హత్య చేసి..

● చెల్లెలకు సమాచారం ఇచ్చిన ప్రియుడు



మైథిలీప్రియ(ఫైల్)

నెల్లూరు (క్రైం), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వారిద్దరూ ప్రేమలో పడ్డారు.. అయితే ప్రియుడు మరో యువతితో సన్నిహితంగా ఉన్నాడని నిలదీయడంతో ఇద్దరి మధ్య మనస్పర్థలు ఏర్పడ్డాయి. అదే విషయాన్ని తరచూ ప్రస్తావిస్తుండడంతో చిన్నపాటి వివాదాలు జరిగి చివరకు హత్యకు దారి తీశాయి. ఇద్దరి మధ్య జరిగిన గొడవలో కత్తి పొడిచి హత్య చేశాడు. ఈ ఘటన శనివారం తెల్లవారుజామున పోస్టల్ కాలనీలో జరిగింది. పోలీసుల కథనం మేరకు.. బుచ్చిరెడ్డిపాలెం మండలం పెనుబల్లికి చెందిన గిరిబాబు, లక్ష్మి దంపతులు. వారికి మైథిలీ ప్రియ (23), సాహితిలు సంతానం. గిరిబాబు 2020లో గుండెపోటుతో మృతి చెందాడు. మైథిలీప్రియ వెంకటాచలంలోని ఓ కళాశాలలో ఈ ఏడాది మార్చిలో బీ ఫార్మసీ పూర్తి చేసింది. ఆమె బీ ఫార్మసీ చదివే సమయంలో అదే కళాశాలలో సహచర విద్యార్థి రాపూరు మండలానికి చెందిన నిఖిల్‌తో ప్రేమలో పడింది. ఆమె నగరంలోని రాజరాజేశ్వరి ఆలయం సమీపంలో పీజీలో ఉంటూ కళాశాలకు వెళ్లేది. ఆమె చెల్లెలు సాహితి గూడూరు సమీపంలోని ఓ ఇంజనీరింగ్ కళాశాలలో బీటెక్ చదువుతూ అక్కతో కలిసి కొంతకాలం పీజీలో ఉంది. అనంతరం వారిరువురు పోస్టల్ కాలనీ మొదటి వీధిలో ఓ గదిని అద్దెకు తీసుకున్నారు. ఆ గదికి ఎదురు భవనంలో నిఖిల్ ఉంటున్నాడు. ఈ క్రమంలో నిఖిల్ మరో యువతితో సన్నిహితంగా ఉంటూ ప్రియు రాలితో గొడవపడేవాడు. నాలుగు నెలల కిందట మైథిలీప్రియకు బెంగ ళూరులోని అమెజాన్ కంపెనీలో ఉద్యోగం రావడంతో అక్కడకు వెళ్లింది. ఈనెల 6వ తేదీన ఆమె పుట్టినరోజు కావడంతో 3వ తేదీ నెల్లూరుకు వచ్చింది. చెల్లెలు గదిలో కుటుంబసభ్యులతో కలిసి పుట్టిన రోజు జరుపుకుంది. ఈ క్రమంలో నిఖిల్ పలుమార్లు ఆమెకు ఫోన్‌చేసి గొడవపడు తుండేవాడు. అక్క బాధను గమనించిన సాహితి అతనితో ఇక వద్దని సూచించింది. అయినా ఆమె పట్టించుకోలేదు. ఈ క్రమంలో శుక్రవారం రాత్రి మైథిలీప్రియ ఫోన్ చూసుకుంటూ ఉండడంతో చెల్లెలు నిద్రపోయింది. అర్ధరాత్రి 1.45 గంటల ప్రాంతంలో సాహితి నిద్రలేచి చూడగా పక్కన అక్క కన్పించకపోవడంతో ఫోన్ చేసింది. ఫ్రెండ్స్‌తో బయట ఉన్నానని, పది నిమిషాల్లో వస్తానని, నిఖిల్‌కు ఫోన్ చేయవద్దని చెప్పింది. దీంతో ఆమె నిద్రపోయింది. శనివారం తెల్లవారుజామున 3.35 గంటల సమయంలో నిఖిల్ సాహితికి ఫోన్ చేసి మీ అక్క నావద్ద ఉందని, వచ్చి తీసుకెళ్లాలని చెప్పాడు. దీంతో ఆమె తన స్నేహితురాలితో పాటు, రూమ్ కింద పోర్షన్‌లో ఉంటున్న ఓ మహిళను తీసుకొని నిఖిల్ గది వద్దకు వెళ్లింది. అక్కడ మెట్లపై మైథిలీప్రియ కూర్చొని ఉండటం గమనించి అక్కా అంటూ పలకరించగా ఉలుకు, పలుకు లేకుండా ఉండటంతో దగ్గరకు వెళ్లి చూసింది. ఆమె ఎడమ చాతికింద కత్తిపోటుకు గురై రక్తస్రావమై ఉంది. అక్కడే ఉన్న నిఖిల్‌ను తన అక్కను ఏమి చేశావంటూ సాహితి గట్టిగా ప్రశ్నించడంతో నాతో మీ అక్క గొడవ పడిందని, కత్తితో పొడవడంతో మృతి చెందిందని చెప్పాడు. దీంతో అక్కను పట్టుకొని కన్నీరు మున్నీరైన సాహితి జరిగిన విషయాన్ని తన కుటుంబ సభ్యులకు తెలియజేసింది. వారు సంఘటన స్థలానికి చేరుకొని బోరున విలపించారు. ఈ క్రమంలోనే నిఖిల్ అక్కడ నుంచి నేరుగా దర్గామిట్ట పోలీసు స్టేషన్‌కు వెళ్లి లొంగిపోయినట్లు సమాచారం. హత్య విషయంపై సమాచారం అందుకున్న దర్గామిట్ట పోలీసులు సంఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జీజీహెచ్ మార్చురీకు తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

వరికుంటపాడులో 144 సెక్షన్

● గ్రామాల్లో పోలీసుల పహారా



దుకాణాల వద్ద పోలీసుల పహారా

వరికుంటపాడు (ఉదయగిరి రూరల్), సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వరికుంటపాడు పంచాయతీ పరిధిలోని వరికుంట పాడు, భాస్కరాపురం గ్రామాల పరిధిలోని సర్వే నంబర్లు 233,1లో మైనింగ్ అనుమతులను రద్దు చేయాలని ఇటీవల కాలంలో పంచాయతీ పరిధిలోని గ్రామాల ప్రజలు రోజుల తరబడి పోరాటాలు సాగిస్తున్నారు. తమకు న్యాయం చేయాలని కోరుతూ ప్రజాప్రతినిధులు, అధికారులు, రాజకీయ, ప్రజా సంఘాలకు వినతిపత్రాలు సైతం అందజేశారు. అందులో భాగంగా ఆదివారం బీసీవై పార్టీ అధ్యక్షుడు బోడె రామచంద్రయాదవ్ ఆ ప్రాంతాన్ని సందర్శించి ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలపై చర్చించనున్నారు. ఈనేపథ్యంలో విషయం తెలుసుకున్న తహసీల్దారు హేమంత్‌కుమార్ ఎలాంటి అవాంఛనీయ సంఘటనలు జరుగకుండా ముందస్తు జాగ్రత్త చర్యల్లో భాగంగా శనివారం నుంచి శాంతి భద్రతల దృష్ట్యా 144 సెక్షన్ విధిస్తున్నట్లు ఉత్తర్వులు జారీచేశారు. మూడు రోజుల పాటు అలాంటి పరిస్థితే కొనసాగుతుండడంతో ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. బహిరంగ ప్రదేశాల్లో ఐదుగురి కంటే ఎక్కువగా గూమికూడదన్నారు. అలాగే ఎలాంటి సమావేశాలు నిర్వహించినా, ఆయుధాలతో సంచరించినా చట్టపరమైన చర్యలు తప్పవని హెచ్చరించారు. పోలీసులు సైతం పోరాటాల్లో కీలకంగా వ్యవహరించిన కొంతమందికి హెచ్చరికలు జారీ చేయడంతో పాటు బస్టాండ్ సెంటర్‌తో సహా ప్రధాన కూడళ్లు, గ్రామాల్లో పహారా నిర్వహించడం ఉత్కంఠ నెలకొంది. కాగా, రామచంద్రయాదవ్‌ను పోలీసులు మార్గమధ్యంలోనే అడ్డుకుంటారో, పర్యటన కొనసాగితే ఎలాంటి పరిస్థితులు చోటుచేసుకుంటాయోనని సర్వత్రా చర్చనీయాంశంగా మారింది.

లారీ ఢీకొని యువకుడి మృతి

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): లారీ ఢీకొని యువకుడు మృతి చెందిన ఘటన నెల్లూరు జాతీయ రహదారిపై జరిగింది. పోలీసుల కథనం మేరకు.. టీపీ గూడూరు మండలం ఈదూరుకు చెందిన మహేష్(26), సుష్మలు దంపతులు. నెల్లూరు ఆటో నగర్‌లోని వెంకటేశ్వర వైర్‌ప్రొడక్ట్ షాపులో మహేష్ అకౌంటెంట్‌గా పనిచేస్తున్నారు. శుక్రవారం రాత్రి ఆయన షాపులో పని ముగించుకొని జాతీయ రహదారి మీదుగా బైక్‌పై ఇంటికి వెలుతుండగా మెడికవర్ వైద్యశాల సమీపంలోని పెట్రోల్‌బంకు వద్దకు వచ్చేసరికి వెనుక నుంచి కావలి వైపు వెళ్లే గుర్తుతెలియని లారీ వేగంగా బైక్‌ను ఢీకొంది. కిందపడ్డ అతనిని లారీ తొక్కుకుంటూ వెళ్లిపోయింది. ఈ ఘటనలో మహేష్‌కు తీవ్రగాయాలు కావడంతో స్థానికులు హైవేమొబైల్ సాయంతో చికిత్స నిమిత్తం జీజీహెచ్‌కు తరలించి బాధిత కటుంబసభ్యులకు సమాచారం అందించారు. చికిత్స పొందుతూ అర్ధరాత్రి మహేష్ మృతి చెందాడు. కుటుంబ సభ్యులు ఆసుపత్రి వద్దకు చేరుకుని రోదించారు. మృతుని భార్య సుష్మ నార్త్ ట్రాఫిక్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించి కేసు దర్యాప్తు చేస్తున్నారు.

నిందితులపై కేసు నమోదు

నెల్లూరు(క్రైం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉద్యోగం పేరిట మహిళను మోసం చేసిన ఘటనలో నిందితులపై వేదాయపాలెం పోలీసులు కేసు నమోదు చేశారు. ఆర్టీవో కార్యాలయం సమీపంలో శైలజ కుటుంబం నివాసం ఉంటోంది. ఆమె బీటెక్ చదివి ఉద్యోగం కోసం ప్రయత్నాలు చేస్తున్నారు. తెలిసిన వారి ద్వారా బీవీ నగర్‌లోని జాబ్ కన్సెల్టెన్సీ ప్రతినిధులు రామకృష్ణ, అజిత్‌లను సంప్రదించారు. సాఫ్ట్‌వేర్ కంపెనీలో ఉద్యోగం ఇప్పిస్తామని నెలకు రూ.35 వేలు జీతం, లాప్‌టాప్ ఇస్తారని నమ్మించి ఆమె వద్ద నుంచి వారు పలు దఫాలుగా రూ.2.69 లక్షల తీసుకున్నారు. వారి సూచనల మేరకు రెండు నెలల ట్రైనింగ్ చెన్నైలో తీసుకున్నారు. నగదు తీసుకుని నెలలు గడుస్తున్నా ఉద్యోగం ఇప్పించకపోవడంతో నిలదీయగా వారు చంపు తామని బెదిరించారు. ఈ మేరకు బాధితురాలు శనివారం వేదాయ పాలెం పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో (రూ.లలో)
బాయిలర్ లైవ్	148
స్కిన్ చికెన్	260
స్కిన్‌లెస్	286

కోడిగుడ్ల ధర (100): 550

రోడ్డు పక్కన పేరుకుపోతున్న చెత్త

వలేటివారిపాలెం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి) : మండల కేంద్రమైన వలేటివారిపాలెంలోని లింగసముద్రం రోడ్డు పక్కనే చెత్త గుట్టలుగా పేరుకపోయింది. దీంతో ఆ ప్రాంతంలో ఉండే ప్రజలు, అంగన్‌వాడీ చిన్నారులు, అటు వైపు వెళ్లే వాహనదారులు, పాదచారులు దుర్వాసన భరించలేకపోతున్నారు. అయినప్పటికీ చెత్త తొలగించడంలో పంచాయతీ అధికారులు నిర్లక్ష్యం వహిస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని, తమ ఆరోగ్యాలను కాపాడాలని ఆ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.



ఈ తూములు దాటేదెలా?

● గ్రావెల్ కొట్టుకుపోయి ధ్వంసమైన తూములు ● బాలకృష్ణారెడ్డినగర్ వాసులకు తప్పని కష్టాలు ● పట్టించుకోని అధికారులు, పాలకులు



రోడ్డు మధ్యన దెబ్బతిన్న తూములు చుట్టూ నిల్వ చేరిన మురుగునీరు

కావలిరూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణం బాలకృష్ణారెడ్డినగర్‌లో రోడ్డు మధ్యన మురుగు నీరు ప్రవహించేందుకు ఏర్పాటు చేసిన సిమెంటు తూములపై గ్రావెల్ కొట్టుకుపోయి తూములు ధ్వంసమయ్యాయి. తూములకు రెండు వైపుల మట్టి లేకపోవడం, పైపులు అడ్డదిడ్డంగా ఉండడంతో వాహనాలు రోడ్డు దాటేందుకు తీవ్ర ఇబ్బందులు పడాల్సి వస్తోంది. దీంతో మురుగునీరు మొత్తం అక్కడే నిల్వ చేరి దుర్గంధం వెదజల్లుతూ పందులకు నిలయంగా మారింది. అత్యవసర పరిస్థితుల్లో కార్లు, అంబులెన్సులు, ఆటోలు, ఇతర వాహనాలు ఆ ప్రాంతానికి వచ్చే అవకాశం లేదు. దీంతో నిత్యం రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు పడుతున్న బాలకృష్ణారెడ్డి నగర్ వాసులు ఈ విషయాన్ని అనేకమార్లు అధికారులు, పాలకుల దృష్టికి తీసుకువెళ్లినా పట్టించుకోవడం లేదన్న విమర్శలు ఉన్నాయి. రెండు తూములు వేసి ట్రక్ మట్టి తోలిస్తే సమస్య పరిష్కారమవుతుందని స్థానికులు అంటున్నారు. ఎంత మొరపెట్టుకున్నా ఈ చిన్నపాటి పనులు కూడా చెయ్యడం లేదన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఇప్పటికైనా సంబంధిత అధికారులు, పాలకులు స్పందించి ఈ సమస్యను పరిష్కారించి ప్రజల కష్టాలు తీర్చాలని ఆ ప్రాంత వాసులు కోరు తున్నారు.

న్యూస్ బాక్స్

జమునకు 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అవార్డు



పురస్కారం అందుకుంటున్న జమున

కావలి, (టౌన్) సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) ఆర్ట్ ఆఫ్ లర్నింగ్ సంస్థ హైదరాబాద్‌లో శనివారం 'తెలుగు కీర్తి కిరీటాలు' అంతర్జాతీయ పురస్కారాల ప్రదానోత్సవ సభ జరిగింది. కావలికి చెందిన విశ్రాంత ఉపాధ్యాయిని మొగిలిశెట్టి జమునకు కళా రంగంలో 'బహుముఖ ప్రజ్ఞాశాలి' అవార్డును ప్రదానం చేశారు. యువత సాహిత్య, కళా రంగాల్లో రాణించాలని, కళా రంగానికి పూర్వ వైభవం తేవడానికి కృషి చేయాలని జమున పేర్కొన్నారు.

కేంద్ర సంక్షేమ పథకాలను ప్రజల్లోకి తీసుకుపోవాలి



మాట్లాడుతున్న వీరాల శ్రీనివాసులు యాదవ్

బిట్రగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండల బీజేపీ కార్యాలయంలో మండలాధ్యక్షుడు వీరాల శ్రీనివాసులు యాదవ్ ఆధ్వర్యంలో శనివారం సాయంత్రం సమావేశం జరిగింది. ముఖ్య అతిథులుగా జిల్లా నేతలు సీవీసీ సత్యం, నూకసాని శ్రీనివాసులు యాదవ్, మామిడి వేంకటేశ్వర్లు హాజరయ్యారు. కేంద్రప్రభుత్వం ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలోకి తీసుకుపోవాలన్నారు. ప్రధాని నరేంద్ర మోదీ, ఆర్థిక శాఖ మంత్రి సీతారామన్ చిత్రపటాలకు పాలాభిషేకం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ నేతలు గోపికృష్ణయాదవ్, జీ వేంకటేశ్వర్లు, ఏకే మైఖేల్‌రాజ్, పీ సూర్యం, ఆర్ కిశోర్, గోవిందరాజులు, సుధాకర్, కొండయ్య తదితరులు పాల్గొన్నారు.

బీసీవై సమావేశానికి 100 మందికే అనుమతి

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కరేడు రైతులకు సంఘీభావంగా ఆదివారం బీసీవై పార్టీ అధినేత బోడే రామచంద్రయాదవ్ కరేడులో నిర్వహించే సమావేశాన్ని కోర్టు ఉత్తర్వులకు లోబడి మాత్రమే జరుపుకోవాలని, అతిక్రమిస్తే చర్యలు తీసుకుంటామని డీఎస్పీ సీహెచ్‌వీ బాలసుబ్రహ్మణ్యం తెలిపారు. శనివారం సాయంత్రం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం ఒకటిన్నర వరకు మాత్రమే ఆయనకు కరేడులో ఉండేందుకు అనుమతి ఉందని, అలాగే కరేడుకు చెందిన రైతులు 100 మందికి మించకుండా ఆయన సమావేశం జరుపుకోవాల్సి ఉంటుందన్నారు. బయటి గ్రామాలవారెవ్వరూ ఈ సమావేశంలో పాల్గొనేందుకు కోర్టు అనుమతించలేదని, అతిక్రమించి బయటి వ్యక్తులు వస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. ఈ విలేకరుల సమావేశంలో కందుకూరు సీఐ అన్వర్‌బాషా పాల్గొన్నారు.

విశ్వబ్రాహ్మణ కార్పొరేషన్ డైరెక్టర్‌గా చిలకపాటి

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): ఆంధ్రప్రదేశ్ విశ్వబ్రాహ్మణ సంక్షేమం, అభివృద్ధి కార్పొరేషన్ డైరెక్టర్‌గా కందుకూరు పట్టణానికి చెందిన టీడీపీ నేత చిలకపాటి మధుబాబు నియమితులయ్యారు. మధుబాబుకు డైరెక్టర్ పదవి రావడం పట్ల పలువురు అభినందనలు తెలిపారు.

నేత్రదానం



లలిత నేత్రాలను సేకరిస్తున్న వైద్యులు సునీల్

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): స్థానిక ఈఎన్‌టీ వైద్యుడు డాక్టరు పూర్ణచంద్రరావు సతీమణి లలిత అనారోగ్యంతో శనివారం మృతిచెందగా ఆమె నేత్రాలను కుటుంబ సభ్యులు దానం చేశారు. నెల్లూరు ఎల్‌వీ ప్రసాద్ కంటి వైద్యశాల కార్నియా నిపుణులు సునీల్ ఆమె నేత్రాలను సేకరించారు. ఈసందర్భంగా సక్షమ్ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు చన్నా వెంకటరామాంజనేయులు మాట్లాడుతూ నేత్రదానం పట్ల ప్రతిఒక్కరూ అవగాహన కలిగి అంధత్వ నిర్మూలనకు కృషిచేయాల్సిన అవసరం ఉందన్నారు.

ఉపాధ్యాయుల సమస్యలు పరిష్కరించాలి

● ఏపీటీఎఫ్ ఆధ్వర్యంలో నిరసన



నిరసన తెలుపుతున్న ఉపాధ్యాయులు

కావలి(టౌన్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఉపాధ్యాయుల సమస్యలు వెంటనే పరిష్కరించాలని ఏపీటీఎఫ్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు పువ్వాడి వెంకటేశ్వర్లు డిమాండ్ చేశారు. ఏపీటీఎఫ్ రాష్ట్ర వ్యాప్త నిరసనలో భాగంగా శనివారం తహసీల్దారు కార్యాలయం వద్ద ప్లకార్డులు చేతపట్టి నిరసన తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెండింగ్‌లో ఉన్న 4 డీఏలను తక్షణమే విడుదల చేయాలని, సీపీఎస్ రద్దు చేయాలని, మెమో 57ను అమలు చేయాలన్నారు. 12వ పీఆర్సీ కమిషన్‌ను నియమించి ఐఆర్ ప్రకటించాలని, అన్ని రకాల పెండింగ్ బకాయిలను చెల్లించాలని డిమాండ్ చేశారు. ఈహెచ్‌ఎస్ పరిమితిని రూ.25లక్షలకు పెంచాలని, యాప్‌లను, అసెస్మెంట్ బుక్‌లెట్ విధానాలను రద్దు చేసి ఉపాధ్యాయులను బోధనకే పరిమితం చేయాలన్నారు.

గ్రామస్థాయిలో జనసేనను బలోపేతం చేయాలి

● టిడ్కో చైర్మన్ అజయ్‌కుమార్



జనసేన కార్యాలయాన్ని ప్రారంభిస్తున్న టిడ్కో చైర్మన్ వేములపాటి అజయ్‌కుమార్ తదితరులు

కొండాపురం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): జనసేన పార్టీని గ్రామస్థాయిలో బలోపేతం చేసేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలని రాష్ట్ర టిడ్కో చైర్మన్ వేమలపాటి అజయ్‌కుమార్ పిలుపునిచ్చారు. మండలకేంద్రంలో శనివారం పార్టీ కార్యాలయాన్ని ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రారంభించారు. మారుమూల ప్రాంతంలో పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించుకోవడం శుభపరిణామమన్నారు. రానున్న స్థానిక ఎన్నికలలో పార్టీ అధ్యక్షుడు పవన్ కళ్యాణ్ సూచనలతో అభ్యర్థులను గెలిపించుకునేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కాగా పార్టీలోని వర్గ విభేదాలతో ఇటీవల జనసేన మండలాధ్యక్షుడు ఒక పార్టీ కార్యాలయాన్ని ప్రారంభించగా, మరొక కార్యాలయాన్ని ఉపాధ్యక్షుడు ప్రారంభించడం గమనార్హం. ఈ కార్యక్రమంలో జనసేన రాష్ట్ర నాయకుడు భోగినేని కాశీరావు, జనసేన మండల ఉపాధ్యక్షుడు కాకుటూరు రామమేంద్రరావు, మండలనాయకుడు తిప్పినేని రమేష్, పాల్గొన్నారు.

సంస్కారహీనంగా మాట్లాడితే సహించం



మాట్లాడుతున్న ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గ వైసీపీ ఇన్‌చార్జి బుర్రా మధుసూదన్‌యాదవ్ అర్థరహితంగా, సంస్కారహీనంగా మాట్లాడితే సహించేది లేదని కందుకూరు ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు హెచ్చరించారు. శనివారం ఆయన తన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ కనిగిరి నియోజకవర్గంలో మీరు చేసిన నిర్వాకాల గురించి చెప్పాలంటే నాకు సంస్కారం అడ్డువస్తున్నదన్నారు. వైసీపీ రైతు పోరుబాట పేరుతో రైతులను వంచించటం సరికాదని, నాడు జగన్ వరి రైతులకు ఇవ్వాల్సిన రూ. 1600 కోట్లు ఎగనామం పెట్టారని విమర్శించారు. యూరియా కొరత అనేది వైసీపీ అభూత కల్పనే తప్ప నిజం కాదని నాగేశ్వరరావు చెప్పారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వరరావు, బుస్సారెడ్డి కృష్ణారెడ్డి, పూరిమిట్ల గురునాథం, కంద్రా మాల్యాద్రి, చదలవాడ కొండయ్య, షేక్ రఫీ, తల్లపనేని రవీంద్ర తదితరులు పాల్గొన్నారు.

సీఎం రిలీఫ్‌ఫండ్ చెక్కుల పంపిణీ

కందుకూరు నియోజకవర్గంలోని 53మందికి ముఖ్యమంత్రి సహాయనిధి నుంచి మంజూరైన 31 లక్షల రూపాయల విలువైన చెక్కులను ఎమ్మెల్యే ఇంటూరి నాగేశ్వరరావు లబ్ధిదారులకు అందజేశారు.

వాన కురిస్తే దుర్గంధమే...!

● ప్రధాన రహదారిపై వర్షపు నీరు నిల్వ



ఆర్టీసీ బస్టాండు సమీపంలో రోడ్డుపై నిలిచిన వర్షపు నీరు

కలిగిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పట్టణంలో చిన్నపాటి వర్షం పడితే చాలు .. ప్రధాన రహదారిపై పలు ప్రాంతాల్లో నీరు నిల్వ ఉం టోంది. దీంతో ప్రజలు, దుకాణదారులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ముఖ్యంగా కలిగిరమ్మ గుడి సెంటర్, ఆర్టీసీ బస్టాండు, హెచ్‌పీ పెట్రోల్ బంకు తదితర ప్రాంతాల్లో వర్షపునీరు వారం రోజులపాటు నిల్వ ఉంటోంది. మురుగుగా మారి దుర్గంధం వెదజల్లుతోంది. ఈ ప్ర దేశాలు వ్యాపారకేంద్రాలు కావడంతో నిత్యం రద్దీగా ఉంటాయి. ప్రధాన రహదారిపై పడిన వర్షపు నీరు వెళ్ళేందుకు మార్గం లేక రోడ్డుపైనే నిల్వ ఉంటోంది. కలిగిరి పట్టణంగుండా వెళ్ళే రహదారి జాతీయ రహదారిగా మారిందని పంచాయతీ పాలకులు, అధికారులు రోడ్డుపై నీటిని తొలగించడం లేదు. కాంట్రాక్టర్లు పట్టణంలో రోడ్డు నిర్మాణ పనుల్లో జాప్యం చేస్తుండంతో పట్టణవాసులు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. ప్రధాన రహదారిపైన, పల్లపు ప్రాంతాలవద్ద వర్షపు నీరు నిలవకుండా ఆర్‌అండ్‌బీ అధికారులు చర్యలు తీసుకోవాలని స్థానికులు కోరుతున్నారు.

కర్మ క్రతువులకు నీళ్లు లేవు...

● శ్మశానంలో చేతి పంపునకు మరమ్మతులు చేయరూ..

బిట్రగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మేజర్ పంచాయతీలోని శ్మశానవాటికలో చేతి పంపు మరమత్తులకు గురి కావడంతో శనివారం కర్మక్రతువులు చేసేవారు తీవ్ర ఇబ్బందులు పడ్డారు. యాదవపాలెంకు చెందిన చిట్టిబోయిన రమణమ్మ (70) అనారోగ్యంతో శుక్రవారం మృతి చెందింది. అంత్యక్రియలు నిర్వహించేందు శ్మశానవాటికకు తీసుకెళ్లగా, అక్కడి చేతి పంపు పనిచేయలేదు. దీంతో క్యాన్లతో నీళ్లు మోసుకొచ్చి కార్యక్రమం నిర్వహించుకున్నారు. చేతి పంపు మరమత్తులకు గురై ఐదు నెలలు కావస్తున్నా పంచాయతీ అధికారులు పట్టించుకోవడం లేదని టీడీపీ నేత దేవరాల తిరుపతి యాదవ్ ఆవేదన వ్యక్తం చేశారు.

లోక్ అదాలత్‌లో ఇరుపక్షాలకు సత్వర న్యాయం



మాట్లాడుతున్న లోక్ అదాలత్ చైర్‌పర్సన్ గీతావాణి

కావలి రూరల్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జాతీయ మెగా లోక్ అదాలత్‌లో ఇరుపక్షాలకు సత్వరన్యాయం జరుగుతుందని కావలి సీనియర్ సివిల్ జడ్జి, లోక్ అదాలత్ చైర్‌పర్సన్ ఏ గీతావాణి పేర్కొన్నారు. కావలి పట్టణ సబ్ కోర్టు ఆవరణలో శనివారం జాతీయ మెగా లోక్ అదాలత్ నిర్వహించారు. లోక్ అదాలత్ చైర్మన్ గీతావాణి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్ జడ్జి ఈ సుధాకర్‌రావు, లోక్ అదాలత్ సభ్యుడు మాలకొండారెడ్డి, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు చక్రపాణి, కార్యదర్శి రుషి, లోక్ అదాలత్ బెంచ్ న్యాయవాదులు డీ శ్రీదేవి, ఐ సాయి ప్రసాద్‌లు వివిధ రకాల 111 కేసులతో పాటు సుమారు రూ. 43,34,500 నగదు వ్యాజ్యాలు పరిష్కరించారు. ఈ సందర్భంగా చైర్మన్ గీతావాణి మాట్లాడుతూ లోక్ అదాలత్ ద్వారా ఇరుపక్షాలు రాజీ మార్గం ద్వారా సత్వర న్యాయం పొందాలన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ చేసుకోవటం ద్వారా అప్పీలు లేని అంతిమ తీర్పు వస్తుందని, కక్షిదారులు లోక్ అదాలత్ సేవలు వినియోగించుకుని ప్రశాంతంగా జీవించాలని కోరారు. ఈ కార్యక్రమంలో అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ మృదుల, న్యాయవాదులు, కక్షిదారులు, వివిధ బ్యాంకుల సిబ్బంది, పోలీసులు పాల్గొన్నారు.

జిల్లాస్థాయి టెన్నిస్ టోర్నమెంట్ ప్రారంభం



టెన్నిస్ టోర్నమెంట్‌ను ప్రారంభిస్తున్న నిర్వాహకులు

కావలి (టౌన్)సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): కావలి పట్టణ విట్స్ ఇంజనీరింగ్ కళాశాల టెన్నిస్ క్రీడా ప్రాంగణంలో శనివారం ఉమ్మడి నెల్లూరు జిల్లాస్థాయి పులివర్తి రాఘవ నాయుడు మెమోరియల్ టెన్నిస్ (డబుల్) టోర్నమెంట్ ప్రారంభమైంది. జేబీ విశ్రాంత అధ్యాపకుడు భాస్కరరావు ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ టోర్నమెంట్‌ను జేబీ ప్రిన్సిపాల్ సుబ్రహ్మణ్యంనాయుడు ప్రారంభించారు. మూడు విభాగాల్లో పోటీలు నిర్వహించారు. జిల్లా వ్యాప్తంగా 70 మంది క్రీడాకారులు పోటీల్లో పాల్గొనగా, తొలిరోజు పోటీల్లో విజేతలు సెమీఫైనల్స్‌లో ప్రవేశించారు. ఆదివారంతో టోర్నమెంట్ ముగుస్తుందని జేబీ పీడీ ప్రసాద్ రెడ్డి తెలిపారు.

లోక్ అదాలత్‌లో 95 కేసుల పరిష్కారం



ఇరుపక్షాలతో మాట్లాడి కేసులను పరిష్కరిస్తున్న సీనియర్ సివిల్ న్యాయాధికారి శోభ

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కందుకూరు సబ్ కోర్టులో శనివారం నిర్వహించిన జాతీయ లోక్ అదాలత్‌లో 95 కేసులు పరిష్కరించినట్లు బార్ అసోసియేషన్ ప్రెసిడెంట్ వలేటి శ్రీధర్‌నాయుడు తెలిపారు. సీనియర్ సివిల్‌జడ్జి ఎం శోభ ఆధ్వర్యంలో ప్రిన్సిపల్ జూనియర్ సివిల్‌జడ్జి వి వెంకటేశ్వరరావు, అడిషనల్ ఫస్ట్‌క్లాస్ మేజిస్ట్రేట్‌లతో మూడు బెంచ్‌లు ఏర్పాటుచేసి ఇరువర్గాల మధ్య రాజీమార్గంలో కేసులను పరిష్కరించినట్లు తెలిపారు. ఈసందర్భంగా న్యాయమూర్తులు మాట్లాడుతూ కక్షిదారులు సులువైన మార్గంలో కేసులు పరిష్కరించుకునేందుకు లోక్ అదాలత్ మంచి అవకాశమని, రాజీపడదగిన కేసులన్నీ పరిష్కరించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఏజీపీ బెజవాడ కృష్ణయ్యచౌదరి, న్యాయవాదులు సాంబశివరావు, సీహెచ్ హరికృష్ణ, మస్తాన్‌వలి, మామిళ్లపల్లి మల్లికార్జున, షంషుద్దీన్, కేవీ లక్ష్మీనారాయణ పాల్గొన్నారు.

పాడి రైతుల ఆర్థికాభివృద్ధే లక్ష్యం



పాడి రైతులకు నగదు అందచేస్తున్న సంగం మేనేజర్ వినోద్

బిట్రగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాడి రైతుల ఆర్థికాభివృద్ధే ప్రధాన లక్ష్యంగా సంగం డెయిరీ పనిచేస్తుందని జిల్లా జోనల్ మేనేజర్ డాక్టర్ వినోద్ అన్నారు. బోగోలు మండలం ఎస్వీపాలెం పంచాయతీ సిద్దనపాలెంలో మద్దూరుపాడు కావలి పాల సేకరణ కేంద్రం 2024-25 సంవత్సరానికిగాను శనివారం పాడి రైతులకు బోనస్ నగదు పంపిణీ చేశారు. దాదాపు 68 మంది పాడి రైతులకు 2 లక్షల 75 వేల 721 రూపాయల నగదును బోనస్‌గా అందచేశారు. ఈ సందర్భంగా సంగం డెయిరీ చైర్మన్, పొన్నూరు నియోజకవర్గ శాసన సభ్యుడు ధూళిపాల నరేంద్రకుమార్ పాడి రైతుల సంక్షేమానికి ఎంతగానో కృషి చేస్తున్నారని తెలిపారు. మద్దూరుపాడు కావలి బీఎంసీ ఇన్‌చార్జి శ్రీనివాసులు మాట్లాడుతు సంగం డెయిరీ పాడి రైతులకు రాయితీపై దాణా, వరి, గడ్డి విత్తనాలు అందచేయడంతో పాటు పశు బీమా సదుపాయం కల్పిస్తుందన్నారు. ఈ కార్యక్రమంలో డెయిరీ సూపర్‌వైజర్ వెంకయ్య, పాల సేకరణ కార్యదర్శి పీ శీనయ్య, పాడి రైతులు ఉన్నారు.

వానకు నేలకొరిగిన వరి.. రైతు కంట కన్నీరు



సీఎల్ పురంలో నేలకొరిగిన వరి పైరు

బిట్రగుంట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): బోగోలు మండలంలో అల్పపీడన ప్రభావంతో పలు చోట్ల కోతకు వచ్చిన వరి పైరు నేలకొరిగింది. మొదటి కారు కన్నా దిగుబడి బాగా వచ్చిందని ఆనందంలో ఉన్న రైతన్నలకు శనివారం కురిసిన వర్షం శాపంగా మారింది. చెంచులక్ష్మీపురం, తదితర ప్రాంతాల్లో వరి భారీ వర్షానికి నేలకొరిగింది. చేతికి వచ్చిన పంట నేలపాలవుతుండటంతో రైతులు కన్నీటిపర్యంతమయ్యారు. వాతావరణం అనుకూలంగా ఉండటంతో మండలంలో దాదాపు 4 వేల ఎకరాలకు పైగా రెండో క్రాప్ వరి సాగు చేశారు. అందులో నాలుగు వందల ఎకరాల లోపు మాత్రమే వరి కోత జరిగింది. మగిలిన 3600 ఎకరాల్లో మరో 15 రోజుల్లో కోతలు పూర్తి కావాల్సి ఉంది. ఈ నేపథ్యంలో భారీ వర్షాలు కురుస్తుండటంతో రైతులు తీవ్రంగా నష్టపోతున్నారు. కోతలు ప్రారంభమై వారం రోజులవుతున్నా మండలంలో ఇంకా ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించకపోవడంతో రైతులు ఆందోళన చెందుతున్నారు. అధికారులు వెంటనే స్పందించి ధాన్యం కొనుగోలు కేంద్రాలు ప్రారంభించాలని రైతులు కోరుతున్నారు.

ఈ వారం ఇంటర్వ్యూ



డ్రాపౌట్స్ తగ్గించేందుకు కృషి

● కే.రవికుమార్, ఎంఈవో.

కొండాపురం, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో అన్ని యాజమాన్యాల పాఠశాలలు 66 ఉన్నాయి. 70 మంది డ్రాపౌట్స్‌ను గుర్తించాం. 37 మందిని వివిధ పాఠశాలల్లో చేర్పించాం. 33 మంది పిల్లల తలిదండ్రులు జీవనోపాధికి దూర ప్రాంతాలకు వెళ్లారు. వీరందరినీ గుర్తించి అక్కడే ఉన్న పాఠశాలల్లో చేర్పించి డ్రాపౌట్స్ సంఖ్యను తగ్గించేందుకు కృషి చేస్తున్నానని కొండాపురం ఎంఈవో కే.రవికుమార్ తెలిపారు.

? మండలంలో ఎన్ని పాఠశాలలు ఉన్నాయి. ఎంతమంది విద్యార్థులు ఉన్నారు.

! మండలంలో 52 ప్రాథమిక, 9 జడ్పీ ఉన్నత, ఒక ఆదర్శ, ఒక కేజీబీవీ, మూడు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. ఈ ఏడాది మూడు ప్రాథమిక పాఠశాలల్లో విద్యార్థుల సంఖ్య నమోదుకాకపోవడంతో మూసివేశాం. అన్ని పాఠశాలల్లో 3,500 మంది విద్యార్థులు ఉన్నారు.

? విద్యార్థులకు ఎస్‌ఆర్‌కే కిట్లు పూర్తిస్థాయిలో అందాయా.

! 47 మంది విద్యార్థుల తల్లిదండ్రుల ఆధార్‌కు ఫోన్ నెంబరు లింకుకాకపోవడం బయోమెట్రిక్ పూర్తికాలేదు. వారికి తప్ప మిగిలిన విద్యార్థులందరికీ ఎస్‌ఆర్‌కే కిట్లు అందాయి.

? మనబడి- మన భవిష్యత్తు పనులు జరుగుతున్నాయా.

! మనబడి- మన భవిష్యత్తు పథకం కింది 24 పాఠశాలలు ఎంపికయ్యాయి. అందులో 15 పాఠశాలల్లో కిచెన్ షెడ్లు, టాయిలెట్లు తదితర పది రకాల పనులకు నిధులు మంజూరయ్యాయి. ఉన్నతాధికారు ల ఆదేశాలు వచ్చాక పనులు మొదలు పెడుతాం.

? ఉపాధ్యాయుల కొరత ఉందా. దానిని ఎలా అధిగమిస్తున్నారు.

! మండలంలో 33 మంది ఎస్‌జీటీ, 7 ఫిజికల్ డైరెక్టర్లు, ఉన్నత పాఠశాలల్లో సుమారు 15 మంది వరకు స్కూల్ అసిస్టెంట్ల కొరత ఉంది. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు కొరత ఉన్న పాఠశాలలకు డిప్యుటేషన్‌పై ఉపాధ్యాయులను సర్దుబాటు చేస్తున్నాము.

చెక్కా కేశవ, రవ్వా శ్రీనివాసులుకు ప్రజా సేవారత్న పురస్కారాలు

కందుకూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ద్వా రా కందుకూరు పట్టణంలో నిరుపేదల కోసం సేవాకార్యక్రమాలు నిర్వహిస్తున్న రవ్వా శ్రీనివాసులు, చెక్కా వెంకటకేశవరావులకు శ్రీసాయి ప్రజాసేవారత్న పురస్కారాలు దక్కాయి. చిలకలూరిపేటలోని మెడికల్ హాలులో శనివారం జయజయ సాయి ట్రస్ట్ చైర్మన్ పూసపాటి బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో వీరిని ఘనంగా సత్కరించి పురస్కారాలు అందజేశారు.

వర్షాలు లేక అడుగంటిన భూగర్భ జలాలు



చుక్క నీరు లేక ఎండిపోయిన మన్నేరు

లింగసముద్రం, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) : రాళ్లపాడు ఎగువ భాగాన, అలాగే ప్రాజెక్టు దిగువ భాగాన ఉన్న మన్నేరు పరీవాహక ప్రాంతంతో చాలా కాలం నుండి వర్షాలు కురవక పోవడంతో భూగర్భ జలాలు అడుగంటి పోయాయి. దీంతో మన్నేరు పరీవాహక ప్రాంతంలోని రాళ్లపాడు, చీమలపెంట, తూనుగుంట, అన్నెబోయినపల్లి, వీఆర్ కోట, అంగిరేకులపాడు గ్రామాల సమీపంలో మన్నేరుకు ఇరువైపులా పొలాల్లో పత్తి పైరు, జొన్నమేత సాగు చేసిన రైతులు, మన్నేరులోని బోర్లకు నీరందక పోవడంతో ఇబ్బందులు పడుతున్నారు. అలాగే పశువులకు నీరు లేక ఇబ్బందులు పడుతున్నట్లు పశుపోషకులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సమీప భవిష్యత్తులో వర్షాలు కురవకపోతే నీటి కోసం ఇబ్బందులు పడక తప్పదని ప్రజలు వాపోతున్నారు.

కరపత్రాల ఆవిష్కరణ

నెల్లూరు(సాంస్కృతికం), (ఆంధ్రజ్యోతి) : నగరంలోని స్టోన్‌హౌస్‌పేటలో కన్యకాపరమేశ్వరి ఆలయంలో ఈనెల 22 నుంచి జరిగే దేవీనవరాత్రి ఉత్సవాల కరపత్రాలను శనివారం రాత్రి దేవస్థానం కమిటీ ఆవిష్కరించింది. కార్యక్రమంలో కోటగురుబ్రహ్మం, ఒమ్మిన సుబ్రహ్మణ్యం, భక్తులు పాల్గొన్నారు.



లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు స్వాగతం పలుకుతున్న శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు, డిప్యూటీ స్పీకర్ రఘు రామకృష్ణరాజు



రాహుల్ కన్వెన్షన్ హాల్లో ఏర్పాటు చేసిన వేదిక

మహిళాభివృద్ధికి మైలురాయి

- తిరుపతి వేదికగా నేడు, రేపు జాతీయ మహిళా సాధికార సదస్సు
- లోక్‌సభ స్పీకరు, సీఎం, గవర్నర్ సహా పలువురు ప్రముఖుల రాక
- తరలివస్తున్న పార్లమెంటు, అసెంబ్లీల మహిళా కమిటీల సభ్యులు
- రాష్ట్ర ప్రభుత్వ ఆతిథ్యం.. ప్రతిష్ఠాత్మకంగా జిల్లా యంత్రాంగం ఏర్పాట్లు

తిరుపతి, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయి కార్యక్రమాలకు ఎన్నింటికో వేదికగా నిలిచిన తిరుపతి తాజాగా కీలకమైన తొలి జాతీయ మహిళా సాధికార సదస్సుకు వేదికగా మారుతోంది. కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా భావిస్తున్న వికసిత భారత్ లక్ష్యాన్ని సాధించే క్రమంలో మహిళాభివృద్ధికి దోహదం చేసే అంశాలపై ఈ సదస్సులో చర్చించి కీలక తీర్మానాలు చేయనున్నారు. తిరుపతి వేదికగా నేటి నుంచి రెండు రోజుల పాటు జరగనున్న ఈ సదస్సుకు లోక్‌సభ స్పీకరు, రాజ్యసభ ఉపాధ్యక్షుడు, ఏపీ సీఎం, గవర్నర్, అసెంబ్లీ స్పీకరు, మండలి ఛైర్మన్, పలువురు మంత్రులు సహా పలువురు ప్రముఖులు హాజరవుతున్నారు. అలాగే దేశవ్యాప్తంగా పార్లమెంటు, శాసనసభల మహిళా కమిటీల సభ్యులు సదస్సుకు తరలివస్తున్నారు. దేశంలో మహిళాభివృద్ధికి మైలురాయి కాదగిన ఈ సదస్సుకు రాష్ట్ర ప్రభుత్వం ఆతిధ్యమిస్తోంది. దీంతో జిల్లా యంత్రాంగం ప్రతిష్ఠాత్మకంగా తీసుకుని అంతే స్థాయిలో ఏర్పాట్లు చేపట్టింది. రెండు రోజుల సదస్సుకు సంబంధించి పది రోజులకు పైగా యంత్రాంగం శ్రమించి ముందస్తు ఏర్పాట్లకు దిగింది. 200 మందికి పైగా ప్రతినిధులు హాజరవుతున్న కారణంగా వారందరికీ విడివిడిగా బస, వాహన సదుపాయాలు ఏర్పాటు చేసింది. దీనికోసం తిరుపతిలోని ఉన్నత స్థాయి హోటళ్లలో గదులు బుక్ చేసింది. వాహనాలను కూడా సమకూర్చింది. ప్రతి ప్రతినిధికీ వెంట వుండి అవసరమైన వసతులు, సౌకర్యాలూ కల్పించేందుకు లైజన్ ఆఫీసర్లను నియమించింది. వారిపై పర్యవేక్షణకు నోడల్ ఆఫీసర్లను నియమించింది. సదస్సుకు వేదికగా తిరుచానూరు బైపాస్ రోడ్డులోని రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌ను ఎంపిక చేసి ఏర్పాట్లు పూర్తి చేసింది. సదస్సుకు హాజరయ్యే ప్రతినిధులకు తిరుమల, శ్రీకాళహస్తి ఆలయాల్లో దర్శనాలకు సైతం ఏర్పాట్లు చేపట్టింది. తొలిరోజు సాయంత్రం సదస్సు ముగిశాక చంద్రగిరి కోట ఆవరణలో సాంస్కృతిక కార్యక్రమాలు నిర్వహిస్తోంది.తొలిరోజు సదస్సు ప్రారంభోత్సవంలో లోక్‌సభ స్పీకరు, రాజ్యసభ వైస్ ఛైర్మన్లతో పాటు రాష్ట్ర ముఖ్యమంత్రి చంద్రబాబు కూడా హాజరు కానున్నారు. ఆతిధ్యం ఇస్తున్న కారణంగా ఏపీ అసెంబ్లీ స్పీకరు చింతకాయల అయ్యన్న పాత్రుడు, డిప్యూటీ స్పీకరు రఘురామకృష్ణంరాజు, మండలి ఛైర్మన్ మోసేన్ రాజు, అసెంబ్లీ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, జిల్లా ఇంఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్ తదితరులు సదస్సు నిర్వహణలో కీలక పాత్ర పోషిస్తున్నారు. తొలిరోజు సీఎం చంద్రబాబు హాజరై ప్రతినిధులకు రాష్ట్ర ప్రభుత్వం తరపున మధ్యాహ్నం విందు భోజనాలు ఏర్పాటు చేస్తుండగా రెండవ రోజు ముగింపు సందర్భంగా ప్రభుత్వం తరపున గవర్నర్ అబ్దుల్ నజీర్ ప్రతినిధులకు విందు భోజనాలు ఏర్పాటు చేస్తున్నారు. మహిళలకు రాజకీయాల్లోనే కాకుండా అభివృద్ధి పరంగా ఇతర పార్టీలతో పోలిస్తే టీడీపీయే తొలినుంచీ ప్రాధాన్యత ఇస్తున్న నేపథ్యంలో సీఎం చంద్రబాబు తిరుపతి వేదికగా తొలి జాతీయ మహిళా సాధికార సదస్సుకు ఆతిథ్యమిచ్చేందుకు చొరవ చూపినట్టు సమాచారం. మొత్తానికి తిరుపతిలో రెండు రోజుల సదస్సు కారణంగా అటు ప్రముఖుల రాకపోకలు, ఇటు భద్రతా ఏర్పాట్లతో నగరంలో హడావిడి బాగా పెరిగింది.



ఏర్పాట్లను పరిశీలిస్తున్న పార్లమెంటు మహిళా సాధికారత ఛైర్‌పర్సన్ పురంధేశ్వరి

సదస్సు జరిగేదిలా.. : ఆదివారం ఉదయం 10గంటలకు సీఎం చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా చేరుకుంటారు. శాసనసభ స్పీకర్లు, ప్రతినిధులతో గ్రూప్ ఫొటో దిగుతారు. 10.45గంటలకు లోక్‌సభ స్పీకర్ ఎగ్జిబిషన్‌ను ప్రారంభిస్తారు. 10.50 సదస్సు ప్రారంభమవుతుంది. 11 గంటలకు శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు ప్రముఖులను సత్కరిస్తారు. అనంతరం రాష్ట్ర మహిళలు, శిశు, వికలాంగులు, వృద్ధులు సంక్షేమశాఖ ఛైర్‌పర్సన్ గౌరు చరితారెడ్డి ప్రసంగిస్తారు. పార్లమెంటు మహిళా సాధికారత ఛైర్‌పర్సన్ పురంధేశ్వరి, జిల్లా ఇన్‌ఛార్జి మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర శాసనసభ వ్యవహారాల మంత్రి పయ్యావుల కేశవ్, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాజ్యసభ డిప్యూటీ ఛైర్‌పర్సన్ హరివంశ్, సీఎం చంద్రబాబు, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా ప్రసంగిస్తారు. శాసనసభ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ధన్యవాదాలు తెలియజేస్తారు. 12.30 గంటలకు సీఎం అతిథ్య విందు ఇస్తారు. మధ్యాహ్నం 1.30 నుంచి సదస్సు ఇతివృత్తంపై చర్చిస్తారు. 4.20గంటలకు తీర్మాన ఆమోదంతో తొలిరోజు సదస్సు ముగియనుంది. రాత్రి 7.30 గంటలకు చంద్రగిరికోటలో శాసనసభ స్పీకర్ అయ్యన్నపాత్రుడు అతిథులకు చంద్రగిరి కోటలో విందు ఇస్తారు. సాంస్కృతిక కార్యక్రమాలను ఏర్పాటు చేశారు.

రెండో రోజు ఇలా.... : సోమవారం ఉదయం సదస్సు ప్రతినిధులు తిరుమల శ్రీవారిని దర్శించుకోనున్నారు. పది గంటలకు రాహుల్ కన్వెన్షన్ హాలులో రెండో రోజు సదస్సు ప్రారంభమవుతుంది. గవర్నర్ అబ్దుల్‌నజీర్, రాజ్యసభ డిప్యూటీ ఛైర్మన్ హరివంశ్ నారాయణసింగ్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లా, ఏపీ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, రాష్ట్ర మహిళా, శిశు, వికలాంగులు, వృద్ధులు సంక్షేమ శాఖ ఛైర్‌పర్సన్ గౌరచరితా రెడ్డి, పార్లమెంటు మహిళా సాధికారత ఛైర్‌పర్సన్ పురంధేశ్వరి ప్రసంగించనున్నారు. అసెంబ్లీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు ధన్యవాదాల తీర్మానం చేస్తారు. 12.30 గంటలకు గవర్నర్ అతిథులకు ఆత్మీయ విందు ఇవ్వనున్నారు.



తరలివస్తున్న ప్రతినిధులు

ప్రముఖుల సందర్శన

రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో సదస్సు ఏర్పాట్లను శనివారం ఎంపీ పురందేశ్వరి, ఎమ్మెల్యే పులివర్తి నాని, సీఎం కార్యక్రమాల కోఆర్డినేటర్ వెంకటేష్, కలెక్టర్ వెంకటేశ్వర్, ఎస్పీ హర్షవర్ధనరాజు, నగర పాలక సంస్థ కమిషనర్ మౌర్య, పలువురు టీడీపీ నేతలు పరిశీలించారు. సదస్సుకు ఏర్పాట్లు పూర్తయ్యాయని కలెక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

సీఎం పర్యటన ఇలా...

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): సీఎం నారా చంద్రబాబునాయుడు ఒకరోజు పర్యటన నిమిత్తం ఆదివారం జిల్లాకు రానున్నారు. ఉదయం 7.30 గంటలకు అమరావతి నుంచి ప్రత్యేక హెలికాప్టర్‌లో బయలుదేరి 9 గంటలకు తిరుచానూరు సమీపంలోని తాజ్ వద్ద ఏర్పాటు చేసిన హెలిప్యాడ్ వద్దకు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గాన తిరుపతి డీబీఆర్ ఆస్పత్రి రోడ్డులోని శ్రీకన్వెన్షన్ సెంటర్‌కు చేరుకుని విట్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు విశ్వనాథం మనవరాలు కాదంబరి వివాహానికి హాజరవుతారు. 10 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి తిరుచానూరు వద్ద రాహుల్ కన్వెన్షన్ సెంటర్‌లో జరిగే జాతీయ మహిళా సాదికారత సదస్సులో పాల్గొంటారు. 10.20 గంటలకు లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాకు స్వాగతం పలుకుతారు. అనంతరం ఉమెన్స్ ఎంపవర్‌మెంట్ డెలిగేట్స్ ఏర్పాటు చేసిన ప్రదర్శనను సందర్శించి, గ్రూఫ్ ఫొటో దిగుతారు. 10.30 నుంచి ఒంటి గంట వరకు జాతీయ మహిళా సాధికారత కాన్ఫరెన్సులో పాల్గొంటారు. డెలిగేట్స్‌కు మధ్యాహ్నం అతిథ్యం ఇవ్వనున్నారు. 2.05 గంటలకు తాజ్ హోటల్ వద్ద ఏర్పాటుచేసిన హెలిప్యాడ్ నుంచి హెలికాప్టర్‌లో విజయవాడకు బయలుదేరి వెళతారు.

10గంటలకు రానున్న గవర్నర్


గవర్నర్ అబ్దుల్ నజీర్ ఉదయం 10గంటలకు తిరుపతి విమానాశ్రయానికి చేరుకుని అక్కడి నుంచి నేరుగా తిరుపతి శ్రీకన్వెన్షన్ ఫంక్షన్ హాల్‌లో జరిగే విట్ విద్యాసంస్థల వ్యవస్థాపకుడు విశ్వనాథన్ మనవరాలు కాదంబరి వివాహ కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం హోటల్ గ్రాండ్‌రిడ్జ్‌కు చేరుకుని బస చేస్తారు. సోమవారం రాహుల్ కన్వెన్షన్‌లో జరిగే జాతీయ మహిళ సాధికారత సదస్సు ముగింపు కార్యక్రమంలో పాల్గొంటారు. శ్రీవారిని దర్శించుకోనున్నారు.

చంద్రగిరి కోట సందర్శనకు..

నేడు మధ్యాహ్నం వరకే అనుమతి

తిరుపతి(కలెక్టరేట్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): చంద్రగిరి కోట సందర్శనకు పర్యాటకులకు ఆదివారం మధ్యాహ్నం 2గంటల వరకు మాత్రమే అనుమతిస్తున్నట్లు డీఆర్వో నరసింహులు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. తిరుపతి కేంద్రంగా ఆది, సోమవారాలు జాతీయ మహిళా సాధికారత సదస్సు నిర్వహించనున్న నేపథ్యంలో ఆదివారం సాయంత్రం డెలిగేట్స్ చంద్రగిరి లైటింగ్ షోను వీక్షించనున్నారు. అక్కడే వారికి విందు ఏర్పాటు చేశారు. ఈ నేపథ్యంలో భద్రతా కారణాల రీత్యా ఈ మేరకు ఆంక్షలు విధించినట్లు డీఆర్వో వివరించారు. సోమవారం నుంచి యధాతథంగా పర్యాటకులు కోటను సందర్శించుకోవచ్చని పేర్కొన్నారు.







ఓంబిర్లాతో మాట్లాడుతున్న రఘురామ కృష్ణమరాజు, అదనపు ఈవో వెంకయ్య చౌదరి

తిరుమలలో లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా

లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లా శనివారం తిరుమలకు చేరుకున్నారు. శ్రీకృష్ణ అతిథిగృహం వద్ద టీటీడీ అదనపు ఈవో వెంకయ్య చౌదరి స్వాగతం పలికారు. ఆదివారం ఉదయం ఆయన శ్రీవారిని దర్శించుకోనున్నారు. ఏపీ డిప్యూటీ స్పీకర్ రఘురామకృష్ణరాజు కొద్దిసేపు లోక్‌సభ స్పీకర్‌తో ముచ్చటించారు.

- తిరుమల, ఆంధ్రజ్యోతి



తిరుమలేశుడిని భక్తులు ప్రశాంతంగా దర్శిస్తున్నారు

● మంత్రి సవిత

తిరుమల, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమలలో భక్తులు ఎంతో ప్రశాంతంగా వేంకటేశ్వరస్వామిని దర్శించుకుంటున్నారని మంత్రి సవిత అన్నారు. తిరుమల శ్రీవారిని శనివారం ఉదయం ఆమె దర్శించుకున్నారు. వేదపండితులు ఆశీర్వచనం చేయగా అధికారులు లడ్డూప్రసాదాలు అందజేశారు. అనంతరం మంత్రి ఆలయం ముందు మీడియాతో మాట్లాడుతూ తిరుమలలో అందిస్తున్న అన్నప్రసాదాలు, వసతి, దర్శనాలపై భక్తులు సంతృప్తి వ్యక్తం చేస్తున్నారన్నారు. రాష్ట్ర ప్రజలకు శ్రీవారి ఆశీస్సులు ఉండాలని ప్రార్థించినట్టు చెప్పారు.


సర్వదర్శనానికి 14 గంటలు

తిరుమల వేంకటేశ్వరస్వామి దర్శనానికి 14 గంటల సమయం పడుతోంది. శనివారం సాయంత్రం 5 గంటల వరకు ఉన్న సమాచారం మేరకు వైకుంఠం క్యూకాంప్లెక్స్2లో 31 కంపార్టుమెంట్లు, నారాయణగిరిలో 9 షెడ్లు సర్వదర్శన భక్తులతో నిండిపోయి క్యూలైన్ కృష్ణ తేజ విశ్రాంతి భవనం మీదుగా శిలాతోరణం సర్కిల్ వరకు వ్యాపించింది. వైకుంఠం క్యూకాంప్లెక్స్1లో 6 కంపార్టుమెంట్లలో టైంస్లాట్ భక్తులు వేచి ఉన్నారు.

గురువారం హుండీ ఆదాయం: రూ.4.18 కోట్లు

శుక్రవారం శ్రీవారిని దర్శించుకున్న భక్తులు: 69,482

తలనీలాలు సమర్పించినవారు: 28,234





జిల్లా సహకార కేంద్ర బ్యాంకు

డీసీసీబీలో ప్రక్షాళన

● గత పాలకవర్గం హయాంలో జరిగిన అక్రమాలపై చర్యలు

● 11మంది ఉద్యోగుల సస్పెన్షన్.... 30మందిపై శాఖాపరమైన చర్యలు

● ముగ్గురు సర్వీసు నుంచి తొలగింపు.. నలుగురు రిటైర్డు ఉద్యోగులపైనా చర్యలు



మాజీ సీఈవో మనోహర గౌడ్

చిత్తూరు కలెక్టరేట్, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): వైసీపీ ఐదేళ్ల పాలనలో గాడితప్పిన జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ)లో ప్రక్షాళన మొదలైంది.అప్పట్లో పాలకవర్గం నిబంధనలకు పాతరేయడంతో డీసీసీబీ అక్రమాలకు కేంద్రంగా మారింది. ఆర్థిక అవకతవకలపై అప్పట్లో తీవ్ర విమర్శలు వచ్చినా ప్రభుత్వం పట్టించుకోలేదు. కూటమి ప్రభుత్వం వచ్చాక డీఆర్వో నేతృత్వంలో జరిగిన విచారణలో అప్పటి పాలకవర్గం సహకార రంగానికి చేసిన అపకారం తేటతెల్లమైంది.ఇందుకు బాధ్యులుగా భావించి తొలివిడతగా 48మంది బ్యాంకు ఉద్యోగులపై వేటు పడింది.అక్రమాలకు బాధ్యులైన పాలకవర్గ సభ్యులపై మలివిడతలో చర్యలు తీసుకోనున్నారు.

రూ. 75కోట్లకు మించి ఆర్థిక అవినీతి

వైసీపీ హయాంలో డీసీసీబీకి ఎన్నికలు నిర్వహించకుండానే పర్సన్ ఇన్‌చార్జి కమిటీలతో కథ నడిపించారు. నాటి మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి ఆశీస్సులతో సెవెన్‌మెన్ కమిటీ డీసీసీబీలో అధికారాలను వెలగబెట్టింది.ఐదేళ్ల పాటు బ్యాంకు చైర్‌పర్సన్‌గా రెడ్డెమ్మ కొనసాగారు.ఆమెతో పాటు డైరక్టర్లు, బ్యాంకు ఉద్యోగులు, వైసీపీ నేతలు కలసిపోయి పెద్దఎత్తున అవినీతి అక్రమాలకు తెరతీశారు.ఉద్యోగ నియామకాల్లో డబ్బులు వసూలు చేయడం,అవసరం వున్నా లేకపోయినా వాహనాల కొనుగోళ్లు జరపడం, భవన నిర్మాణాలకు నిధులు మంజూరు చేయడం,బినామీ పేర్లతో కోట్లాది రూపాయలను రుణాలుగా తీసుకుని చెల్లించక పోవడం వీటిలో కొన్ని. దాదాపు రూ.75 కోట్లకు పైగా డీసీసీబీలో అవినీతి అక్రమాలు జరిగాయని అంచనా.ఈ విషయాలపై ఆంధ్రజ్యోతి అప్పట్లోనే పలు కథనాలు ప్రచురించిన విషయం తెలిసిందే.ప్రస్తుత ప్రభుత్వ ఆదేశాలతో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఈ వ్యవహారంపై డీఆర్వో మోహన్‌కుమార్‌తో విచారణ జరిపించారు. సహకార చట్టం 51వ సెక్షన్ ప్రకారం జరిగిన విచారణలో అక్రమాల గుట్టును తేల్చారు. ఈ అవినీతి పర్వంపై తదుపరి విచారణకు జిల్లా సహకార బ్యాంకు ప్రత్యేక సర్వసభ్య సమావేశం శుక్రవారం ఏకగ్రీవంగా ఆమోదం తెలిపింది.ఈ నేపథ్యంలో కలెక్టర్ సుమిత్‌కుమార్ ఆదేశాల మేరకు డీసీసీ బ్యాంకు అధికారులకు తగుచర్యలు వెంటనే చేపట్టాలని శనివారం డీసీవో లక్ష్మి సూచించారు. దీంతో బ్యాంకు అధికారులు చర్యలకు ఉపక్రమించారు. శనివారం సెలవు రోజైనా బాధ్యులందరిపై చర్యలు తీసుకుంటూ నోటీసులు జారీ చేశారు.అక్రమాలకు బాధ్యులైన పాలకవర్గ సభ్యులపై, వైసీపీ ముఖ్యులపై తొందరలో చర్యలు తీసుకోనున్నారు.

ముగ్గురు సర్వీసు నుంచి తొలగింపు

డీసీసీబీ వ్యవహారాల్లో అవకతవకలకు పాల్పడ్డారన్న ఆరోపణల కారణంగా మరో ఏడుగురిపై చర్యలు చేపట్టారు. ఉద్యోగ నియామకాల్లో జరిగిన అక్రమాలపై బాధితులు ఫిర్యాదు చేసినా గత పాలకవర్గం ఎలాంటి చర్యలు తీసుకోలేదు.నిబంధనలకు విరుద్ధంగా పర్మినెంట్ అయిన డి. జయప్రకాష్ (స్టాఫ్ అసిస్టెంట్), టి. శ్రీలక్ష్మీప్రసన్న (మేనేజర్), బి. గురునాథం (స్టాఫ్ అసిస్టెంట్)లను తొలగిస్తూ శనివారం ఉత్తర్వులు జారీచేశారు. బ్యాంకులో గత పాలకవర్గానికి మద్దతుగా తప్పుడు చర్యలకు పాల్పడిన రిటైర్డ్ అధికారులు ఎస్. ఆషాబీ (ఏజీఎం), వై. యోగీశ్వర్ రెడ్డి (ఏజీఎం), కె. కిరణ్‌కుమార్ రెడ్డి (డీజీఎం), సి. సుబ్రహ్మణ్యం (మేనేజర్)లకు నోటీసులు జారీచేశారు.

11 మంది సస్పెన్షన్... 30 మందిపై శాఖాపరమైన చర్యలు

డీసీసీ బ్యాంకు అవకతవకలకు సంబంధించి ఉన్నతాధికారుల నుంచి కిందిస్థాయి సిబ్బంది దాకా 30మందిపై శాఖాపరమైన చర్యలు తీసుకుంటూ శనివారం రాత్రి వారందరికీ నోటీసులు జారీచేశారు. మరో 11 మందిపై సస్పెన్షన్ వేటు వేశారు.అప్పటి బ్యాంకు సీఈవో, ప్రస్తుతం జీఎంగా వ్యవహరిస్తున్న ఇ. మనోహర్ గౌడ్, ఏజీఎం టి. చంద్రకళ, చీఫ్ మేనేజర్లు జె. సందీప్, కె. నవీన్ కుమార్, కె. త్యాగరాజు, మేనేజర్లు కె. వెంకటేష్ బాబు, ఆర్. పుష్పలత, ఎం. రమేష్, వి. మోహన్‌కుమార్, అసిస్టెంట్ పి. లక్ష్మారెడ్డి, స్టాఫ్ అసిస్టెంట్ మహమ్మద్ యాసీన్ సస్పెండైన వారిలో వున్నారు.

అమ్మవారి సేవలో కేంద్ర ఆర్థిక మంత్రి



నిర్మలా సీతారామన్‌కు జ్ఞాపిక అందజేస్తున్న బీజేపీ నేతలు

తిరుచానూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుచానూరు పద్మావతీ అమ్మవారిని కేంద్ర ఆర్థిక శాఖ మంత్రి నిర్మలా సీతారామన్ శనివారం దర్శించుకున్నారు. ఆలయం వద్ద జేఈవో వీరబ్రహ్మం, టీటీడీ పాలకమండలి సభ్యుడు భానుప్రకాష్‌రెడ్డి, అర్చకులు స్వాగతం పలికి దర్శన ఏర్పాట్లు చేశారు. మొదట ధ్వజస్తంభానికి నమస్కరించి, తర్వాత సన్నిధిలోని అమ్మవారి మూలమూర్తిని దర్శించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఆలయ వేదపండితులు వేదాశీర్వచనం చేసి అమ్మవారి తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయం వెలుపల బీజేపీ నేతలు ఆమెకు రాములవారి చిత్రపటం అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ డిప్యూటీ ఈవో హరీందర్‌నాథ్, టెంపుల్ ఇన్‌స్పెక్టర్ ప్రసాద్ పాల్గొన్నారు. సాయంత్రం హైకోర్టు అడ్వకేట్ జనరల్ దొమ్మలపాటి శ్రీనివాస్ కుటుంబ సమేతంగా దర్శించుకున్నారు. టెంపుల్ ఇన్‌స్పెక్టర్ రమేష్ స్వాగతం పలికి, దర్శన ఏర్పాట్లు చేశారు.

ముక్కంటి ఆలయంలో భక్తుల రద్దీ



శ్రీకాళహస్తి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): శ్రీకాళహస్తీశ్వరాలయంలో శనివారం భక్తుల రద్దీ నెలకొంది. వరుస సెలవులు కావడంతో రెండు తెలుగు రాష్ట్రాల నుంచేగాక పొరుగు రాష్ట్రాల నుంచి భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చారు. 30వేల మంది దర్శించుకున్నట్లు ఆలయాధికారులు తెలిపారు. రూ.500 అంతరాలయ దర్శనం 426, రూ.200 శీఘ్ర దర్శనం 3,581మంది, రూ.50ప్రత్యేక దర్శనం 2,611మంది దర్శించుకున్నారు. ఇక రూ.500 రాహుకేతు టిక్కెట్ల ద్వారా 3,077మంది, రూ.750 టిక్కెట్ల ద్వారా 1,349, రూ.1,500 టిక్కెట్ల ద్వారా 337మంది, రూ.2,500 టిక్కెట్ల ద్వారా 212మంది, రూ.5వేలు టిక్కెట్ల ద్వారా 93మంది భక్తులు పూజలు చేయించుకున్నారు. ఐదు రకాల ప్రసాదాలు కలిపి 25,360 అమ్ముడైనట్లు ఆలయాధికారులు తెలిపారు.



ఒక్కటైన సుబ్రమణ్యం, రంజిత దంపతులు





ఒక్కటైన చంద్రశేఖర్, పల్లవి దంపతులు - ఒక్కటైన వెంకటేష్, రాసాతి దంపతులు

లోక్ అదాలత్‌లో ఒక్కటైన మూడు జంటలు

పుత్తూరు అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): రాజీ మార్గమే రాజ మార్గమని సీనియర్ సివిల్ జడ్జి రాఘవేంద్ర పేర్కొన్నారు. శనివారం పుత్తూరు కోర్టులో జరిగిన లోక్ అదాలత్‌లో 214 కేసులు పరిష్కరించారు. ఇందులో ముఖ్యంగా మూడు జంటలు ఒక్కటయ్యాయి. న్యాయమూర్తి రాఘవేంద్ర వారికి కౌన్సెలింగ్ ఇచ్చి ఒక్కటి చేశారు. న్యాయవాదుల సంఘం కార్యదర్శి రాజేష్ పాల్గొన్నారు.

● నారాయణవనం మండలం కొండల చెరువు గ్రామానికి చెందిన బలరామ్ తన భార్య రంజితను కాపురానికి ఆహ్వానిస్తూ 2024లో కోర్టును ఆశ్రయించాడు. లోక్ అదాలత్‌లో రంజిత భర్తతో జీవించేందుకు అంగీకరించింది. సహకరించిన న్యాయవాదులకు మురగేషన్ రెడ్డి, రాజారెడ్డిలను అభినందించారు.

● నెల్లూరు జిల్లా కావలికి చెందిన చంద్రశేఖర్‌కు నారాయణవనానికి చెందిన పల్లవితో వివాహమైంది. దంపతుల మధ్య మనస్పర్థలు ఏర్పడి పల్లవి పుట్టింటికి వచ్చింది. ఈ క్రమంలో చంద్రశేఖర్ విడాకుల కోసం పుత్తూరు కోర్టులో ఈ ఏడాది కేసు దాఖలు చేశారు. లోక్ అదాలత్‌లో వీరి మధ్య రాజీ కుదిర్చారు. న్యాయవాదులు గాలి సురేష్, లక్ష్మీ నారాయణలను జడ్జి అభినందించారు.

● నందిమంగళానికి చెందిన వెంకటేష్‌కు కార్వేటినగరానికి చెందిన రాసాతి దంపతులకు ఇద్దరు పిల్లలు. వరకట్నం కోసం వేధిస్తున్నారని రాసాతి ఆరేళ్ల క్రితం కేసు దాఖలు చేసింది. ఈ కేసును అదనపు జూనియర్ సివిల్ జడ్జి రమ్యసాయి, ప్రధాన జూనియర్ సివిల్ జడ్జి జానకి విచారణ చేశారు. కౌన్సెలింగ్ ద్వారా ఈ దంపతులను ఒక్కటి చేశారు. సహకరించిన న్యాయవాది రాజేష్‌ను న్యాయమూర్తులు అభినందించారు.

రేపు జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక

తిరుపతి(క్రీడలు), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జూనియర్ బాలబాలికల కబడ్డీ జట్ల ఎంపిక పోటీలు ఈనెల 15న నిర్వహించనున్నట్లు జిల్లా కబడ్డీ సంఘం ప్రధాన కార్యదర్శి ఆర్.శ్రీధర్ శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. స్థానిక ఎస్వీయూ స్టేడియం వేదికగా జరుగనున్న ఈ పోటీల్లో పాల్గొనే క్రీడాకారులు 20 సంవత్సరాల లోపు వయస్సు ఉండాలని, బాలుర బరువు 75కిలోల లోపు, బాలికల బరువు 65కిలోల లోపు ఉండాలని వెల్లడించారు. మరిన్ని వివరాలకు 9440078979, 7993014997, 7032467395లను సంప్రదించాలని కోరారు.

ఎస్పీగా సుబ్బరాయుడు

● ప్రకాశం జిల్లాకు హర్షవర్ధనరాజు



హర్షవర్ధనరాజు



సుబ్బరాయుడు

తిరుపతి(నేరవిభాగం), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): జిల్లా ఎస్పీగా సుబ్బరాయుడిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. ఇక్కడ ఎస్పీగా పనిచేస్తున్న హర్షవర్ధనరాజును ప్రకాశం జిల్లాకు బదిలీ చేసింది. సుబ్బరాయుడు ఆదివారం బాధ్యతలు స్వీకరించనున్నారు. గత ఏడాది మే 14న జిల్లా ఎస్పీగా హర్షవర్ధ రాజు బాధ్యతలు స్వీకరించారు. ఎన్నికల కౌంటింగ్ అనంతరం ఘర్షణలు, విద్వేషాలు చోటుచేసుకోకుండా గట్టి చర్యలు తీసుకున్నారు. ఈ క్రమంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత కడప జిల్లాలో నెలకొన్న ఘటనలు, శాంతి భద్రతలను దృష్టిలో ఉంచుకుని ఆయన్ను అక్కడికి బదిలీ చేసింది. తెలంగాణా క్యాడర్‌లో ఉన్న సుబ్బరాయుడిని ఏపీకి రప్పించి తిరుపతి జిల్లాకు ఎస్పీగా నియమించింది. ఆయన గత ఏడాది జూలై 15న బాధ్యతలు స్వీకరించారు. దాదాపు ఆరు నెలలు విధులు నిర్వహించారు. ఈ ఏడాది జనవరిలో వైకుంఠ ఏకాదశి దర్శన టికెట్ల జారీ ప్రక్రియలో తిరుపతిలో జరిగిన తొక్కిసలాట ఘటన నేపథ్యంలో ఆయన్ను ఎర్రచందనం టాస్క్‌ఫోర్సు ఇన్‌చార్జిగా బదిలీ చేసింది. తొక్కిసలాట ఘటనపై విచారణ జరిపిన ఏకసభ్య కమిషన్ క్లీన్ చిట్ ఇవ్వడంతో ఆయన్ను జిల్లా ఎస్పీగా ప్రభుత్వం నియమించింది. ఇలా తిరుపతి జిల్లాకు రెండుసార్లు ఎస్పీగా పనిచేసే అవకాశం వారిద్దరికీ దక్కింది.

గంజాయిపై ఉక్కుపాదం

జిల్లాలో పనిచేసిన ఆరు నెలల కాలంలో గంజాయి అక్రమ రవాణాపై సుబ్బరాయుడు ఉక్కుపాదం మోపారు. ఎర్రావారిపాళెంలో బాలికపై అత్యాచారం ఘటనలో 24 గంటలు తిరక్క ముందే నిందితుడిని అరెస్టు చేయించారు. మహిళలపై అఘాయిత్యాలు జరగకుండా రక్షక్ టీమ్‌లు ఏర్పాటు చేసి విద్యా సంస్థల్లో అవగాహన కల్పించారు.

టెక్ పోలీసుకు ప్రాధాన్యం

జిల్లా పోలీసు శాఖలో టెక్నాలజీకి హర్షవర్ధనరాజు ప్రాధాన్యత ఇచ్చారు. నేరాల కట్టడిలో డ్రోన్లు వినియోగించి సఫలీకృతులయ్యారు. ఆటోలకు డిజిటల్ స్టిక్కర్లు ఏర్పాటు చేయించారు. ట్రాఫిక్ నియంత్రణలో డ్రోన్లు వినియోగించి విజయవంతమయ్యారు. తిరుపతి, జీవకోన, మంగళంలో సీసీ కెమెరాలు ఏర్పాటు చేసి రౌడీలపై ఉక్కుపాదం మోపారు. జీవకోనలో అవుట్ పోస్టు పోలీసు స్టేషన్ ఏర్పాటు చేశారు. అన్ని కూడళ్లలో ట్రాఫిక్ అవుట్ పోస్టులు ఏర్పాటు చేసి, పబ్లిక్ అడ్రసింగ్ సిస్టమ్ ఏర్పాటు చేశారు.

తిరుమలలో ప్రతి అంగుళాన్ని మానిటర్ చేయాలి

● అధికారులను ఆదేశించిన ఈవో అనిల్‌కుమార్ సింఘాల్



తిరుమల, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): తిరుమలలోని పలు ప్రాంతాల్లో టీటీడీ ఈవో అనిల్‌కుమార్ సింఘాల్ ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. కమాండ్ కంట్రోల్ రూమ్‌లో సీసీ కెమెరాల పనితీరును వీడియోవాల్ ద్వారా వీక్షించారు. తిరుమలలోని ప్రతి అంగుళాన్ని మానిటర్ చేయగల విధంగా సిబ్బందిని నియమించి కమాండ్ కంట్రోల్ సెంటర్ సామర్థ్యాన్ని పెంచాలని సూచించారు. ఎల్ అండ్ టీ సిబ్బందితో కూడా ఈవో టెక్నాలజీ వినియోగంపై చర్చించారు. అనంతరం పీఏసీలోని లగేజీ కౌంటర్‌ను పరిశీలించి కొందరు భక్తులతో మాట్లాడారు. వైకుంఠం క్యూకాంప్లెక్స్2కు చేరుకుని భక్తులకు అందిస్తున్న సౌకర్యాలను పర్యవేక్షించారు. ఈ సందర్భంగా శ్రీకాకుళం, మహారాష్ట్రలోని నాందేడ్ ప్రాంతాలకు చెందిన శ్రీవారి సేవకులతో మాట్లాడారు. శ్రీవారి సేవకులకు మరింత నాణ్యమైన శిక్షణ ఇచ్చి తద్వారా భక్తులకు మెరుగైన సేవలు అందించేలా చర్యలు తీసుకోవాలని సీపీఆర్వో రవికి సూచించారు. ఈ తనిఖీల్లో ఈవోతో పాటు సీవీఎస్వో మురళీకృష్ణ, డిప్యూటీ ఈవో సోమన్నారాయణ, వీఎస్వోలు రామ్‌కుమార్, సురేంద్ర, హెల్త్ ఆఫీసర్ మధుసూదన్ పాల్గొన్నారు.

పరిశ్రమల్లో నాణ్యతా ప్రమాణాలు పాటించాలి

● పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి యువరాజ్



వర్చువల్‌గా మాట్లాడుతున్న పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.యువరాజ్ - హాజరైన పారిశ్రామికవేత్తలు



తిరుపతి అర్బన్, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): అంతర్జాతీయ మార్కెట్‌తో పోటీపడాలంటే ఉత్పత్తులు తయారుచేయడమే కాకుండా పరిశ్రమలు నైతిక విలువలు పాటించాలని, నాణ్యతా ప్రమాణాలను నిలబెట్టుకోవాలని పరిశ్రమల శాఖ ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎస్.యువరాజ్ అన్నారు. శనివారం ఉదయం స్థానిక కెన్సెస్ హోటల్లో ఏర్పాటుచేసిన సులభతర వాణిజ్య అవగాహన ప్రాంతీయ సదస్సుకు పరిశ్రమల శాఖ జీఎం చంద్రశేఖర్, కలెక్టర్ వెంకటేశ్వర్ హాజరుకాగా వర్చువల్‌గా యువరాజ్ పరిశ్రమల యజమానులతో సమీక్షించారు. ఆయన మాట్లాడుతూ పరిశ్రమలు, ప్రభుత్వం కలసి ముందుకు వెళితేనే ప్రపంచ స్థాయిలో ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌లో ముందు వరుసలో ఉంటామని అభిప్రాయపడ్డారు. ఈ విషయంలో రాష్ట్రం సింగిల్ విండో సిస్టమ్, మీ సేవా కేంద్రాలు, గ్యారెంటీ యాక్ట్ వంటి కార్యాచరణ చేపట్టిందన్నారు. చిన్నస్థాయి వ్యాపారాలు ఏ అనుమతి లేకుండా వెంటనే ప్రారంభించేలా జాబితా తయారు చేయాలన్నారు. కలెక్టర్ మాట్లాడుతూ పరిశ్రమలకు సంబంధించిన ప్రతినిధుల సమస్యలు, అభ్యర్థనలు సేకరించి ఆన్‌లైన్‌లో ఉంచాలన్నారు. తిరుపతి-నాయుడుపేట జాతీయ రహదారి, గూడూరు-రేణిగుంట రైల్వే ట్రిప్లింగ్, కృష్ణపట్నం పోర్టులు, తిరుపతి ఎయిర్‌పోర్ట్ లభ్యతతో ఈ ప్రాంత తూర్పుతీరంలో పెట్టుబడులకు అత్యంత అనుకూలంగా ఉందన్నారు. వచ్చే 10-15 ఏళ్లలో త్రిభుజ ప్రాంతం(నెల్లూరు-తిరుపతి-చెన్నై)అగ్రశ్రేణి పారిశ్రామిక కేంద్రంగా అవతరించనుందన్నారు. ఈ కార్యక్రమంలో ఏపీఐఐసీ జెడ్ఎం విజయ్‌భరత్‌రెడ్డి, పరిశ్రమశాఖ డీడీ మురళి పాల్గొన్నారు.

వినూత్న ఆలోచనలే ఆవిష్కరణలకు పెట్టుబడి

● డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ సతీష్‌రెడ్డి



విద్యార్థులతో డాక్టర్ సతీష్‌రెడ్డి

తిరుపతి రూరల్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): సరికొత్త ఆలోచనలే గొప్ప ఆవిష్కరణలకు పెట్టుబడిగా నిలుస్తాయని డీఆర్‌డీవో మాజీ చైర్మన్ డాక్టర్ జి.సతీష్‌రెడ్డి పేర్కొన్నారు. విద్యార్థులు వైవిధ్య ఆలోచనలతో ఉన్నతస్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు. కరకంబాడీరోడ్డులోని శ్రీరామ ఇంజినీరింగ్ కళాశాలలో శనివారం విద్యార్థులకు ఇన్‌స్పైరింగ్ మైండ్స్ ఇంటరాక్షన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన సతీష్‌రెడ్డి మాట్లాడుతూ.. మనదేశంలో విద్యారంగంలో విప్లవాత్మక మార్పులు వచ్చాయన్నారు. ఇంక్యుబేషన్ కేంద్రాలు అందుబాటులో రావడంతో పరిశోధకులసంఖ్య బాగా పెరిగిందన్నారు. ఏపీలో టాటాసంస్థతో కలిసి ఇంక్యుబేషన్ రీసెర్చ్ కేంద్రాల ఏర్పాటుకు సీఎం చంద్రబాబు సారథ్యంలో కృషి జరుగుతోందన్నారు. రక్షణ రంగంలో స్వదేశీ పరిజ్ఞానంతో తయారుచేసిన ఆయుధాలను ఎగుమతిచేస్తున్నామన్నారు. కళాశాల చైర్మన్ మన్నెం రామిరెడ్డి, అడ్మినిస్ట్రేటివ్ డైరెక్టర్ మన్నెం రామసుబ్బారెడ్డి, డైరెక్టర్ మన్నెం అరవింద్‌కుమార్‌రెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎస్.వాసు పాల్గొన్నారు.

తిరుపతి-అనకాపల్లి, విశాఖపట్నం మధ్య ప్రత్యేక రైళ్లు

తిరుపతి(సెంట్రల్), సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): తిరుపతిలో నెలకొన్న రద్దీని దృష్టిలో ఉంచుకొని తిరుపతి-అనకాపల్లి, విశాఖపట్నం మధ్య అక్టోబరులో ప్రత్యేక రైళ్లు ఏర్పాటు చేసినట్లు దక్షిణ మధ్య రైల్వే సీపీఆర్వో ఎ.శ్రీధర్ తెలిపారు. తిరుపతిలో అక్టోబరు 5, 12, 19, 26 తేదీల్లో ఈ ప్రత్యేక రైలు(07481) బయలుదేరి మరుసటి రోజుకు అనకాపల్లి చేరుకుంటుంది. అనకాపల్లిలో ఈ ప్రత్యేక రైలు (07482) అక్టోబరు 6, 13, 20, 27 తేదీల్లో బయలుదేరి మరుసటి రోజు తిరుపతి చేరుకుంటుంది. ● విశాఖపట్నం - తిరుపతి మధ్య ప్రత్యేక రైళ్లు (08583-08684) ఈ నెల 15వ తేదీ నుంచి నవంబరు 25వ తేదీ వరకు రాకపోకలు సాగిస్తాయి. ఈ రైళ్లు విశాఖపట్నంలో ఈ నెల 15వ తేదీ సోమవారం, తిరుపతిలో 16వ తేదీ మంగళవారం బయలుదేరుతాయని సీపీఆర్వో తెలిపారు. తిరుమల ఎక్స్‌ప్రెస్ మార్గంలోనే ఈ ప్రత్యేక రైళ్లు రాకపోకలు సాగిస్తాయని పేర్కొన్నారు.



అంగన్‌వాడీ సిబ్బందికి బాలికను అప్పగిస్తున్న గ్రామస్తులు

గ్రామస్తుల ఔదార్యం

● మతిస్థిమితం లేని బాలికకు ఆసరాగా నిలిచి..

పాకాల, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): మతిస్థిమితం లేని బాలికను గ్రామస్తులు అక్కున చేర్చుకున్నారు. అంగన్‌వాడీ సిబ్బందికి అప్పగించారు. కుందేటివారిపల్లె సమీపంలోని సామిరెడ్డిపల్లె చెత్తసంపద తయారీ కేంద్రం పరిసరాలలో శనివారం సాయంత్రం 15ఏళ్ల మతిస్థిమితం లేని బాలిక అటూ ఇటూ తిరుగుతోంది. అక్కడికి సమీపంలో వ్యవసాయ పనులు చేస్తున్న కుందేటిపల్లెకు చెందిన చెంగల్రాయనాయుడు గమనించాడు. బండిపై కొంతదూరం తీసుకువచ్చాక ఎక్కడికి వెళ్లాలో చెప్పకపోవడంతో మళ్లీ బాలికను అక్కడే వదిలేశాడు. గ్రామంలో సోంపల్లి ఉమాపతినాయుడు, పాల చిన్న, రామచంద్రయాదవ్‌లకు ఈ విషయం చెప్పాడు. దీంతో నలుగురూ కలిసి వెళ్లి చూస్తే బాలిక ఏడుస్తూ కనిపించింది. డాడీ ఇక్కడ వదిలాడని.. అమ్మ డ్వాక్రా డబ్బులు కట్టడానికి వెళ్లిందని పొంతన లేని మాటలు చెబుతోంది. దీంతో వారు గ్రామానికి తీసుకువచ్చారు. ఓదార్చి భోజనం పెట్టారు. సముదాయించి వివరాలు అడగడంతో పేరు చిన్నూ అని, తండ్రి రామచంద్ర నాయుడు, తల్లి నాగమణి అని, ఊరు చంద్రగిరి అని చెబుతోంది. పోలీసుల సూచన మేరకు వారు ఐసీడీఎస్‌కు చెందిన సుజాతకు విషయం చెప్పారు. బాలికను రేణిగుంట అభయక్షేత్రానికి అప్పగించాలని ఆమె సలహా ఇచ్చి ఊరుకుంది. దీంతో గ్రామస్తులు జిల్లా ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లాలని భావిస్తున్న తరుణంలో ఐసీడీఎస్ సూపర్‌వైజర్ కిరణ్మయి స్పందించింది. జయదేవపురం అంగన్‌వాడీ సిబ్బందిని కుందేటివారిపల్లెకు పంపింది. వారు బాలికను సంరక్షణకు తీసుకెళ్లారు.

గూడూరు
సూళ్లూరుపేట/వెంకటగిరి

ప్రభుత్వ భూమి కబ్జా



సాగుకు సిద్ధం చేసిన ఆక్రమణ భూమి

బాలాయపల్లి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని సిద్దాగుంట గ్రామంలో ప్రభుత్వ భూమి కబ్జా కోరల్లో చిక్కుకుంది. వెంకటగిరి మండలం బంగారుపేట నుంచి బాలాయపల్లి మండలంలోని నిడిగల్లుకు వెళ్లే మార్గంలోని సిద్దాగుంట గ్రామం పరిధిలో తారు రోడ్డు ఆనుకుని ఉన్న లక్షలు విలువ చేసే ప్రభుత్వ భూమి ఆక్రమణకు గురైంది. సర్వే నంబరు 113.7లోని సుమారు 20 ఎకరాలను వెంకటగిరి పట్టణానికి చెందిన కొందరు ఆక్రమించి ఎక్స్‌వేటర్‌తో చదును చేశారు. ప్రభుత్వ భూమిని ఆక్రమిస్తున్నారని గ్రామస్తులు ఫిర్యాదు చేసినా రెవెన్యూ అధికారులకు అటువైపు చూడలేదు. స్థానికుల నుంచి వ్యతిరేకత వస్తుండడంతో కొన్నాళ్లు ఊరుకున్నారు. మళ్లీ వారం రోజుల క్రితం రాత్రికిరాత్రే భూమిని దుక్కి చేశారు. లక్షలు విలువైన ప్రభుత్వ భూమిని ఆక్రమించినా అధికారులు పట్టించుకోకపోవడం పట్ల విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈ విషయాన్ని తహసీల్దార్ విజయలక్ష్మి దృష్టికి తీసుకెళ్లగా ప్రభుత్వ భూమిని ఆక్రమించినట్లు తనకు సమాచారం లేదని, విచారించి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

మా ఊళ్ల దగ్గర డంపింగ్ యార్డు వద్దు
ఎమ్మెల్యే విజయశ్రీకి స్థానికుల విజ్ఞప్తి



డంపింగ్ యార్డు కేటాయించిన ప్రాంతాన్ని గ్రామస్తులతో కలిసి పరిశీలిస్తున్న ఎమ్మెల్యే విజయశ్రీ, అధికారులు

సూళ్లూరుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) మా ఊరికి సమీపంలో డంపింగ్ యార్డు ఏర్పాటు చేయొద్దని కొణ్ణంబట్టు, పెరిమిటిపాడు, లక్ష్మీపురం గ్రామస్తులు ఎమ్మెల్యే నెలవల విజయశ్రీకి మొరపెట్టుకున్నారు. కొణ్ణంబట్టు గ్రామ సర్వే నెంబరు 131లో 10 ఎకరాల భూమిని సూళ్లూరుపేట మున్సిపాలిటీ డంపింగ్ యార్డుకు కేటాయిస్తూ కలెక్టర్ వెంకటేశ్వర్ గత నెలలో ఉత్తర్వులు జారీ చేశారు. రెవెన్యూ అధికారులు మున్సిపాలిటీకి భూమి అప్పగించారు. మున్సిపాలిటీ ట్రాక్టర్లు చెత్తను డంపింగ్ యార్డుకు తీసుకెళ్లగా కొణ్ణంబట్టు, పెరిమిటిపాడు, లక్ష్మీపురం గ్రామాల ప్రజలు అడ్డుకున్నారు. తమ గ్రామ సమీపంలో డంపింగ్ యార్డు వద్దంటూ ఆందోళన చేశారు. రెండు రోజుల క్రితం కలెక్టర్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ నేపథ్యంలో ఎమ్మెల్యే అధికారులతో కలిసి శనివారం డంపింగ్ యార్డుకు కేటాయించిన భూమిని పరిశీలించారు. అనంతరం గ్రామస్తులతో మాట్లాడారు. డంపింగ్ యార్డు వద్దనుకుంటే సర్పంచ్ ఆధ్వర్యంలో పంచాయతీ తీర్మానం ఎందుకు చేశారని గ్రామస్తులను ప్రశ్నించారు. తీర్మానం విషయం తమకు తెలియదని, అందువల్లే మీ దృష్టికి తీసుకొచ్చామని గ్రామస్తులు తెలిపారు. ప్రజలకు ఇబ్బంది కలిగేలా ఉంటే అధికారులతో మాట్లాడి డంపింగ్ యార్డుపై నిర్ణయం తీసుకుంటామని ఎమ్మెల్యే చెప్పారు. కార్యక్రమంలో తహసీల్దార్ గోపినాథ్‌రెడ్డి, ఎంపీడీవో మురళీకృష్ణ, టీడీపీ నాయకులు బాలచంద్ర కిషోర్, మాధవనాయుడు, సురేష్ నాయుడు, కరకంబేటి సుబ్రహ్మణ్యం, వంకా రమేష్, శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

పాడిరైతుల అభ్యున్నతికి ప్రభుత్వం చర్యలు



గాలికుంటు వ్యాధి నివారణ టీకా కార్యక్రమం పోస్టర్లను విడుదల చేస్తున్న ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్

గూడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): పాడిరైతుల అభ్యున్నతికి ఎన్డీఏ ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందని ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్ అన్నారు. శనివారం స్థానిక ఎమ్మెల్యే నివాసంలో పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో జాతీయ గాలికుంటువ్యాధి నివారణ టీకా కార్యక్రమం పోస్టర్లను విడుదల చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ వానాకాలంలో పశువులకు గాలికుంటు వ్యాధి సోకే ప్రమాదం ఉంటుందన్నారు. దీనిని నివారించేందుకు ప్రభుత్వం నెలరోజుల పాటు ఉచితంగా పశుసంవర్థకశాఖ ఆధ్వర్యంలో వ్యాధి నిరోధక టీకాలను వేయడం జరుగుతుందన్నారు. పాడిరైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గుండాల లీలావతి, ఆరికట్ల బాలకృష్ణమ నాయుడు, డాక్టర్ సురేష్, డాక్టర్ శ్రీనివాసరావు, డాక్టర్ సుబ్రహ్మణ్యం, డాక్టర్ రాజేష్ తదితరులు పాల్గొన్నారు.

ఎంవీరావు ఫౌండేషన్‌కు సేవారత్న పురస్కారం



పురస్కారంతో లీలామోహన్ దంపతులు

కోట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోట మండలం చెందోడుకు చెందిన ఎంవీరావు ఫౌండేషన్‌కు ప్రజాసేవారత్న పురస్కారం లభించింది. శనివారం పల్నాడు జిల్లా చిలకలూరిపేటలో జయజయసాయి ట్రస్టు ఆధ్వర్యంలో జరిగిన కార్యక్రమంలో ఫౌండేషన్ ప్రతినిధులు ముప్పవరపు లీలామోహన్, విజయలక్ష్మి దంపతులకు ప్రజాసేవారత్న పురస్కారం అందజేశారు. కార్యక్రమంలో జయజయసాయి ట్రస్టు ఛైర్మన్ బాలాజీ, రమేష్‌బాబు, చిలకలూరిపేట మార్కెట్ కమిటీ ఛైర్మన్ కరీముల్లా, మున్సిపల్ ఛైర్మన్ రహంతుల్లా పాల్గొన్నారు.

సీఎం సహాయ నిధి చెక్కుల అందజేత

సూళ్లూరుపేట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): నియోజకవర్గంలో 30 మందికి సీఎం సహాయనిధి నుంచి రూ.22,59,799 లక్షలు మంజూరైంది. ఆ చెక్కులను ఎమ్మెల్యే నెలవల విజయశ్రీ శనివారం లబ్ధిదారులకు అందజేశారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా అధికార ప్రతినిధి తిరుమూరు సుధాకర్ రెడ్డి, రైతు సేవా సహకార సంఘ అధ్యక్షుడు ఏజీ కిషోర్, తెలుగు యువత రాష్ట్ర ఉపాధ్యక్షుడు మాధవ నాయుడు, టీడీపీ నాయకులు అలవల శ్రీనివాసులు, శ్రీనివాసుల నాయుడు తదితరులు పాల్గొన్నారు.

17న జాబ్ మేళా

తడ, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి) తడలోని ప్రభుత్వ ఐటీఐ కళాశాలలో ఈ నెల 17వ తేదీ జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు జిల్లా నైపుణ్యాభివృద్ధి సంస్థ తెలిపింది. శ్రీసిటీ, తిరుపతి, చెన్నైకు చెందిన బహుళ జాతీయ కంపెనీల్లో సుమారు 400కు పైగా ఉద్యోగాలకు ఇంటర్వ్యూలు నిర్వహించనున్నారు. పదో తరగతి, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లమో, డిగ్రీ, పీజీ ఉత్తీర్ణత సాధించి ఉండాలి. అర్హులైన యువతీ, యువకులు ఎన్ఏఐటీయుఎన్‌వైఏఎం డాట్‌ఏపీడాట్ జీవోవీడాట్ ఇన్‌లో రిజిస్ట్రేషన్ చేసుకోవాలి. పూర్తి వివరాల కోసం 9121646661, 9988853335 నెంబర్లను సంప్రదించాలని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి లోకనాథం సూచించారు.

నేడు గూడలిలో ఉచిత వైద్యశిబిరం

కోట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): కోట పట్టణానికి చెందిన జనతా క్లినిక్ వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని మండల పరిధిలోని గూడలిలో ఆదివారం ఉచిత వైద్య శిబిరం జరుగుతుందని నిర్వాహకులు తెలిపారు. స్త్రీలకు సంబంధించిన వ్యాధులు, పురుషులకు కీళ్ల, ఎముకలు, నరాల బలహీనత, షుగరు, బీపీ సమస్యలకు ఉచితంగా పరీక్షలు నిర్వహించడంతో పాటు మందులు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు.





ఓజిలి - గొల్లపల్లి ఆర్‌అండ్‌బీ రోడ్డులో చిల్లమానుచేను సమీపంలో గుంతలు - పెద్దపరియకు సమీపంలోని గుల్లతేలిన రోడ్డు

రహదారులు ఛిద్రం... ప్రయాణం నరకం

ఓజిలి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు ఆర్‌అండ్‌బీ, గ్రామీణ రహదారులు ఛిద్రమైపోయాయి. పెద్దపరియ క్రాస్‌రోడ్డు నుంచి ఇనుగుంట వరకు 22 కిలోమీటర్ల దూరం ఉన్న ఓజిలి - గొల్లపల్లి (ఓజీ) ఆర్‌అండ్‌బీ రోడ్డు గోతులమయంగా ఉంది. ముఖ్యంగా పెద్దపరియ, చిల్లమానుచేను ప్రాంతాల సమీపంలో రోడ్డు అత్యంత దయనీయంగా ఉంది. అలాగే ఓజిలి - కురుగొండ వరకు ఉన్న 7 కిలోమీటర్ల రోడ్డు అడుగడుగునా గుంతలుపడింది. ఈమార్గంలో ఆటోలు, ద్విచక్ర వాహనాలు, కార్లు, బస్సులు నిరంతరాయంగా తిరుగుతున్నాయి. రోడ్డుపై ఉన్న గుంతల కారణంగా ప్రయాణికులు హడలిపోతున్నారు. అదే విధంగా మండలంలోని ముమ్మాయపాళెం, మాచవరం గ్రామాలను కలుపుతూ ఏర్పాటు చేసిన ఆర్‌అండ్‌బీ రోడ్డు కూడా ఇలాగే ఉంది. గత ఐదేళ్లుగా రోడ్ల మరమ్మతులు చేయకపోవడంతో అధ్వానంగా మారాయి. ముఖ్యంగా ఆటోల్లో ప్రయాణం ప్రమాదకరంగా ఉంది. ద్విచక్ర వాహనచోదకులు పలుమార్లు ప్రమాదాలకు లోనయ్యారు. దుస్థితిలో ఉన్న రోడ్లను బాగు చేయాలని కోరుతున్నారు.





గూడూరు లోక్‌అదాలత్‌లో మాట్లాడుతున్న న్యాయమూర్తి రాజేష్ - నాయుడుపేటలో కేసులు పరిష్కరిస్తున్న న్యాయమూర్తి మీనాక్షిసుందరి

లోక్‌అదాలత్‌తో కేసుల సత్వర పరిష్కారం

గూడూరు, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): లోక్‌అదాలత్ ద్వారా కేసుల సత్వర పరిష్కారానికి అవకాశం లభిస్తుందని న్యాయమూర్తి రాజేష్ అన్నారు. శనివారం స్థానిక కోర్టు ఆవరణలో మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో జాతీయ లోక్‌అదాలత్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చిన్నచిన్న గొడవలతో కేసులు పెట్టుకుని కోర్టుల చుట్టూ తిరగడం వల్ల సమయం, నగదు వృధా అవుతాయన్నారు. రాజీ అయ్యే కేసులను సత్వరమే లోక్‌అదాలత్ ద్వారా పరిష్కరించుకోవచ్చునన్నారు. లోక్‌అదాలత్‌లో 104 కేసులను పరిష్కరించారు. కార్యక్రమంలో న్యాయమూర్తి బీవీ సులోచనారాణి, ఏపీపీ లక్ష్మీనారాయణ, న్యాయవాదులు హరిప్రసాద్, అరవ పార్వతయ్య, కోటేశ్వరరావు, మెహబూబ్ బాషా, వివిధశాఖ అధికారులు, కోర్టు సిబ్బంది పాల్గొన్నారు.

నాయుడుపేట టౌన్: స్థానిక కోర్టులో జూనియర్ సివిల్ జడ్జి మీనాక్షిసుందరి ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. సివిల్ కేసులు 4, క్రిమినల్ కేసులు 58 పరిష్కరించారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్య క్షుడు చెంచుకృష్ణయ్య, సీనియర్ న్యాయవాదులు వెందోటి పార్థసారధి రెడ్డి, మండిగ సోమశేఖర్, కిషోర్, చెంగయ్య, దశయ్య, చదలవాడ కుమార్, పసల గంగాప్రసాద్, రఫీ, శ్రీనివాసులు, రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

సూళ్లూరుపేట: జూనియర్ సివిల్ జడ్జి సంయుక్త ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. ముందుగా మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో కక్షిదారులకు అవగాహన కల్పించారు. అనంతరం లోక్ అదాలత్ నిర్వహించి 64 కేసులన పరిష్కరించారు. బార్ అసోసియేషన్ కార్యదర్శి ధర్మనాప్రసాదరావు, సూళ్లూరుపేట సీఐ మురళికృష్ణ, దొరవారిసత్రం ఎస్ఐ అజేయ్ కుమార్, న్యాయవాదులు గణపతి, క్రాంతి, చలపతి తదితరులు పాల్గొన్నారు.

వెంకటగిరి టౌన్: స్థానిక కోర్టులో సివిల్ జడ్జి విష్ణువర్మ ఆధ్వర్యంలో లోక్ అదాలత్ నిర్వహించారు. 100 కేసులు పరిష్కరించారు.





సూళ్లూరుపేటలో మాట్లాడుతున్న న్యాయమూర్తి సంయుక్త - వెంకటగిరి కోర్టులో కేసులను పరిష్కరిస్తున్న జడ్జి విష్ణువర్మ

ప్రజాలు, అధికారుల సహకారంతో జాతర విజయవంతం



సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ

వెంకటగిరి, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ప్రజలు, అధికారుల సహకారంలో పోలేరమ్మ జాతర విజయవంతమైందని ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ అన్నారు. శనివారం స్థానిక తెలుగుగంగ అతిధిగృహంలో ఆయన మీడియాతో మాట్లాడారు. వీఐపీల తాకిడిని తగ్గించి సామాన్య భక్తులకు ప్రాధాన్యం ఇవ్వడంతో అందరికీ అమ్మవారి దర్శన భాగ్యం కల్పించామన్నారు. అమ్మవారి దర్శన టికెట్ల ద్వారా రూ.28.56 లక్షలు, హుండీ ద్వారా రూ.22.21 లక్షల ఆదాయం వచ్చినట్లు తెలిపారు. జాతరను విజయవంతం చేసిన అన్ని శాఖల అధికారులు, సహకరించన ప్రజలకు ధన్యవాదాలు తెలిపారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ ఛైర్మన్ గొల్లగుంట మురళీకృష్ణ, ఈవో శ్రీనివాసులురెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ డైరెక్టర్ శ్రీరామదాసు గంగాధర్, ఏఎంసీ ఛైర్మన్ పునుగోటి విశ్వనాధ నాయుడు, సీఐ రమణ, నాయకులు పులికొల్లు రాజేశ్వరావు, బీరం రాజేశ్వరావు, అవ్వారు సత్యనారాయణ, పప్పు చంద్రమౌళిరెడ్డి, మంకు ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

పశువుల ఎరువుతో మంచి దిగుబడి

పెళ్లకూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): పశువుల ఎరువుతో మంచి దిగుబడి రావడంతో పాటు ఖర్చు తగ్గి లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయాధికారి సీహెచ్ విజయభారతి అన్నారు. శనివారం మండలంలోని చిల్లకూరులో యూరియా వాడకంపై రైతులకు అవగాహన కల్పించారు. పంటలకు అధికశాతం యూరియా వినియోగించడం వల్ల భూసారం తగ్గుతుందని, సహజ ఎరువులను వాడాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ అశోక్, పుట్టయ్య తదితరులు పాల్గొన్నారు.

16న మండల సమావేశం

వెంకటగిరి టౌన్, సెప్టెంబరు13(ఆంధ్రజ్యోతి): మండల సర్వసభ్య సమావేశం ఈనెల 16న నిర్వహించనున్నట్లు ఎంపీడీవో గుణశేఖర్ రెడ్డి శనివారం తెలిపారు. అన్నిశాఖ అధికారులు, ప్రజాప్రతినిధులు హాజరుకావాలని కోరారు.

15న ఆటో డ్రైవర్ల ధర్నా

నాయుడుపేట, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): ఆటోడ్రైవర్ల సమస్యల పరిష్కారం కోసం ఈనెల 15న కలెక్టరేట్ వద్ద ధర్నా నిర్వహించనున్నట్లు సీఐటీయూ నేత ముకుంద తెలిపారు. శనివారం కరపత్రాలను విడుదల చేశారు.

కలవకొండ దాహార్తి తీర్చేందుకు చర్యలు

చిల్లకూరు, సెప్టెంబరు 13(ఆంధ్రజ్యోతి): మండలంలోని కలవకొండ గ్రామస్తుల దాహార్తి తీర్చేందుకు ఎమ్మెల్యే పాశిం సునీల్‌కుమార్, టీడీపీ సీనియర్ నాయకుడు తానంకి నానాజీ చర్యలు చేపట్టారని టీడీపీ మండల ప్రధాన కార్యదర్శి నెల్లటూరు చిరంజీవి తెలిపారు. శనివారం తాగునీటి పైపు లైన్లు ఏర్పాటు చేసేందుకు పనులను ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తమ పంచాయతీలోని ప్రజలు ఎన్నో ఏళ్లుగా తాగునీటి కోసం తీవ్ర ఇబ్బందులు పడుతున్నామన్నారు. సమస్యను ఎమ్మెల్యే దృష్టికి తీసుకువెళ్లడంతో ఆయన చేడిమాల బోరు పాయింట్లు నుంచి కలవకొండ వరకు తాగునీటి పైపులైను ఏర్పాటు చేసేందుకు రూ.19 లక్షలు నిధులను మంజూరు చేయించడం జరిగిందన్నారు. తాగునీటి సమస్య పరిష్కారాని కృషి చేసిన ఎమ్మెల్యే పాశిం సునీల్ కుమార్, తానంకి నానాజీ, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో శ్రీనివాసులు, దయాకర్, కృష్ణయ్య, సుధీర్, గ్రామస్తులు పాల్గొన్నారు.

గిరిజనులకు అండగా ఉంటాం: టీడీపీ

కోట, సెప్టెంబరు 13 (ఆంధ్రజ్యోతి): గిరిజనులకు ప్రభుత్వ సంక్షేమ పథకాలు అందించడంలో అన్ని విధాలుగా అండగా ఉండి ఆదుకుంటామని టీడీపీ సీనియర్ నాయకుడు, పెన్నక్కచెరువు సాగునీటి సంఘం అధ్యక్షుడు నెల్లూరు మోహన్‌రెడ్డి అన్నారు. మండల పరిధిలోని నెల్లూరుపల్లిలో 30 గిరిజన కుటుంబాలకు కొత్తగా మంజూరైన ఉపాధిహామీ కార్డులను శనివారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అవగాహన లోపంతో గిరిజన కుటుంబాలు ఏళ్ల తరబడి ఉపాధి కార్డులు లేక పనులు పొందలేకపోయరన్నారు. ఉపాధి పథకంలో గిరిజనుల పేర్లు నమోదు చేసి కార్డులు అందజేశామన్నారు. కార్యక్రమంలో ఎంపీటీసీ వేనాటి నారాయణ, టీడీపీ నాయకులు మురళీరెడ్డి, సుబ్రహ్మణ్యం, శంకర్‌రెడ్డి, రమేష్‌రెడ్డి, వంశీరెడ్డి, సుధీర్‌రెడ్డి, కిరణ్‌కుమార్‌రెడ్డి తదితరులు ఉన్నారు.